రావుగారి కాదర్శాలు లేవు. వ్యక్తిగత మైన కక్షలో ఎంతైనా చేయగల సమర్థుడాయన. ఆయన వెనుక రాజకీయ శక్తులున్నాయి. అలాంటివారికి బానిసలుగా పడి ఉండడంలోనే మాబోంట్లకు మనుగడ ఉంది. కేవలం మనుగడ గురించి ఆలోచించే మేము భవిష్యత్తు గురించి ఆలోచించలేము...." అని- "ప్రభాకరానికి గుట్టు తెలియదు. అందువల్ల అతడేమిటో చూడగానే అందరికీ తెలిసిపోతుంది. అలా తెలిసినా తెలియకున్నా మేమంతా కూడా అతడివంటివారిమే-" అనేసి వెళ్ళిపోయాడాయన.

బాపయ్య, ప్రభాకరం- వీరంతా చదువుకున్నవారు.

న్యాయం జరుగడం తప్పనిసరి అని తెలిసికూడా న్యాయంకోసం పోరాడక పోవడంలోనే తమకు మనుగడ ఉన్నదని భావిస్తున్నవారు- స్వతంత్ర భారత పౌరులు.

యథారాజా- తథాప్రజా అంటే ఏమిటో అనుకున్నాను.

తమనేలుకుందుకు ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులే బానిసలుగా మసలుతున్నంతకాలం- ప్రజలకు బానిస మనస్తత్వమెలా విడిచిపెట్టగలదు?

నేనాలోచిస్తున్నాను.

మార్పు నాక్రింది ఉద్యోగుల్లోకాదు- నాలోనే రావాలేమో!











ఇద్దరూ ఒక మూలగా కూర్చుని తమ చేతులలోవున్న పాకెట్లను బ్యాగ్‌లో వేసుకొని రెండు మటుకు విప్పి ఆ తెల్లటి పౌడరును నీటిలో కలిపి, సిరంజిలో ఎక్కించి, ఇద్దరూ ఇంజక్ట్ చేసుకుని అలాగే సోలిపోయారు.

తెల్లవారుతోంది అని తెలియచేయాలన్నట్లు పక్షులు శబ్దం చేస్తూ చెట్ల నుండి ఎగిరిపోతున్నాయి. చంద్రుడు తన పని పూర్తయినట్లు మరుగున పోతుంటే ఇక మీదట నా పని ఆరంభం అన్నట్లు వరుణుడు మెల్లమెల్లగా తన స్థలాన్ని ఆక్రమిస్తున్నాడు. అప్పుడప్పుడే మత్తునుండి మేల్కొంటున్న సహోదర బృందం ఒక్కొక్కరుగా తమతమ గమ్యాన్ని వెదుక్కుంటు, కేబిల్ కార్ల దగ్గర స్టీమ్ బోటు దగ్గరకు పోతున్నారు.

మొదటగా తెలివిలోకి వచ్చిన సూజి అంజును తట్టి లేపింది. మత్తుగా కళ్లు విప్పిన అంజు అర్ధకంగా ఒళ్లు విరుచుకుని లేచి నలువైపులా చూసింది అప్పుడుకాని తను ఎక్కడ ఉందో తెలిసి రాలేదు. రాత్రి జరిగిందంతా కలా నిజమా అన్నట్లు సూజి మొహంలోకి తేరిపార చూసింది.

"త్వరగా! అంజూ! మనం ఇల్లు చేరాలి. ఆఫీసుకు టయిమ్ అయింది. ఎనిమిదిన్నరకల్లా ఆఫీసులో వుండాలి. లేకపోతే ఆ కోతి గంతులేస్తాడు." పెద్ద పెద్ద అంగలు వేస్తూ ముందుకు నడుస్తోంది. అంజుకు శరీరం ఇంకా మత్తుగా వుంది, కాళ్ళలో ఎలాంటి బలం లేనట్లుగా తడబడుతూ అడుగులేస్తుంటే తిరిగి అక్కడే పడుకుని నిద్రపోవాలని చూస్తోంది. వెంటనే భరత్, మధు గుర్తొచ్చారు. నీరసంగా సూజి ప్రక్కనే కేబిల్ కారులో ఎక్కి కూర్చుంది. వచ్చినప్పుడున్న ఉత్సాహం ఇప్పుడు మచ్చుకైనా లేదు. ఇల్లు చేరి పడుకుంటే చాలని అనిపిస్తోంది. ఇద్దరూ కారు దిగి తమ ఫ్లాట్ దగ్గరగా ఆగారు. ముందు సూజి, ఆ వెనుక అంజు దిగింది. సూజిని అనుసరిస్తున్న అంజు ఎందుకో తల ఎత్తి చూసింది. అప్పుడే స్విమ్మింగ్ పూల్‌నుండి వస్తున్నాడు భరత్. ఆకు పచ్చటి చెక్స్‌వున్న స్విమ్మింగ్ డ్రస్‌లో వున్నాడు. నీళ్ళు కారుతున్న శరీరాన్ని టవల్‌తో తుడుచుకుంటూ తల పైకెత్తిన అతను ఆశ్చర్యంతో అంజు వైపు చూశాడు. అంజు కాళ్ళలో నీళ్ళు కారాయి. అరచేతులలో చెమ్మ ఊరుతోంది. కళ్ళు తిప్పుకుని లిఫ్టు దగ్గరగా వచ్చింది. లిఫ్టు క్రిందకు తెరుచుకునే లోపలనే భరత్ వాళ్ళ దగ్గరగా వచ్చి చేరాడు. అదే లిఫ్టులో ముగ్గురు పైకి రాగానే అంజు సూజిని, అతనిని వెనుకకు వదిలి ముందుకు పరుగెత్తింది. అంతకన్న వేగంగా అతని అడుగులు ఆమెను సమీపించి ఒక్కసారిగా ఇద్దరూ హాల్లోకి వచ్చి చేరారు. మధు సోఫాలోనే నిద్రపోతున్నాడు.



"మధూ!" భరత్ అరచిన అరుపుకు ఎగిరి పడ్డాడు అతను.

"ఏమిటన్నయ్యా! వదిన వచ్చిందా!" నిద్రమత్తు వదుల్చుకుని తల ఎత్తి చూశాడు. అంజు తన గదిలోకి తప్పించుకొనిపోను చూసింది.

"ఆగు!" భరత్ గొంతు బుల్లెట్‌షాట్ శబ్దం చేసింది.

"మధూ! నిన్న ఉదయంనుండి ఇప్పటివరకు ఎక్కడికెళ్ళిందో కనుక్కో! నాకు వెంటనే సమాధానం కావాలి." ఏమాత్రం ఆగలేనట్లుగా అసహనంగా అరిచాడు.

"వదినా! మిమ్మల్ని చూసి ఇరవయినాలుగు గంటలు అయింది. ఎక్కడికెళ్ళారు. కనీసం చిన్న స్లిప్పయినా, రాసి పెట్టాలని తెలియదా మీకు. రాత్రంతా నిద్ర అన్నది లేకుండా ఇద్దరం ఎదురు చూస్తున్నాం. ఎన్ని హోటల్సుకు ఫోన్ చేశాం. ఎన్ని క్లబ్బులు వెతికాం. మరీ చిన్న పిల్లలా బిహేవ్ చేస్తున్నారు. మా ఆత్రుత తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటివరకు ఎక్కడున్నారు వదినా!" మధు బాధతో కూడిన కోపంతో అడిగాడు.

అంజు పక్కున నవ్వింది. తనలో ఏ మూలో మిగిలిన మందు పని చేస్తున్నది.

"మీకు నవ్వుగా వుంది. మా ఆత్రుతను అర్థం చేసుకోవడంలేదు." నిష్ఠూరత మేళవించిన గొంతుతో అన్నాడు.

"సారీ! ఎదురు చూస్తున్నాం అన్నావే అందుకు నవ్వు వచ్చిందిలే! వెతికాను ఎదురు చూశాను అను మధూ! ఒప్పుకుంటాను. బహు వచనం ఉపయోగించకు. నా గురించి ఎవరూ దిగులు పడకండి. నేను సలక్షణంగా వున్నాను. సూజీతో నిన్నంతా ఈ నగరంలోవున్న ముఖ్యమైన ప్రదేశాలు చూశాను. రాత్రి తన స్నేహితులమధ్య గడిపాను. అంతే! మరే విధంగా చెడిపోలేదులే! నాకు నిద్ర వస్తోంది," అక్కసుగా అంటూ తన గదిలోకి వెళ్ళి తలుపువేసింది.

రోజులు జరిగేకొద్దీ అంజు పూర్తిగా మత్తు మందుకు బానిస అయింది. ఎప్పుడెప్పుడు రాత్రి వస్తుందా అని ఎదురు చూడడమే ముఖ్యమైన పని అయిపోయింది. పగలు ఏ విధంగానూ తగిన సమయంకాదు. వంటావిడకు ఏదైనా అనుమానం తగిలినా అది భరత్‌కు, మధుకు చేరుతుంది. తన అలవాటును మధు కూడా అసహ్యించుకుంటాడు. ఇద్దరూ తనను సూజీతో కలవనీయక కట్టుదిట్టం చేయవచ్చు. అందుకే తను ఎంతో జాగ్రత్త పడుతున్నది. తనకు తెలుసు తను క్రమేణా తన అందాన్ని, తనలోవున్న చురుకుతనాన్ని అన్నీ ధారాదత్తం చేస్తున్నదని, అద్దంలో తన మొహం చూచుకున్నప్పుడు ఇది తన రూపమా అని భయపడుతున్నది. లోతుకుపోయిన కళ్లు, పీక్కుపోయిన చెంపలు, శరీరంలో బలం తగ్గి సన్నగిల్లిన చేతులు, కాళ్ళు, పొట్ట తప్పించి మిగత తన శరీరావయాలు క్షీణ స్థితిలోకి దిగజారుతున్నాయని, కాని తను ఏమైనా పరవాలేదు. తనకు

కావలసింది మనశ్శాంతి. భరత్‌కు ఎదురుపడి చాలారోజులే అయింది. తను కావాలనే తప్పుకు తిరుగుతుంది. అతను ఒక డాక్టరు. తన లోపాలను అతి సులువుగా కనిపెట్టగలడు. చిత్రంగా తన మనస్సులోనుండి భరత్ రూపం కొంచం కొంచంగా తప్పుకుంటున్నది. తన తల్లిదండ్రులను, చెల్లెలిని పూర్తిగా మరిచిపోయింది. మధును కూడా ముందులా స్నేహంగా, అభిమానంగా చూడలేకపోతున్నది. మొదట మధు తన అన్నకొరకు తనను ఆదరించాడని, తన పరితాప పరిస్థితిని గుర్తించికాదని అనిపిస్తోంది. తనను తననుగా గుర్తించి, ఆదరించి- అభిమానించి, ఈమాత్రం మనఃతృప్తి, మనశ్శాంతి పొందగలిగినందుకు కారణం తను ఒక్కతే! తనకి లోకంలో సూజి తప్ప ఎవ్వరూ లేరు. తను అనాధ, ఒంటరి. సుడిగుండంలో చిక్కుకుపోతున్న గడ్డి పరక. తనకు ఎవరి దృష్టిలో విలువలేదు. తనమీద జాలి తలచి చేయి అందించి తనను బయటపడవేసే వాళ్ళు ఎవ్వరూ లేరు. తన ఆలోచనాగతి ఆ విధంగా పోతుండే, తన నడవడికలలోను, తన అభిరుచులలోను, తనలో ఉన్న తెలివితేటలలోను మార్పు వయస్సు అనుభవాలద్వారా కలగసాగింది.

పోనుపోను మనస్సు పక్వత చెందుతుంటే, ముందుమాదిరి కాలక్షేపం కొరకు చదువుతున్న రొమాంటిక్ నవలలను వదిలి, రాక్స్‌లోవున్న అన్నిరకాల ఇంగ్లీషు జర్నల్స్ చదవడం మొదలు పెట్టింది. పగలు టి. వి. లో విదేశాల డాక్యుమెంటరీలు చూడడం, వాళ్ళవాళ్ళ అలవాట్లు, జీవన విధానం అర్థం చేసుకోవటానికి, శ్రద్ధగా న్యూస్ పేపర్లు చదవడం, ప్రపంచంలోని సాధక బాధకాలు అర్థం చేసుకోడానికి ప్రయత్నించడం ఇలా తన దిన చర్యలలో క్రొత్త మార్పులతో రోజులు గడుపుతుండెది. ఒకనాడు సూజి ఎవరికీ తెలియకుండా రెండు వీడియో క్యాసెట్లు అంజు చేతులలో పెట్టింది,

"ఏమిటిది సూజీ! ఈమధ్య ఈ పిక్చర్లు చూడడం బోర్‌గా వుంది. ఒకే కథ, ఒకే రకం ఫైట్లు మార్పు అన్నది లేదు," వాటిమీద ఇంట్రస్టులేనట్లుగా మాట్లాడింది.

"ష్! చిన్నగా మాట్లాడు. ఒక రోజున జూరింగ్ బర్డ్స్ పార్కులో నన్నొక ప్రశ్న అడిగావు గుర్తుందా! ఆనాడు నానోటిగుండా సమాధానం ఇవ్వడానికి వెనుకాడాను. ఇదిగో నీకు కావలసిన జవాబు ఈ రెండు క్యాసెట్లలో వుంది, జాగ్రత్త. మధు కయినా తెలియకూడదు. తిరిగి భద్రంగా రేపు ఇవ్వు." సూజి అక్కడినుండి వెళ్ళిపోగానే ఏమయి వుంటుందా అన్న ఆతృతతో త్వరగా తన రూమ్‌లోకి వచ్చి తలుపు లాక్ చేసుకొని టేప్‌ను వీడియోలోవేసి, టి. వి. ఆన్ చేసింది.

వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. చాలా లోగొంతుకతో మాట్లాడుతున్నారు. అది ఆస్ట్రేలియన్ ఫిల్మ్ అని, ఏవో కొన్ని కాపీరైట్ ఇన్



ఫర్మేషన్ ఇచ్చి వున్నారు. ఒక ఐదు నిమిషాలు గడిచేటప్పటికి అంజు శరీరం జుగుప్సతో జలదరించసాగింది. నరనరం అసహ్యంతో నిండిపోతుంటే చటుక్కున టి. వి. ఆపింది. తను పోర్నోగ్రఫీ ఫిల్మ్ గురించి, చదివింది, వినింది కాని దాని అర్థం ఈనాడు తెలుస్తున్నది. రెండవది వేసి తిరిగి ఆన్ చేసింది. అది యూరోపియన్ ఫిల్మ్. అది మరీ ఘోరంగా వుంది. చిన్నచిన్న పిల్లలచేత పెద్ద వాళ్ళు చేయించే నీచాతి నీచమైన క్రీడలు. పిల్లలకు ఏదైతే తెలియకూడదని పెద్దలు జాగ్రత పడతారో అదే నాగరికత పేరుతో, అదే పెద్దలు ఇలా డబ్బుకొరకు దిగజారుతున్నారంటే, ఓహ్! భగవాన్, ఈ అల్ప కోరికకొరకా పురుషుడు స్త్రీని అన్ని విధాల బాధ పెడుతున్నాడు. శరీరమంతా కంపిస్తుంటే తిరిగి టి. వి. ఆఫ్ చేసి ఆ రెండు కాసెట్లను తీసి పడక క్రింద దాచింది.

అంజు ఆలోచనలు ఒక్కసారిగా వెనక్కు పోయాయి. అంటే తను— అవును. తనను ఎవరో కాముకుడు ఒంటరిగా దొరికానని, పశువులా తన కోరికను తీర్చుకుని నలిగిపోయిన పూవును విసిరివేసినట్లు విసిరిపోయాడు. తనకిప్పుడు అర్థమయిపోయింది. పేపర్లలో చదువుతున్నప్పుడు, టి.వి.లో న్యూస్ చూపుతున్నప్పుడు యూరోపియన్ కంట్రీస్‌లో జరిగే ఇలాంటి హేయమైన కార్యక్రమాలు తల్లిదండ్రుల సహకారంతో ఏ విధంగా కొన్ని ఆర్గనైజేషన్స్ ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు అన్నది స్లయిడ్స్ ద్వారా చూపుతుంటే అందులోని లోతుపాతులు అర్థంకాక సగంలో తీసి, మరికొంత తెలియనట్లుగా ఉండిపోయింది.

ఓహ్! ఇన్ని రోజులు తన ప్రపంచం ఎంతో చిన్నది. తల్లిదండ్రుల అనురాగం, చెల్లెలితో చిలిపి తగవులు, స్నేహితులతో కబుర్లు, సినిమాలు, పత్రికలు ఇవి మటుకే తనకు తెలిసిన ప్రపంచం. కాని ఇప్పుడు తెలుసుకుంది, తను చదివిన నవల్సు కేవలం ఊహల్ని, కాలక్షేపాన్ని మటుకే అందచేశాయని, తనలో బొత్తిగా ఎలాంటి విజ్ఞానాన్ని ఇవ్వలేదని.

మరుసటిరోజు సూజీకి అందచేస్తూ ఇలాంటివి మరొకమారు ఇవ్వవద్దని కోరింది. సూజీకి ఇది ఒక అనుకోని షాక్! నీకు ఇవి ఇచ్చి నీ మనస్సును కలతపరచాలనికాదు అంజూ! నీవు ఎంతో అమాయకంగా పసిపాపలా వుండక సర్వం తెలుసుకుని ఉండడం మంచిదని ఇచ్చాను, అంతకుమించి మరొక దురుద్దేశం కాదు." అంది.

ఆ సాయంత్రం మధు త్వరగా వచ్చాడు. స్నానం అది పూర్తి చేసుకుని చల్లగా తిని ముందరున్న వరండాలోకి వచ్చాడు. ఈమధ్య వదినతో ఎక్కువగా మాట్లాడడం లేదు అనుకుంటు "వదినా!" అని పిలిచాడు.

"ఏమిటి మధూ!" అంజూ దగ్గరగా వచ్చి నిలిచింది.

"క్రింద రాత్రికి మా స్నేహితుడు బర్త్‌డే పార్టీ ఇస్తున్నాడు. మీరు వస్తే ఇద్దరం పోదాం," అన్నాడు.

"సారీ మధూ! నేను రాలేను. నీవు వెళ్ళి యంజాయ్ చేసిరా!" అంది.

అతను పరీక్షగా అంజు మొహంలోకి ఆశ్చర్యంగా చూశాడు. ఆ మధ్య తను ఒక రోజంతా ఇంటివద్దలేదని కొంచం కఠినంగా మాట్లాడాడు. ఆనాటి నుండి వదిన తప్పించుకునే తిరుగుతున్నది! కాని ఆమె ప్రవర్తనలోన్నేకాదు, రూపంలోను మార్పు.

"వదినా! మీరేం అలా ఉన్నారు. మీ మొహం ఏం అలా వాడిపోయివుంది, ముందున్న మీ అందమైన రూపం, ఇప్పటి రూపం ఎంత వ్యత్యాసం. అసలు మధ్యాహ్నం భోంచేస్తున్నారా! రాత్రి సరిగా తినడం మానుకున్నారు. అడిగితే నహించడం లేదు అనడం! ఇలా వుంటే మీకు డెలివరీ అవడం కష్టం అని డాక్టరు చెప్పలేదా!

"అది నీవు అభిమానంతో అనే మాటలు మధూ! నేను మామూలుగానే వున్నాను. వయసయిపోతుంది కదూ! అందుకే నా మొహంలో మార్పులు, మరేం లేదు,"

తక్కున నవ్వాడు మధు, "ఇంతకీ వదినగారి వయసెంత?"

వద్దెనిమిది పూర్తయి వందొమ్మిది జరుగుతోంది."

"థాంక్‌గాడ్! ఎనభై ఒకటి పూర్తయి తొంభై ఒకటిలోకి వచ్చానని చెప్ప లేదు, అందుకు సంతోషం." మధు పకపక నవ్వేతుంటే అంజు కూడా నవ్వింది.

"ఇంతకీ పార్టీకి రానట్లేనా! లేక ఆ రోజు కోపంగా మాట్లాడానని నామీద అలుకా! నిజం వదినా! ఆ రోజు అన్నయ్యా. నేను పిచ్చివాళ్ళమే అయ్యాం. మీరు ఈ వూరికి క్రొత్త. అన్నయ్య సూజీని నమ్మడు. అన్నయ్య హోటల్సు, నేను నైట్ క్లబ్బులు, ఒక్కటి వదలకుండా వెతికాం. అసలు అన్నయ్య ఎందుకో బాధ పడుతున్నాడు. మాటమాటకి నుదురు కొట్టుకోవడం, ఇదంతా తన వలననే జరిగిందని పదేపదే అనడం, నాకు అయోమయంగా ఉండిపోయింది. ఏమిటనీ అడగను ధైర్యం చాలలేదు. ఇద్దరం తెల్లవారు ఝామున ఇల్లు చేరాం. నేను అలాగే సోఫాలో నిద్రపోయాను. అన్నయ్య అయితే కన్ను మూయలా! అందువలననే కొంచం కఠినంగా మాట్లాడవలసి వచ్చింది."

అంజు మనస్సు అర్ధమయింది. కాని వెంటనే ఆ రాత్రి భరత్ అన్న మాటలు గుర్తుకొచ్చి మధుకు ఎలాంటి వివరణ ఇవ్వలేక పోయింది.

"మరచిపోయాను. రేపు మిమ్మల్ని క్లినిక్‌కు తీసుకుని రమ్మని మల్లాల్ ఫోన్ చేసిందట. అన్నయ్య నన్ను పిలుచుకుని చెప్పమన్నాడు. వుదయం త్వరగా నిద్రలేస్తే మనం ఇద్దరం పోదాము."

అంజుకు గుండె గతుక్కుమంది. సూజీ చెప్పింది. డ్రగ్ తీసుకునే వాళ్ళు యూరిన్ టెస్ట్ చేయించుకుంటే తను డ్రగ్ అడిక్ట్ అని డాక్టరుకు తెలిసిపోతుందట. తన రహస్యం బట్టబయలయిందంటే ఇక తనకు ఈ నరకంనుండి విమోచనమే లేదు.



"నేను చచ్చినా మరొకమారు చెకింగ్‌కు వెళ్ళను. ఆ క్లినిక్ వాసన నాకు పడదు. నన్ను నా మానాన వదిలెయ్ మధూ! మీ అన్నయ్యను నా గురించి ఆలోచించడం మానమని చెప్పు. మీ అన్నయ్యేకాదు నీవు కూడా! ఇకమీదట నీవు నా గురించి శ్రద్ధ తీసుకోవడం మానెయ్. నీ పై చదువు, నీ వివాహం వీటి గురించి ఆలోచించు. అనవసరంగా నీ అపురూపమయిన వయస్సును, కాలాన్ని నాకోసం వెచ్చించక నీ అభివృద్ధిని పెంచుకునే దానికి ప్రయత్నం చెయ్! నాకు తెలుసు. నేను త్వరలోనే మరణాన్ని ఆహ్వానించబోతున్నానని. నేను ఇంతకుమించి ఏం చెప్పలేను.

మధు స్టన్నయినట్లు నిలబడిపోయాడు. మరి కొద్ది సేపటికి తేరుకుని "వదినా....మీరు....మీరేనా అలా మాట్లాడుతున్నది. మీరు మునుపటి వ్యక్తికారు. మీలో చాలా మార్పు. నాకు తెలుసు మీరు సూజీతో స్నేహం చేసిన తరువాతే ఇలాంటి మార్పు. సూజీ అన్నయ్యమీద కసి తీర్చుకుంటోంది. అది మీకు అర్ధం కాదు. నేను చెప్పినా నమ్మరు. కాని ఒకటి మటుకు నిజం, మీరు నమ్మినా నమ్మకపోయినా అన్నయ్య మీమీదే తన ప్రాణాన్ని నిలుపుకుని వున్నాడు. ఇక నా గురించి తెలుసుకోవలసిన జాగ్రత్తలు ఏవో నాకు తెలుసు. అవి ఎప్పుడు పాటించాలో కూడా తెలుసు." విసురుగా అక్కడనుండి వెళ్ళిపోయాడు. అంజు అక్కడే కుర్చీలో కూలబడి చేతులతో మొహాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడవ సాగింది.

మధ్యాహ్నపు వేళ. హాల్లో భరత్ గొంతుతోపాటు మరొక క్రొత్త గొంతు వినిపిస్తోంది. అంజుకు ఆశ్చర్యంగా వుంది. ఇలా మధ్యాహ్నపు వేళ భరత్ ఇంటికి రావడం. అయినా తనకెందుకన్నట్లు పుస్తకంలో లీనమయింది.

"నిన్ననగావచ్చి ఈ రోజు గుర్తుకొచ్చానా! అయినా హోటల్లో దిగడమేమిటి, ఇక్కడ గెస్ట్ రూమ్ ఖాళీగానే వున్నప్పుడు, నేను కోలాలంపూర్‌కు వస్తే నీవు నా మొహం చూసేట్లు లేవు." భరత్ గొంతులో కోపంతో కూడిన నిష్ఠూరత వుంది.

"అబ్బ! అది వదులు నాన్నా! చెప్పానుగా! నిన్న నా పేషంట్‌తోపాటే ఆ పాత తల్లిదండ్రులు వచ్చారని. వాళ్ళకు అన్ని ఆరేంజ్‌మెంట్స్ చేయడం, నిన్ననే పాపను హాస్పిటల్లో అడ్మిట్ చేయడం, ఇలాగే సరిపోయింది. నిన్ను కలుసుకోవాలనే ఉన్నా! కాని కేస్ స్టడీచేయడంలో ఆలస్యమవడం, ఆ తరువాత అలసట, అంతే ఆదమరచి నిద్రపోయాను. ఈ రోజు హాస్పిటల్‌కు రాగానే గుర్తుకొచ్చింది, నీవు ఇదే హాస్పిటల్లో స్పెషలిస్టుగా వున్నావని, హార్ట్ సర్జరీ కేసులు ఎక్కువగా నీ చేతుల మీదుగా జరుగుతున్నవని, మీ కో డాక్టరు నరేంద్రన్ చెప్పగానే ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

"ఇంతకీ ట్రబుల్ ఏమిటి? ఎవరి పాప."

"చైనీస్ అమ్మాయి,, వయస్సు ఆరు సంవత్సరాలు. ఆ తల్లిదండ్రులకు ఒకే అమ్మాయి, గుండెలో రంధ్రం ఉంది. ఎక్స్‌రేలు అన్నీ తీసి చూశాం. వెంటనే ఆపరేషన్ జరుగకపోతే పాప ప్రాణానికే ముప్పు. వాళ్ళ బాధ చూడ లేక పోతున్నాననుకో! నీకు తెలిసిన విషయమేగా! కోలాలంపూరులో హార్టు కేసులు, ఎనభై శాతం, ఫారిన్ కంట్రీస్‌కు పోతున్నవని. భరత్ ఆ పాపను నీ చేతులలో పెడుతున్నాను. నేను తిరిగి రేపు ఫ్లైట్‌కు వెళ్ళిపోతున్నాను. ఆపరేషన్ రోజున వస్తాను. ఇంతకీ ఇల్లాలెక్కడ? రాహులనే ప్రయత్నం. ఎక్కడా తీరిక లేక చస్తున్నాననుకో! మా శ్రీమతిగారు చెల్లాయికి ఇమ్మని ప్రజంటేషన్ ఇచ్చింది. మీరు మరచిపోతారు, ప్యాంట్ పాకెట్‌లో పెట్టుకోండి అది ఇంజక్షన్‌లా తొడ మీద పని చేస్తుంది అని చెప్పింది. త్వరగా పిలువు. ఈ భారాన్ని వదిలించుకోవాలి," భరత్ నవ్వాడు అతని మాటలకు.

"నీవే పిలువు. అదే తనగది," చేయిచాపి చూపించాడు,

"పేరు తెలియందే! ఇంతకీ ఘోషాలో పెట్టావా ఏమిటి! ఇంత సేపు మనం మాట్లాడుతున్నా బయటకు రాలేదు. ఎప్పుడెప్పుడు నీ మనస్సు దోచుకుని కొంగున ముడివేసుకున్న చెల్లాయిని చూడాలని ఆతృతతో నేనేడుస్తుంటే!"

"అందుకే అంత త్వరగా వచ్చావు." భరత్‌లో ఇంకా మిగిలివున్నాయి కోపపు ఛాయలు. అంజుకు వాళ్ళు మాట్లాడుకునే ప్రతిమాట వినిపిస్తున్నది. గది బయట అడుగుల చప్పుడు వినిపించగనే చేతిలోవున్న బుక్కు పడకమీద పెట్టింది.

ఇంతలో "మిసెస్ భరత్! మిమ్మల్ని చూడాలని కోలాలంపూర్‌నుండి పనిగట్టుకుని వచ్చాను. మీరు లోపల దాక్కుంటే ఎలా. తలుపు తీస్తారా" అన్న మాటలు వినిపించగనే చటుక్కున తలుపు తెరిచింది.

"గుడ్ ఆఫ్టర్‌నూన్! నా పేరు చంద్రశేఖర్. మీవారు నేను మెడిసన్‌లో క్లాస్‌మేట్స్‌ము. అంతేకాదు బెస్ట్ ఫ్రండ్స్. నన్ను నేనే పరిచయం చేసుకున్నా. మీ గురించి చెప్పి వీనులు విందు చేయండి." అంజుకు నవ్వు వచ్చింది. అతను డాక్టరయివుండి హ్యూమరస్‌గా మాట్లాడుతున్నందుకు.

"నమస్తే! నా పేరు అంజన. సెకండ్ బియ్యస్సీ సగంలో గుడ్‌బై చెప్పాను. మీకు డ్రింక్స్ తెస్తాను" అక్కడినుండి కదలబోయింది.

"అదంతా మీ సర్వెంట్ సప్లై చేసింది. మీరు అలా వచ్చి కూర్చుంటే సంతోషిస్తాను." అంజుకు బిడియంగా వుంది. ఈమధ్య భర్త ఎదుటపడి చాలా రోజులయింది. అతను అక్కడ కూర్చుని ఉండగా తను ఎలా అక్కడ కూర్చుంటుంది. ఇరకాటంలో చిక్కుకున్నట్లు వుంది తన పరిస్థితి. డాక్టర్ చంద్రన్ పాకెట్‌లోనుండి చిన్నగ్లాస్ బాక్స్‌తీసి అంజు చేతిలో పెట్టాడు. "ఇది మీ వదిన



గారు మీకు ఇవ్వమన్న ప్రజంట్. ఆవిడ మిమ్మల్ని త్వరలో సందర్శిస్తామని తెలవివ్వమన్నారు."

పక్కున నవ్వింది అంజు తనను తాను మరచి అతను పకపక నవ్వాడు.

అంజు ఒక్కక్షణం అన్నీ మరచిపోయి చనువుగా "మీరు ఇంట్లోను ఇలానే హుషారుగా ఉంటారా!" అంది.

"మరి, నేను దేవదాసనుకున్నారా ఏమిటి! చేతిలో బాటిల్‌తో విషాదగీతాలు ఆలపించను."

అంజుకు నవ్వు ఆగలేదు. అతను అంజువైపు తదేకంగా చూశాడు.

"కంగ్రాట్యులేషన్స్ భరత్! నిన్ను మనసారా అభినందిస్తున్నాను. భివరకు ఇలాంటి బంగారుబొమ్మను సహచరిణిగా చేసుకున్నందుకు."

భరత్‌లో ఎలాంటి కదలిక లేదు. మొహంలో ఎలాంటి భావం లేదు. అంజు చటుక్కున కిచెన్‌లోకి దూరింది.

భోజనానికి అన్నీ టేబిల్‌మీద సర్ది వంటావిడను పంపింది. స్నేహితులిద్దరూ చేతులు కడుక్కుని టేబిల్ దగ్గరగా వచ్చి కూర్చున్నారు. అంజు వడ్డిస్తుంటే ఆమెవైపు చూస్తున్న చంద్రన్, భరత్ సిస్టర్‌ని సరిగా చెక్ చేయిస్తున్నావా! చూస్తుంటే నెలలు నిండుతున్నట్లున్నాయి. మొహం ఏం అలా వాడిపోయి ఉంది. చాలా వీక్‌గా ఉన్నట్లుంది కూడా! పేరుమోసిన డాక్టర్‌తో ఇంట్లో వుండి స్వంత భార్యను పరీక్షించే తీరుబడే లేదా!"

అంజుకు భయంగా ఉంది. సామాన్యులు కాదు ఈ డాక్టర్లు. అవులిస్తే పేగులు లెక్కపెట్టేట్లు వున్నారు. కరీ తెస్తానంటూ వంటగదిలోకి దూరింది. భరత్ కూడా తనను గమనిస్తున్నాడని మొదటే సందేహపడింది. తిరిగి వాళ్ళకు ఎదురుపడకుండా పండ్లు కోసి ప్లేట్లోకి అమర్చి హాల్లో టీపాయ్‌మీద పెట్టి, అక్కడ అతను తనకిచ్చిన కానుకను తీసుకుని తన గదిలోకి వచ్చి పడింది, ఎందుకోగాని శరీరం వణుకుతుంటే తననుతాను అదుపులో పెట్టుకోవాలన్నట్లుగా చేతిలోనున్న పెట్టెను తెరిచి చూచింది. సన్నని తెల్లగా ధగధగ మెరుస్తున్న మూడు రాళ్ళున్న ఉంగరం వజ్రపుటుంగరం. ఆశ్చర్యంగా దానివైపు చూస్తుండిపోయింది. ఇంత విలువైన కానుకా! బహుశ వాళ్ళకు అతిపెద్దగా అనిపించి వుండదు. మామయ్య ఇచ్చిన నగలే ఇంతవరకు వాడలేదు. అత్తగారి ముత్యాల నగలు తప్పించి.

హాల్లో నుండి స్నేహితుల సంభాషణ చెవులను సోకుతుంటే కదలక మెదలక కూర్చుంది.

"కోలాలంపూరు విశేషాలేమిటి, మనోహర్ ఎలా వున్నాడు" భరత్ అంటున్నాడు.

"అరె! మరచేపోయా! మన మనోహర్‌ది భయంకరమైన కథలే! విన్నావంటే ఆశ్చర్యపోతావు."

"అంతగా భయంకరమైన కథ ఏముంది, ఏం? ఏదైనా గొడవలా!"

"గొడవలయినా పరవాలా! అనుకోని సంఘటన ఎదురయింది. పూర్ మనోహర్?"

"సరే! ఇంతకీ ఏమిటట. వాడి భార్యా పిల్లలు బాగున్నారా!"

"పిల్లలు బాగానే వున్నారు. భార్య సంగతే ఇప్పుడు చెప్పబోయేది. నీకు తెలుసుగా! మనవాడికి కంపెనీ లేందే బుద్ధి ముట్టదని. ఆ రోజు వాడి పెళ్ళాం కర్మ కాలింది. ఎవరూ దొరకలేదని పెళ్ళాం వద్దని ఎంతగా బతిమలాడుతున్నా వినక ఎక్కువగానే తాగించాడు. ఎంత ఎక్కువగా అంటే ఇద్దరూ తమచుట్టూ ఏం జరుగుతున్నదని తెలుసుకునేదానికి కూడా మతిలేనట్లుగా. ఇద్దరూ మంచి నిద్ర. దొంగలుపడ్డారు. ఇంట్లో వున్న నగలు, డబ్బు, వీడియో. టేప్‌రికార్డరు ఇలా విలువయిన వస్తువులతోపాటు, మరొక అత్యంత విలువయిన అదే మనోహర్ భార్య మానాన్ని అందులో ఒకడు దోచుకుని పోయాడు. అప్పటికి ఏంజరిగిందని ఇద్దరికి తెలియలేదు. మరి కొద్దిసేపటికే మనవాడికి పెళ్ళాం అవసరమయి మీద చేయివేసేటప్పటికి కస్సుమందట. ఇప్పటివరకు నా ప్రాణాలు తీసింది చాలదా తిరిగి మొదలా అని. మనవాడికి కొంచెం మత్తు దిగి, "ఏయ్! ఏమిటా వెర్రి వాగుడు. నేనెప్పుడు నిన్ను తాకాను" అని అన్నాడట. "తాకడమా! నా ప్రాణాలు తీసి, తమాషాగా వుందా, ఇంత వెర్రి వుంటే బయటకెక్కడకయినా వెళ్ళండి," అని అరిచిందట. వీడికి పూర్తిగా మైకం వదలి లేచి కూర్చుని భార్యను కూర్చుండబెట్టి బాగా చెప్పు అని కుదిపేటప్పటికి, నిజంగానే, నిజంగానే అని ఆవిడ ఒకే అరుపులట. అప్పటికి వీడికి అనుమానం తగిలి నలువైపులా చూసేటప్పటికి, బీరువాలో గుడ్డలు చెల్లాచెదురయి, డ్రాయర్లను తెరచి, కాగితాలు క్రిందపడి రూమ్ అంతా అల్లకల్లోలంగా వుందట. ఇద్దరికి మత్తు వదలి, ఇల్లంతా కలయచూసి వస్తువులతోపాటే మానం పోయిందంటూ ఆ అమ్మాయి ఒకే ఏడుపు. ఇంతలో బయట పోలీస్‌కార్ల శబ్దాలతోపాటు మనుషుల సందడిలో ఇద్దరూ బయటకు వచ్చి చూస్తే నల్లగా మొద్దుల్లా వున్న ఇద్దరిని గట్టిగా పట్టుకున్న ప్రక్కింటివాళ్ళను చూడగానే వాళ్ళే తమ ఇంట్లోనూ దూరివుంటారని అనుకోగానే ఆగ్రహం పట్టలేక, ఇద్దరిని బాదబాదాడట. పోలీసులు అడ్డుకుని ప్రశ్నిస్తే, పక్కింటి అతను, దొంగతనంచేసి తన భార్యమీద చేయివేయగా చటుక్కున మేలుకుని గట్టిగా అరిచిందని, అతను ప్రక్కనున్న బల్లను వాడిమీదకు విసిరి వాడు క్రిందపడగానే పట్టుకున్నానని పోలీసులతో చెప్తుంటే, వీడు తన భార్యకు జరిగిన అత్యాచారం చుట్టుప్రక్కల వున్నవారిని పిలచి, పోలీసులకు రిపోర్టు ఇవ్వడం, వాళ్ళను దొంగతనం, రేప్ క్రింద అరెస్ట్ చేయడం జరిగాయి. కాని ఆ తరువాతనే వీడిలో ఒకవిధమయిన గిల్టీనెస్ మొదలయి, తనవల్లనే అలాంటి అసంభావికం జరిగిందని కుమిలిపోవడం మొదలుపెట్టాడు. ఆ తరువాత పొరుగు



వాళ్ళ మొహాల్ని చూడనే సిగ్గయిందని, వేరే ఇల్లు మారి వచ్చామని, మంచివేళ ఇల్లు స్వంతంకాదు కాబట్టి సరిపోయిందని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి అయితే ఒకటే ఏడుపట కొన్నిరోజులు. వీడే ఎంతో ఓర్పుతో తనను మామూలు మనిషిని చేశాడట. అప్పటినుండి తాగడం మానివేశాడు. చూశావా! ఏమైనా వాడిది విశాల మనస్సనుకో! వాడిని చూసి మన మగవాళ్ళు నేర్చుకోవాలి. తను ఆ అవమానాన్ని తట్టుకోవడమే కాదు. భార్యను అనునయించి మునుపటి మనిషిలా చేశాడంటే వాడిది వున్నతమైన మనస్సేకాదూ! ఏమిటి అలాగున్నావు. నిజంగా షాక్ ఇచ్చే వార్తే అనుకో!"

"చంద్రన్!" అతని గొంతు చాలా లోతుగా వుంది.

"ఏమిటిరా! నీవేం అలా వున్నావు? మొహం అంతా చిరుచెమట చూడు. చల్లగా ఇంతగాలి వీస్తుంటే నీ మొహాన వానజల్లులా చెమట ఏమిటి?"

"చంద్రన్!"

"ఊ చెప్పు. ఏమిటది."

"చంద్రన్! మనోహర్ స్థలంలో నీవు వుంటే అలా మనస్ఫూర్తిగా స్వీకరిస్తావా!"

"డోన్టాక్ ఫూలిష్! అందులో ఆ అమ్మాయి తప్పు ఏముంది. తప్పంతా మనవాడిది. వద్దన్నా వినకుండా బలవంతంగా ఆ అమ్మాయితో విస్కీ తాగించాడు. తాగించాడే అనుకో! దానికి ఒక లిమిట్ లేదూ! తనతోపాటే సమంగా తాగిస్తే ఆ అమ్మాయి ఎలా నిలదొక్కుకుంటుంది. అందువల్లనే ఏం జరుగుతున్నదని ఆలోచించే శక్తినే కోల్పోయింది. తప్పు మనవాడిదా. ఆ అమ్మాయిదా? ఒక్కసారి నిన్ను ఆ అమ్మాయి పొజిషన్‌లో ఊహించుకో! తప్పొప్పుల ప్రసక్తి తెలిసొస్తుంది."

"అంటే స్త్రీ శీలం పోగొట్టుకున్నా పరవాలేదు, మనసు విశాలం చేసుకుని ఆదరించు అని అంటావు." భరత్ కోపంగా అంటున్నాడు.

"చూడు భరత్! నీ సంగతి నాకు తెలియదా! ఇద్దరం కలిసి ఆరు సంవత్సరాలు చదివాము. ఎంతో ప్రాణంగా వున్నాము. మన ఇద్దరి స్వభావాలు చుక్కెదురయినా నేనెప్పుడు నీలోని ఉన్నతమయిన ప్రవర్తనకు తల ఒగ్గేవాడిని. నీలాంటి క్రమబద్ధమయిన జీవితం, నీవు అనుసరించే చక్కని పద్ధతులు, నీలో ఉండే స్నేహ భావం, ప్రతిది మా అందరి మనసులో హత్తుకుపోయేవి. మేము నిన్ను అనుసరించి నీలా ఉన్నతంగానే ఉండాలని కోరుకునే వాళ్ళం. కాని అది మావల్ల కానిపని అని తెలుసుకున్నాము. చంద్రునికో మచ్చ అన్నట్లు నీలో ఒక లోపం. అది స్త్రీ విషయంలో. మనం కోరుకున్న విధంగా ప్రతి స్త్రీ ఉండాలనుకోవడం అవివేకం. స్త్రీ మన చేతులలో బొమ్మకాదు. విధి చేతులలో బొమ్మ. తను మనం కోరుకున్న విధంగా అనుసరించాలనుకొన్నా విధి అంత సునాయాసంగా వదలదు. మనోహర్ దాంపత్యం సుఖంగా, సక్ర

మంగా జరిగిపోతూ ఉన్నప్పుడు మధ్యలో ఇలాంటి అవాంఛనీయాలేమిటి? అంతేకాదు స్త్రీ సుఖదుఃఖాలకు కారకుడు ఒక మగవాడు. మనం ఒక రకమైన దుర్మార్గులం! రేపిస్ట్స్ మరొక రకం దుర్మార్గులు అందరం మగవాళ్ళమే! మన అధికారాలకు, మన కోరికలకు బలి అవుతున్నది ఎంత మంది తన భార్యలను అర్థం చేసుకుంటున్నారు, తప్పులు ఎంచడం తప్పించి, మనోహర్ భార్యను అర్థం చేసుకున్నాడు కాబట్టి ఈనాడు సంతోషంగా ఉండగలుగుతున్నాడు. కారణం, అతను అంత మత్తులోను భార్యమీద కోరిక కలిగింది. అందువలననే తనను దగ్గరకు తీసుకోబోయాడు. మనోహర్ అలా ప్రవర్తించకబోతే ఏదీ బయటకు వచ్చి ఉండేదికాదు. ఆ అమ్మాయి తన భర్త అనే సహజంగా ఉండిపోయేది. కాని విధి వుండే అది అంత సులువుగా వదలదు ఏదైతే మనం రహస్యంగా ఉంచుదామనుకుంటామో అదే, గాలిలా నలువైపులా వ్యాపిస్తుంది. అదే మనోహర్ అనేది. నేను ఊరుకుని ఉంటే ఏదీ బయటపడేదికాదు. నాకు నా భార్య అవసరం రాబట్టే జరిగింది. ఏమిటని బయల్పడింది. అలాంటప్పుడు తెలిసివున్నా తెలియకపోయినా జరిగేదేదో జరిగిపోయింది, జరిగిపోయిందానికి తలచితలచి మనస్సును చెడగొట్టుకోవడం తప్ప మరేం ప్రయోజనం ఉంది చెప్పు. నా భార్య చేయని తప్పుకు. నేనే కూడా వేరే శిక్ష వేయాల్నా. ఇప్పటికే తన బాధ చూడలేక పోతున్నాను అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

ఈమధ్య మలేషియాలో రేప్ కేసులమీద శిక్ష తగ్గించారు. ఋజువులు లేకుండా స్త్రీ చేసిన రిపోర్ట్సు నమ్మి ఎలాంటి శిక్ష విధించడానికిలేదని క్రొత్త లా అమలులోకి తెచ్చారు. రేప్ జరిగిన మరు నిమిషమే పోలీస్ రిపోర్టు ఇవ్వాలని, వెంటనే డాక్టరు సర్టిఫై చేయాలని, ఏ కారణంచేత అలా ప్రవర్తించాడని, ఇలా ఎన్నో ఋజువులు కావాలన్నారు. లేడి జడ్జిలు, లేడి లాయర్లు, యంపిలు, సాధారణ స్త్రీలు ఆ చట్టాన్ని ఖండించారు. కొంతమంది మగ లాయర్లు వాళ్ళను సపోర్ట్ చేశారు. సహజంగా సగంమంది పైన తాము చెరచబడ్డాం అని రిపోర్ట్సు ఇవ్వరు. ముఖ్యంగా మన యిండియన్ స్త్రీలు. రేప్ కేసులమీద సర్వే చేస్తే, రిపోర్టు చేయనివి ఎన్నో బయటకు వచ్చాయి. ఈ సంవత్సరమే నాలుగువందల నలభై కేసులు పోలీసుల చేతులలోకి వచ్చాయి. కన్నె పిల్లలు, పెండ్లి అయిన వారు, తండ్రిచేత చెరచబడ్డవారు, నమ్మించి నాశనంచేసే బాయ్ ఫ్రండ్స్, మంత్రగాళ్ళు ఇలా అనేక రకాలు, వీటికి కారకులు మగవాళ్ళం మనమే. ఒక లాయరు అంటాడు తన దగ్గరకు వచ్చిన ఒక డైవర్స్ కేస్ గురించి. ఆ క్లైంట్ భార్య దగ్గరనుండి విడాకులు కావాలన్నాడట. కారణం తన భార్యను తను చూస్తుండగా తుపాకి చూపి మరొకడు రేప్ చేశాడని, ఆ పరిస్థితులలో తను అసహాయంగా వుండిపోయినా, ఏది ఎలా జరిగినా, తను చెడిపోయిన దానిక్రింద లెక్క కాబట్టి తనకు ఆమె అవసరంలేదని, కోర్టులో డైవర్సు దొరికాయి. కాని



ఆ స్త్రీ నాలుగుగోడల మధ్యనుండి బయటకు రావడమేమానుకుంది, మగవాడిని చూస్తేనే వణికిపోతుంది. తను నేరుగా ఒకసారి ఆ అమ్మాయిని కలిసి డైవర్స్ గురించి మాట్లాడితే బదులే ఇవ్వలేదని, భర్త కోరిన విధంగా అలానే సంతకాలు చేస్తానని అందట. ఆ లాయర్ ఏమన్నాడో తెలుసా. నాకేగాని లైసన్సు వుండే ఆ బాస్టర్డ్‌ని నిలువునా సూట్ చేసేవాడిని, వాడొక మొగుడా అని అంటాడు, ఆమె జీవిత గతినే మార్చివేసిన ఈ మగవాళ్ళను ఏం చేయాలి అంటాడు. అంతేకాదు ఇలాంటి కేసులు కోర్టుకు వచ్చినప్పుడు కొంతమంది లాయర్లు ఆ ఆడపిల్లలను వెనుకాలే అవహేళనగా మాట్లాడటం, న్యాయాన్ని అందజేయాల్సిన మాజస్ట్రేటే, ఒకసారి తనలో ఇవాళ మంచి రేప్‌కేసోయ్, మిస్‌కాకు, కోర్టుకురా అని ముసిముసి నవ్వులు నవ్వడం తనకు అరికాలిమంట నెత్తికెక్కిందని అంటాడు.

రేప్ కేసులను డీల్ చేసేటప్పుడు, ప్రెస్ వాళ్ళను, ఆడియన్స్‌ను ఫ్యూన్లని ఎవ్వరిని అలౌ చేయకూడదని అంటాడు. ఏమయితే ఏం ఇప్పుడు కెమేరా ద్వారా ఆ అమ్మాయిని ఒంటరిగా ఉంచి స్టేట్‌మెంట్స్ తీసుకుంటున్నాను. అలాగే కేసులు డీల్ చేస్తున్నాను, నేను ఒకటి అంటాను భరత్, నీ భార్యను మరొకడు బలవంతం చేస్తున్నప్పుడు నీవు చూస్తూ ఎలా ఊరుకుంటావు. నీలో శక్తి వున్నంతవరకు పోరాడు. వాడి దగ్గర కత్తి వుంది, తుపాకి వుంది అని కుంటి సాకులు చూపకు. అలా నీ ప్రాణానికి భయపడ్డప్పుడు నీ భార్యను స్వీకరించు. బలవంతుడయిన మగవాడివయివుండి అసహాయంగా చూస్తూ వుంటే శారీరకంగా పురుషునికన్న బలహీనమయిన స్త్రీ తననుతాను ఎలా కాపాడుకుంటుంది. మన యిండియన్ సినిమాలు వున్నాయే అవి అలాగే ఏడుస్తున్నాయి. మన సినిమాలు , మన పుస్తకాలు మనం ఏ దేశంలోవున్నా మన సాంప్రదాయాలను పాటింపచేసే కమ్యూనికేషన్లు చాలా యిండియన్ సినిమాలలో చూస్తుంటాం. స్త్రీ మగవాడి కామానికి బలికాగానే ఆత్మహత్య చేసుకుంటుంది, లేక మారీడ్ అయితే, భర్త చేత, బంధువుల చేత, చుట్టు ప్రక్కల వారిచేత వెలివేయబడుతుంది. సిల్లీగా లేదూ. మనోహర్ నైబర్సు ఎవరూ అవహేళనగా మాట్లాడలేదు, అవమానించలేదు. కాని వీడే భార్య కొరకు వేరే ఇంటికి మారాడు." గుక్క తిప్పుకోవాలన్నట్లు ఆగాడు.

"చంద్రన్! నీవు ప్రతి స్త్రీని అమాయకురాలినిచేసి మాట్లాడుతున్నావు. ఎంతమంది యువతులు లేరు పెండ్లికి మునుపే ఇష్టం వచ్చినట్లు తిరిగి గర్భంతో మరొక పురుషుడి ముందు అమాయకురాలినన్నట్లు నటిస్తూ మౌనంతో పెండ్లి చేసుకోవడం, ఆ బిడ్డకు కట్టుకొన్న వాడిని తండ్రిని చేయాలని భ్రమించడం, దానికి ఏమంటావు. అలాంటి ఆడవాళ్ళను ఏమంటావు. మోసపోయిన మగవాళ్ళను ఏ పేరున పిలుస్తావు. కసాయివాడనే అంటావా! నీకు తెలియదు

చంద్రన్, నాకు ఆడవాళ్ళంటే ఒకప్పుడు ఇంత అసహ్యంలేదు! ఎందుకంటే నా తల్లి, నా పిన్ని స్త్రీలే! ఎందుకో నాకు ఈ ప్రేమలు అవీ నచ్చవు. అందుకే ప్రతి యువతికి దూరంగా వుండేవాడిని. ఒకసారి మధు గర్ల్ ఫ్రెండ్ మధుతో ఇంటికి వచ్చింది. వచ్చిన పది నిమిషాలనుండి, ఆ తరువాత చాలా రోజుల వరకు నన్ను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. వేళకాని వేళల్లో ఫోన్‌కాల్స్, హాస్పిటల్‌కు వరుగెత్తుకు రావడం ఒకే డిస్టర్బెన్స్. మధును చెడామడా తిట్టాను, ఇలా ఎవ్వరిని ఇంటికి తీసుకురాకని, ఆ అమ్మాయితో కచ్చితంగా చెప్పాను. ఇలా పిచ్చిపిచ్చి వేషాలే యొద్దని, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. అలాగే ఇప్పుడే పోలీసులకు, మీ వాళ్ళకు ఫోన్ చేస్తాను. చివరకు ఎలాగయితే ఏం తనను వదిలించుకుని ఒడ్డున పడ్డాను. ఇదంతా చూస్తుంటే అసహ్యంగాలేదూ! పెండ్లికాక మునుపు ఎవరి ఎవరో వెనుక చుట్టడం ఆ తరువాత మరొకరిని వివాహం చేసుకోవడం ఛీ! ఛీ! తలుచుకుంటేనే చీదరింపుగా వుంది,"

"నీ సంగతి నాకు తెలియదూ! అవర ప్రవరాఖ్యుడివి. పద్మలతను మరచిపోతానా! ఆ రోజు ఏర్‌పోర్ట్‌లో ఎలా వెక్కి వెక్కి ఏడ్చిందో తెలుసా! ఎంత కతినాత్ముడండి మీ ఫ్రెండు. వారం రోజులనుండి అతను తిరస్కరించినా అతనిని వదలి వెళ్ళాలనేటప్పటికి తిండి తిప్పలు లేకుండా బాధపడుతుంటే, హోటల్లో నాకు గ్రాండ్‌గా సెండ్ ఆఫ్ పార్టి అరేంజి చేస్తాడు. కనీసం ఈ రోజయినా ఏర్‌పోర్టుకయినా వచ్చాడా! మీరెంత వార్నింగ్ ఇచ్చినా నాకు తెలియకుండా నా మనస్సు అతనిచుట్టు భ్రమిస్తూ ఉండిపోయేది. అది నా తప్పుకాదు. అతని రూపం, అతని నడవడిక, అతని తెలివితేటలు నన్ను పిచ్చిదాన్ని చేశాయి. అని ఒకే ఏడుపు. తన సముదాయించేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. థాంక్ గాడ్! నేను ఆడదయి పుట్టలేదు. లేకపోతే నేను ఒక వెర్రిదాన్నయి వీధులలో తిరుగాల్సి వచ్చేది. దేవుడు నీకు రూపం ఇచ్చాడుకాని దానిని అనుభవించే హక్కుమటుకు ఇవ్వలేదు. ఏం చేస్తాం. పాపం. అది ఆ అమ్మాయిల దురదృష్టం.

భరత్ నీవు అన్నావే పెండ్లి కాకముందే గర్భవతి అని, అదీ వాళ్ళ తప్పుకాదురా, మనమే దానికి కారణం. ఇద్దరూ ఒకరినొకరు మనస్ఫూర్తిగా ప్రేమించుకుంటే ఇక మొదలుపెట్టాడు మనవాడు, నాతో సినిమాలకు రావడానికి భయమేమిటి, నా గదికి రాకూడదా, అని మొదలుపెట్టి ఆ తరువాత పైన చేయి వేయడం, ఆ అమ్మాయి విదుల్చుకుంటే నీకు నామీద ప్రేమ ఉందేకదా, లేకపోతే నన్ను కాదంటావా, మనం ఎలాగూ త్వరలో వివాహం చేసుకోబోతున్నాం. అలాంటప్పుడు భయమేమిటి అనీ, ఇలా ఎన్నో ట్రిక్స్‌లు ప్రయోగించి లొంగదీసుకుంటాడు. సహజంగా సున్నిత మనస్కురాలయిన ఆడపిల్ల ఈ మాటలకు లొంగిపోతుంది. తెలివిగల ఆడపిల్ల అయితే తప్పించుకుంటుంది. ఇప్పుడయినా అర్థమయిందా మగవాడిలో వుండే చతురత. ఏమయితేనేం నీ కోరికకు అను



గుణంగా, చక్కని ప్రతిమలాంటి అమ్మాయి నీకు భార్యగా దొరికింది. "ఫూల్. ప్రేమ దోమ లేదంటూనే మొదటిచూపులోనే అంజానను ఎలా పెళ్ళిచేసుకున్నావు! అది ప్రేమ కాదూ! రోడ్డుమీద ఎదురయిన అమ్మాయిని చూసి వెనుకబడితేనా ప్రేమ. నీది ప్రేమే, మాది ప్రేమే, కాని ఆ ప్రేమించడంలోనే వ్యత్యాసం. అంతే!

అంజు వాళ్ళమాటలు స్పష్టంగా శ్రద్ధగా వింటున్నది. భరత్ తనను మనసులో పెట్టుకునే అలా స్త్రీలను అల్పంగా మాట్లాడుతున్నాడు. తనకు మిగిలి వున్న ఆ కొంచెం ఆశ అడుగంటిపోయింది. ఇక తమ దారులు కలవవు.త్వరలోనే తన దారి తను వెతుక్కోవాలి. బాధగా కళ్ళు మూసింది.

"భరత్! నేను ఒకటి అడుగుతాను. నిజం చెప్తావా!"

అదిరిపడింది అంజు. తిరిగి సంభాషణ ఎటువైపు దారితీస్తున్నదీ అని.

"ఏమిటి?"

"నీవు, సిస్టర్ టేబిల్ దగ్గరకాని, ఇక్కడకాని ఒక్కమాటయినా మాట్లాడుకోవడం చూడలేదు. పైగా తనలోను ఏదో లోపం. నీలోను ముందున్న ఉత్సాహం లేదు. కారణం ఏమిటి? ఇద్దరిమధ్య ఏదైనా స్పర్ధమో!

"ఊహుఁ! అదంతా ఏమీ లేదు. చిన్న మనస్పర్ధ. అంతే!"

"నమ్మలేకపోతున్నాను. చూడు భరత్! నిన్ను నమ్ముకుని, తనవాళ్ళను వదులుకుని సముద్రాలను దాటి ఇంతదూరం వచ్చింది. ఇప్పుడు నీవే తనకు సర్వం. తనను లాలించి, తనను మరిపించి అక్కున చేర్చుకోవాల్సినవాడివి నువ్వు. నీవే పెడమొహంగా ఉంటే తన పరిస్థితి ఏమిటి? తను ఉత్తమనిషి కాదు. ఎన్నో కలలు, కోరికలు వుంటాయి. అవి తీర్చాల్సినవాడివి నువ్వు. నీవు అన్నిటిలోను అదృష్టవంతుడివి. నీకు భగవంతుడు అన్నిటితోపాటు అపూర్వ సౌందర్యరాసిని భార్యగా ఇచ్చాడు. ప్రతి మగవాడు అలాంటి భార్య కావాలని కోరుకుంటాడు. నీవు కోరుకున్నా, కోరుకోకపోయినా ఆ వరాన్ని నీకు దేవుడు ఇచ్చాడు. దానిని కాపాడుకోవలసినవాడివి నువ్వు. ఎంతో తెలివిగలవాడివి, కాని ఆ తెలివి స్త్రీ విషయంలో ఉపయోగించడం లేదు. ఒక స్త్రీ కంట కన్నీరు కురవను, పన్నీరు కురవను కారకుడు ఒక మగవాడు. ముఖ్యంగా భర్త అన్నవాడు. అది గుర్తుంచుకో! అరే! లేటయిపోయింది. మధును చూడాలనుకున్నా! అది కుదరలేదు. నీవు అంజానను పిలుచుకుని కోలాలంపూరుకు రమ్మని ఆహ్వానిస్తున్నా. నా భార్య మీ ఆవిడను చూడాలని చాలా ఆశగా వుంది. నీవు ఇక హాస్పిటల్‌కు పోనక్కేకదా! నేను టాక్సీలో వెళ్ళిపోతాను" అన్నాడు.

"నీ మొహం. ఇక్కడ టాక్సీలు ఎక్కడ దొరుకుతవి. నిన్ను హోటల్ దగ్గర డ్రాప్ చేస్తానురా!" అంటూ అతను తన గదిలోకి వెళ్ళి డ్రస్ మార్చుకొని వెళ్ళిపోయాడు.

"మిసెస్ భరత్! నేను వెళ్ళిపోతున్నాను." హాల్లోనుండి పిలిచాడు. అంజు తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది.

"మీ ప్రెజెంటేషన్ చాలా బాగుంది! అక్కయ్యను అడిగినట్లు చెప్పండి. ఈసారి మీరు వచ్చేటప్పుడు అక్కయ్యను పిలుచుకుని రావాలి" అంది.

"అలాగే అమ్మా! ఇలా చూడు. నీవు లేడీడాక్టర్ దగ్గర చెక్ చేయించుకో! చాలా బలహీనంగా వున్నావు. మాస్టరు భరత్ పుట్టగానే లెటర్ వ్రాయి" నవ్వుతూ అన్నాడు.

అంజుకు మొహం వెలవెలపోయింది. అప్పుడే హాల్లోకి వచ్చిన భరత్ మొహంలో నీడలు ఏర్పడడం చూసి మొహం దించుకుంది. అతను అంజుకు గుడ్‌బై చెప్పి భరత్‌తో వెళ్ళిపోయాడు. అంజు నీరసంగా తలపట్టుకుని అక్కడే సోఫాలో కూలబడింది.

సాయంత్రం త్వరగా స్నానం ముగించుకుని డ్రస్ ఛేంజ్ చేసుకుని వరండాలో చల్లగాలికి వచ్చి నిలుచుంది అంజు. మధ్యాహ్నం నుండి మనస్సులో ఏదో కొరత. తనకిక విముక్తే లేనట్లు, తన బాధను పంచుకొనడానికి మరొక తోడు కావాలన్న కోరిక. అందుకే సూజికొరకు ఎదురుచూస్తూంది. ఈ రోజు వచ్చినా తను ఒంటరిగా ఆ గదిలో పడుకోదు. సూజితో ఎక్కడయినా ఈ వచ్చినా తను ఒంటరిగా ఆ గదిలో పడుకోదు. సూజితో ఎక్కడయినా ఈ రాత్రంతా గడుపుతుంది. చాలా రోజులయింది, ఇలా చల్లగా, గాలికోసం సాయం సమయంలో నిలబడి వుండడం కారణం భరత్! అతనికి ఎదుటపడకూడదన్న నిర్ణయానికి రాబట్టి. మధులో కూడా చాలావరకు మాటలు తగ్గించేసింది. ప్రతిరోజు సూజి ఇచ్చే మందుకొరకు రాత్రి పదిగంటల తరువాతనే వెలుపలికి ఎవరికి తెలియకుండా రావడం, అది తీసుకుని వెంటనే తన గదిలోకి పోవడం ఇలా ప్రతిరోజు నిరాటంకంగా జరిగిపోతున్నది. కాని ఈరోజు ఎందుకో మనస్సు పదేపదే తోడు కోరుతోంది. తనకు దగ్గరగా, తల్లి, చెల్లెలు లేరు. తనకు ఒకే ఒక తోడు సూజి. ఈ రాత్రి సూజితోనే పడుకోబోతోంది.

మధు వస్తున్నాడు. అంజును చూడగానే అతని మొహం వెలిగింది.

"అబ్బ! వదినా! ఎన్నిరోజులకు ఇలా నా కోసం ఎదురుచూస్తున్నారు. నా కొరకే కదూ! నిజం చెప్పండి" దగ్గరగా వచ్చి అన్నాడు.

"నీ కొరకే అని ఎందుకు అనుకోవాలి?" ఎదురుప్రశ్న వేసింది.

"అలాగయితే మరెవరికోసమో! ఆఁ. అన్నయ్యకొరకే కదూ!" అతని మొహం చిన్నబోయింది.

"ఛీ! ఛీ! మీ అన్నయ్య మాట ఎత్తకు" చిరాకుగా అంది.

"అయితే మరెవరికొరకు.... ఓహ్! గుర్తుకొచ్చింది. సూజికొరకే కదూ!"

"ఊఁ!"

"ఇప్పటి రోజులలో మీకు మా అందరికన్నా సూజి ఎక్కువయింది"



నిష్ఠూరంగా అన్నాడు.

"ఓ! కోపగించుకోకు మధూ! నీవు నా ప్రియమయిన మరిదివి. సూజి నా మనసుకు నచ్చిన స్నేహితురాలు. ఇలా చూడు. ఆడవాళ్లు మొగవాళ్ళతో చెప్పుకో లేనివి ఎన్నో వుంటాయి. అవి తనతోటి స్నేహితురాలితో మనస్సువిప్పి చెప్పుకో గలదు. తన సమస్యలను కొంతవరకైనా తీర్చుకోగలదు. అరె! మరచేపోయా! ఈరోజు మీ అన్నయ్య స్నేహితుడట. డాక్టరు చంద్రశేఖర్ వచ్చారు. నిన్ను చూడాలని ఎదురుచూశారు. ఇలా చూడు" ఎడమచేయి చాపి వేలికి ఉన్న ఉంగరం చూపింది.

"ఎవరిచ్చారిది."

"అదే! మీ అన్నయ్య స్నేహితుడు. బాగుందా?"

"ఊఁ! వదినా! ఆఫ్టరాల్ ఆ చిన్న వుంగరాన్ని ఎంతో గొప్పగా చూపుతున్నారు. డాడీ ఇచ్చిన నగలు ఎప్పుడయినా ఉపయోగించారా!"

"ఎందుకు లేదూ! ఆ రోజు మీ అమ్మగారి ముత్యాల నగలు వేసుకోలేదూ! ఆ డైమండ్‌వి, ఆ జేడ్‌వి భద్రంగా దాచిపెట్టాను. అవి నీ రాబోయే భార్యకొరకు. నేనివ్వబోయే ప్రజంటేషన్. అవి ధరించే అర్హత, అధికారం నాకులేవు మధూ! నేను ఒక సామాన్యమైన కుటుంబంలో నుండి వచ్చాను. అంతంత విలువైన నగలు ధరించడానికి నా భర్త ఇచ్చినవి కావుగా!"

"ఓహ్! ఈమధ్య మీ మాటలు కఠినంగా ఉంటున్నవి" బాధగా అన్నాడు.

"కొన్ని నిజాలు కఠినంగానే అనిపిస్తాయి. మధూ! ఇంతకూ నీవు పెళ్ళి ఎప్పుడు చేసుకోబోతావు. నీ గర్ల్‌ఫ్రెండ్స్ అంతా ఏమయ్యారు. త్వరగా ఎవరినో ఒకరిని సెలక్ట్ చేసుకో! నాకు తోడుగా వుంటుంది" నవ్వుతూ అతని మొహంలోకి చూసింది.

"ప్రస్తుతానికి ఏ గర్ల్‌ఫ్రెండ్ లేదు. అందరికి ఎప్పుడో గుడ్‌బై చెప్పేశాను. అయినా మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అన్నాడు.

అంజు పకపక నవ్వింది. "రహస్యమా! మీ అన్నయ్య మధ్యాహ్నం ఒక ఇంపైన కథ చెప్పాడులే? నాతోకాదు, తన స్నేహితునితో. నీ గర్ల్‌ఫ్రెండ్ మీ అన్నయ్య వెనుకబడి ఏ విధంగా న్యూసెన్స్‌గా తయారయిందని. అయినా ఎక్కడి మనిషో! అందుకే అంటారు వలచి వస్తానంటే మహా చులకన అని. అది మీ అన్నయ్యకు సరిగా సరిపోతుంది."

"షీలా సంగతా మీరు చెప్పేది. గాడ్! ఇప్పటికి మరచిపోలేను. అన్నయ్య దగ్గర తిట్లు. అదే లాస్ట్. మరెన్నడూ ఇంటికి ఎవరినీ పిలుచుకు వచ్చింది లేదు" తనూ నవ్వాడు.

"ఇంతకి నీ పెళ్ళి సంగతి చెప్పనే లేదు."

"ఈమధ్య మీకి పిచ్చి ఎక్కువయింది. చూడండి వదినా! మీ జీవితం

స్థిరపడేంతవరకు నా పెళ్ళిమాట అనేది లేదు. మరొకసారి ఆ బోరింగ్ మాట ఎత్తకండి" విసుగ్గా అన్నాడు.

"ఏం నీకు మీ అన్నయ్యకులా శీలం పోగొట్టుటున్న ఆడది వస్తుందని భయమా! భయపడకు. పెండ్లికిముందే డాక్టరు దగ్గర చెక్‌చేయిస్తే పోతుంది."

మధు ఆశ్చర్యంగా అంజువైపు చూశాడు. "మైగాడ్! వదినా! మీరు ఏం మాట్లాడుతున్నారో తెలుసా! ప్రతిసారి మిమ్మల్ని మీరే కించపరచుకుంటున్నారు. మీకు అది అవమానంగా లేదూ! మరొకమారు ఇలా మాట్లాడుతుంటే ఇకమీదట మీతో మాట్లాడనే మాట్లాడను" కోపంతో మొహం తిప్పుకున్నాడు.

"అదిగో సూజి వస్తున్నది." సంతోషంగా మధును వదిలి ముందుకు రాబోయింది.

"ఆ సూజిని మర్డర్ చేయాలనిపిస్తున్నది" టక్కున అన్నాడు.

"ఎందుకు!" ఆశ్చర్యంగా అంది.

"ఆ సూజి మిమ్మల్ని నాదగ్గరనుండి వేరుచేస్తున్నది" కోపంగా అన్నాడు.

నవ్వింది అంజు. "డోన్ట్ బి జలసి."

"వదినా! మీకు పదినిమిషాలు టయిమ్ ఇస్తున్నాను. ఆ తరువాత లోపలికి రాకపోతే నేనే బలవంతంగా లోపలికి పిలుచుకురావలసి వస్తుంది" లోపలికి వెళ్ళిపోయాడు.

అతనిలోని ఆగ్రహానికి అంజుకు చిత్రంగా అనిపించింది. చిన్నగా అర్థం చేసుకుంది. మధు తనమీద విపరీతమయిన అభిమానం పెంచుకుంటున్నాడు. తను మనస్సు సరిలేక అతని ప్రేమను శంకిస్తున్నది. తనకు అన్నలు లేరు. కనీసం బంధువులలోనయినా దగ్గరగా ఎవరూ లేరు. బహుశ సహోదర ప్రేమంటే ఇలాగే వుంటుందేమో!

"అంజూ! ఏమిటి విశేషం. నాకొరకే!" తనకు దగ్గరగా వచ్చిన అంజుతో ఆనందంగా అంది సూజి,

"అవును" తలవూపింది.

"ఏమిటి విశేషం."

"సూజీ! నేను ... నేను ..."

"చెప్పు అంజూ! ఏమిటి కావాలి."

"ఈ రాత్రికి నేను నీతో వుంటాను. నన్ను నీతో ఎక్కడికయినా పిలుచుకుపో! ఈరోజు నా మనస్సు సరిలేదు. ఒక్కదాన్ని ఆ రూమ్‌లో ఉండాలంటే దిగులుగా వుంది. తీసుకుపోతావా!" ఆశగా అంది.

"అలాగే! అంతకన్నా ఏంకావాలి నాకు. నీవేమీవారికి, మధుకు భయపడి శంతోషా ఐలండ్స్‌కు వచ్చిన మరుసటిరోజునుండి రావడం మానుకొన్నావు."

"శంతోషా ఐలండ్స్‌కు రాను, మరెక్కడికయినా పిలుచుకుపో. ఆనాటి అతను గుర్తుకొస్తుంటే ఇప్పటికి టెర్రర్‌గా వుంటుంది."



"ఓకే! "చేంజ్ అల్లీ"లో మాత్రం తెలిసినతను గూడ్సు స్టాక్‌చేసి పెడతాడు. అది ముందుక్కు ఉంటుంది. కాని వెనుకన మరొక అతను డ్రగ్స్ సప్లైచేస్తుంటాడు. చూసేదానికి అది బేళ్లుబేళ్లుగా అమర్చివున్న వస్తువుల అంగడని అనుకుంటారు. కాని వెనుక వ్యాపారమే జరుగుతుంది. మనవాళ్ళు అప్పుడప్పుడు అక్కడే కలుస్తుకునేది. ఈరోజు అక్కడికి వెళదాం. చేంజ్‌అల్లీ ఆఫీసులకు, బిజినెస్‌కు సెంటరు. "రాబిన్‌సన్" అక్కడే వుంది. అందమైన ఇంగ్లండ్ వస్తువులన్నీ ఒక్కసారిగా అందులో చూడవచ్చు. నీవు ఇంతవరకు చూసి వుండవు. ఎన్నిగంటలకు వస్తావు?"

"నేను, మధు, భరత్‌వాళ్ళ రూమ్‌లకు వెళ్ళిన తరువాతనే రావాలి. నాకోసం, ఎంత ఆలస్యం అయినా వెయిట్‌చేస్తుంటావు కదూ!" ఆతృతగా అంది.

"అలాగే! అంజూ, నాకనిపిస్తుంది నీవు వీళ్ళను వదలివస్తే మనిద్దరం ఎక్కడయినా రూమ్ రెంటుకు తీసుకుని ఎవరి అధికారం లేకుండా హాయిగా ఉండవచ్చుననిపిస్తోంది. ఏమంటావు అంజూ! నీకు ఎక్కడయినా ఉద్యోగం చూస్తాను. ఎవరి జోక్యం లేకుండా ఉండవచ్చు."

"ఆలోచిస్తాను సూజి. నేను భరత్‌కు భయపడడం లేదు. మధుకు గౌరవం ఇస్తున్నాను. మధు నన్ను ఎంతో నమ్మి ఉన్నాడు. అతనిని మోసం చేయలేకనే అనుమానిస్తున్నాను. కాని ఈ రాత్రికి నీవు నాదగ్గరే ఉండాలని కోరుతున్నాను."

"వదినా!" మధు పిలుస్తున్నాడు. ఇంతలోనే భరత్ వస్తున్నాడు. ముదురు రంగు బ్రౌన్‌కలరు పాంటులోకి నావిబ్లూలో చిన్నచిన్న తెల్లని పూవులున్న షర్ట్ టక్‌చేసి వున్నాడు. కుడిచేతిలో గ్యాగుల్సు కారుతాళాలు ఉన్నాయి. ఎడమచేయి పైకెత్తి నుదుటిమీద పడుతున్న వెంట్రుకలను సర్దుకుంటూ వీళ్ళిద్దరివైపు చూశాడు. అంజు అతనివైపు ఒకసారి చూసి కళ్లు దించుకుని మొహం అటువైపు తిప్పుకుంది. భగవంతుడా ఇతనికి భయంకరమైన అందాన్ని ఇచ్చావు, ఆడవాళ్ళను పిచ్చివాళ్ళను చేసి చావమని. ఈ ప్రపంచంలో ఆడపిల్లలే కరువయినట్లు తననుమటుకు ఎందుకు ఎన్నుకున్నాడో. ఈనాడు తనను సుడిగుండంలోకి తోసి తనుమటుకు సంతోషంగా ఉన్నాడు. అతను దాటిపోగానే సూజివైపు చూసింది. సూజి కూడా ఏదో ఆలోచిస్తున్నట్లు వుంది. తనను గుర్తించడం లేదు.

"వదినా! అన్నయ్య పిలుస్తున్నారు," మధు తలుపు దగ్గరవచ్చి నిలబడి వున్నాడు.

అంజు సూజి వైపు చూసి రాత్రి నా కొరకు ఎదురు చూస్తూండు అని చిన్నగా పలికి మధు వెనుక లోపలికి వచ్చింది.

* * * *

తెల్లవారు జామున మూడు గంటలకు మెలకువ వచ్చిన సూజి అంజును లేపింది.

"అంజు గెటప్! త్వరగా ఇల్లు చేరాలి. భరత్ ఐదు గంటలకు జాగింగ్‌కు వెళతాడు. ఆ లోపలే నీవు ఇంట్లో వుండటం మంచిది. అతను నిన్న సాయంత్రం మనవైపు అనుమానంగా చూస్తూండి పోయాడు," తొందర చేసింది. సూజిలోవున్న కంట్రోల్ అంజులో వుండదు. మత్తులో కళ్ళు విడివడడంలేదు. అక్కడినుండి కదలాలంటే ప్రాణమే పోతున్నట్లుగా వుంది. కాని తప్పనిసరి. ఇంకా తమతో వచ్చినవారు క్రింద నిద్రపోతున్నారు. విధి లేనట్లుగా సూజిని పట్టుకుని క్రిందకు వచ్చి కారు ఎక్కి కూర్చుంది.

సూజి కారు స్లోగా డ్రైవ్ చేస్తున్నది. కారు తమ ఫ్లాట్స్‌దగ్గర ఆగగానే అంజూ తూలుతూ దిగింది, ఇద్దరూ లిఫ్టు దగ్గరకు వచ్చారు. లిఫ్టు యంగేజ్‌లో వున్నందువలన వెంటనే పైకి పోలేకపోయారు. అంజుకు ఆలస్యం భరించరానిదిగా వుంది.

"డామిట్! ఈ లిఫ్టు ఎప్పుడూ ఇంతే! సూజీ! కమాన్! మెట్లు ఎక్కిపోదాం, మరొక సెకనయినా ఇక్కడ నిలబడలేను" మత్తుగా వూగుతూ అంది.

"మనది ఆరవఫ్లోర్ తెలుసుకదూ!"

"ఆ! తెలును. రా రా! నావల్ల కాదు. లేకుంటే ఇక్కడే పడుకుంటాను.

"ఆ పని చేయకు. మెట్లే ఎక్కుదాం. ఇద్దరూ ప్రక్కప్రక్కగా మెట్లు ఎక్కసాగారు. అంజు గోడపట్టుకుని అరమోడ్పు కన్నులతో ఎక్కుతోంది. చివరిమెట్టు ఒక అడుగులో ఉందనగా గోడను పట్టుకున్న చేయి క్రిందకు జార్చింది. కాలు తడబడడం, హైహీల్ చెప్పు స్లిప్‌కావడం, అన్ని ఒక్కక్షణంలో జరిగిపోయాయి.

"అమ్మా అన్న కేక నలుమూలలా ప్రతిధ్వనించాయి. అంజు మెట్లమీద నుండి బంతిలా దొర్లుకుంటూ కుప్పలా క్రింద మెట్టుక్రింద రక్తపుమడుగులో పడిపోయి స్పృహతప్పింది. ఒకక్షణం ఏం జరిగిందో తెలియని సూజి షాక్‌నుండి తేరుకున్నట్లుగా, "అంజూ! అన్న వెర్రికేకతో క్రిందకు పరుగెత్తింది. అంజులో స్మారకం లేదు. అప్పటికే, గార్డ్సు నైట్‌వర్క్ చేస్తున్న టెలిఫోన్ ఆపరేటర్లు, మరొక ఇద్దరు స్టాఫ్ పరుగెత్తుకుంటూ అంజు దగ్గరగా వచ్చారు. సూజి పిచ్చిగా మధూ, మధూ అంటూ ముందుకు పరుగెత్తి తలుపులు దబదబ బాదసాగింది. తలుపులు తెరుచుకున్నాయి. భరత్, ఆ వెనుక మధు ఒక్కసారిగా బయటకు వచ్చారు.

"వాట్ హాపెన్స్!" ఇద్దరూ ఒకే కంఠంగా అన్నారు.

"భరత్! మధూ....అంజూ...." చెమటలో తడిసిపోతూంది. నోట మాట రావడంలేదు. ఏడుపు తోసుకు వస్తూంది, మనిషి రొప్పుతూంది.

"అంజుకేమిటి, అంజు గదిలో వుంది," భరత్ విసుగ్గా అన్నాడు.

మధు అతనిని తప్పించుకుని ముందుకు వచ్చి "ఏమిటి సూజీ, సరిగ్గా



చెప్పు అన్నాడు."

"మధూ! అంజు మెట్లమీదనుండి పడిపోయింది. మాట్లాడడం లేదు." తిరిగి పరుగెత్తింది.

"ఎక్కడ ..." వాళ్ళ మాటలు గాలిలోకి కలసిపోయాయి. మధు ముందుకు పరుగెత్తాడు.

భరత్ లోపలికి పరుగెత్తి కోట్ అందుకుని లిఫ్టుగుండా క్రిందకు వచ్చాడు. అతను క్రిందకు వచ్చేటప్పటికే మధు అంజూ తలను వడిలో పెట్టుకుని భయంగా చూస్తున్నాడు. అప్పటికే అంబులెన్స్‌కు ఫోన్ చేయడం, మరికొన్ని నిమిషాలలో హారన్ మ్రోగిస్తూ అంబులెన్స్ రావడం జరిగింది. భరత్ ఇంజక్షన్ ఇచ్చి ఎవరో అందించిన దుప్పటితో అంజును చుట్టి రెండు చేతులమధ్య ఎత్తుకుని అంబులెన్స్ లోని స్ట్రెచ్చర్‌మీద పడుకోబెట్టి, మధు వైపు తిరిగి "మధూ కారు తీసుకుని విక్టోరియా హాస్పిటల్‌కు రా." అని "డ్రైవర్ క్విక్!" అంటూ లోనికెళ్ళి కూర్చున్నాడు.

* * *

కళ్ళు తెరిచింది అంజు. కొన్ని క్షణాలు తను ఎక్కడుంది, తనకేమయిందని గుర్తుకు రాలేదు, కళ్ళు పూర్తిగా తెరిచి లేవబోయింది.

"కదలకండి వదినా! అబ్బ ఎన్ని రోజులకు పూర్తిగా కళ్ళు తెరిచారు." మధు గొంతు వినిపించి ప్రక్కకు తిరిగి చూసింది. తన మంచంకు దగ్గరగా తల ప్రక్కగా కుర్చీలో కూర్చుని వున్నాడు మధు.

"నాకేం అయింది మధూ! ఏం కదలలేకపోతున్నాను," నీరసంగా అంది.

"మీకు....మీకు....గుర్తు లేదూ!" మధు మంచంమీద అంజుకు దగ్గరగా కూర్చుంటు అన్నాడు.

అంజు ఆలోచించింది. ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగింది. తను మెట్లు ఎక్కడం, ఒక్క ఫ్లోర్ అయినా పూర్తిగా ఎక్కకముందే, చేయితోపాటు కాలు జారడం, తననుతాను నిలద్రొక్కుకోలేక దొర్లుకుంటు క్రిందకు జారడం, ఆ తరువాత....ఎంత ఆలోచించినా గుర్తుకు రాలేదు.

అ! సూజి....సూజి ఎక్కడ?"

"తనను గురించి ప్రస్తుతానికి అనవసరం," కటువుగా అన్నాడు.

"ఇప్పుడు నా గదిలోనే వున్నానుగా?"

"అవును."

"క్రిందనుండి మోసుకు వచ్చావా? బరువు వేయలా!"

"వదినా! మీరు క్రిందపడి వారంరోజులయింది. నిన్నటి వరకు హాస్పిటల్లో వున్నారు. నిన్న కొంచం తెలివిగానే వున్నందువలన అన్నయ్య హాస్పిటల్‌నుండి మిమ్మల్ని తీసుకు వచ్చేశారు. కాని తిరిగి మీరు మైకంలో పడి

పోయారు. మీకు తెలుసా వదినా! మీరు పునర్జన్మ ఎత్తారని. అన్నయ్య మీకు తిరిగి ప్రాణం పోశారు. అన్నయ్యేకాదు మీ దగ్గర మరొక నలుగురు డాక్టర్లు వున్నారు. డాడి, చాన్ అందరూ మీ దగ్గరే ఎప్పుడు కళ్ళు తెరుస్తారా అని అన్నాహారాలు మాని ఎదురు చూస్తూండి పోయారు. అన్నయ్యను చూడు పిచ్చి వాడే అయిపోయారు." అతనికి కళ్ళలో నీళ్లు చివ్వున చిప్పిల్లాయి.

"మధూ!" అంజు చేయి అందించింది. అతను అది అందుకుని తన రెండు చేతులమధ్య బిగించాడు. మధు చూపులు అంజు వైపే నిలిచిపోయాయి. పాలిపోయిన మొహం, నీరసించిన శరీరం. జీవంలేని కళ్ళు, అంజును చూస్తుంటే అతని ప్రాణం విలవిలలాడసాగింది.

"బాగా భయపడ్డావా! పాపి చిరాయువు అన్నారులే! నాలాంటి వాళ్ళు అంత త్వరగా చావరు. ఇంతకీ మీ అన్నయ్య ఎక్కడ?"

"పిలవనా! హాల్లో వున్నారు."

"వద్దు, వద్దు. నీవు ఆఫీసుకు వెళ్ళలేదూ! మీ అన్నయ్య హాస్పిటల్‌కు వెళ్ళలేదూ."

"అన్నయ్య లీవుమీద వున్నారు. డాడి, చాన్ మిమ్మల్ని తమతో ఇంటికి పిలుచుకుని పోతామని ఎంతగానో బ్రతిమలాడారు, అన్నయ్య ఒప్పుకోలేదు. ప్రతి పది నిమిషాలకు డాడి ఫోన్ చేస్తూనే వున్నారు మీకు ఎలా వుందని, నిన్న స్పృహలోకి రాగానే ఇంటికి పిలుచుకుని వచ్చారు. కాని తిరిగి కోమాకు వెళ్ళిపోయారు.

"మధూ! నావల్ల మీకెంత కష్టం. మిమ్మల్నంతా చాలా బాధ పెడుతున్నాను." ఏదో అనుమానం వచ్చినట్లుగా ఎడమ చేతితో పొట్టమీద తడివింది,

"అరే! ఇదేమిటి! నా పొట్ట ఫ్లాట్‌గా వుంది. గ్లోబ్‌లావున్న పొట్ట ఎక్కడి కెళ్ళింది మధూ!"

"వదినా!"

అతని మొహాన బాధారేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎఱ్ఱగా మారిన కళ్ళను చూస్తూ "నీవేమిటి మధూ అలా వున్నావు. నేను చచ్చిపోయానని ఏడ్చావా! నేనులేనూ ఇంత స్టడీగా, ధైర్యంగా వుండాలి, ఇలాంటి అనుభవం ఎదురయి వుండదు, అందుకే అంతలా భయపడుతున్నావు మధూ! ఇంతకీ...." ఆగిపోయింది.

"వదినా మీకు అబార్షన్ అయింది." మెల్లని స్వరంతో అన్నాడు.

"అంటే!"

"అంటే.... మీ కడుపులోనున్న బిడ్డ జీవం లేకుండా బయటకొచ్చాడు."

అంజుకు నోట్లో మాట రాలేదు. అలాగే అతనివైపు చూస్తూండిపోయింది!

"మధూ! నీవు....ఆ బిడ్డని చూశావా!" హీన స్వరంలో అంది.



"ఊఁ!"

"ఎలా వుంది....ఆడపాప లేక...."

"మగ బిడ్డనే! అచ్చు మీలాగనే ఉన్నాడు, అదే నొక్కుల జుట్టు. చిన్నగా చక్కని ముక్కు. సన్నని పెదవులు, కళ్ళు మటుకు తెలియవు. ఎందుకంటే ఆ కళ్లు మూసుకునే ఉన్నందువల్ల." అతని చేతులమధ్య అంజు చేయి నలిగి పోయింది. అతని మాటలు ఎక్కడో లోతైన ఛాతిలోనుండి వచ్చినట్లుగా వున్నాయి.

చూశావా మధూ! వాడెంత అసాధ్యుడో! నాకు తెలియకుండానే, నా పర్మిషన్ లేకుండా నా కడుపులో చోటు చేసుకున్నాడు. అదే విధంగా నన్నడగకుండా, నాకు తెలియకుండా నా కడుపులోనుండి మాయమయినాడు. చివరకు ప్రాణంలేని ఆ జీవాన్నయినా చూడలేకపోయాను. వాడు అనుకోనుంటాడు ఈ ప్రపంచంలో ఏమూల నయినా నాకు జన్మనిచ్చిన దుర్మార్గుడిని బ్రతికివుంటే ఏనాడో ఎదురు పడకుండా పోను, ఆ కిరాతకుడ్ని చూసేకన్నా ఇలా చావడమే మేలు అనుకుని వుంటాడు. నిజం చెప్పాలంటే నేనే హత్య చేశాను." అంజు కళ్ళలోనుండి నీళ్ళు ధారలు కట్టాయి.

"ప్లీజ్! వదినా! ఏడవకండి. మిమ్మల్ని ఆవహించిన రాహువు వదిలి పోయిందని సంతోషపడండి."

"కాని నాకు ధైర్యం చెప్తూనే నీవు ఎందుకో బాధపడుతున్నావు. మరీ ఇంత సున్నితమైన మనస్సు వుండకూడదు మధూ!"

"నిజం చెప్పాలంటే, మన ఇంట్లో పిల్లలు తిరుగాడే యోగమే లేనట్లు ఉంది. అక్రమమో, సక్రమమో మన ఇంట్లోను ఒక పాపో, బాబో తిరుగాడుతుంటే ఇల్లు నిండుగా వుంటుందని సంతోషపడ్డాను. ఏది ఎలా అయినా ఆ బిడ్డలో మీ రక్తం కలిసి వుంటుందనే ఆశ. కాని ఆ తృప్తి కూడా లేకుండా పోయింది.

"ఛీ! ఛీ! ఏ నీచుడి అంశమో అది. ఆ పవిత్రము ఈ ఇంట్లో తిరుగాడదమా! నీవు పెండ్లి చేసుకుంటే చక్కని రూపం, గుణం ఉన్న పిల్లలు కావాలను కొన్నంతమంది పుడుతారు. దిగులుపడకు."

"వదినా! నేను ఎంతగా మిమ్మల్ని అభిమానిస్తున్నానో తెలిసి నా దగ్గర నుండి ఎంతో రహస్యంగా వుంచారు. ఇవేనా పురుషుడి దగ్గర చెప్పుకోలేని రహస్యాలు, స్త్రీల మధ్యనే జరిగేవి." అంజు చేతులమీదనున్న సూదుల రంధ్రాలు చూపుతూ అన్నాడు.

అంజుకు క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఇప్పుడు తన ప్రవర్తన ప్రతి ఒక్కరికి అర్థం అయిపోయి ఉంటుంది. దానికి తను సిగ్గు పడదు తప్పు చేశానని క్షమించమని అడగదు. తను మనసారా కోరిన కోర్కె అది.

ఎందుకు వదినా మీ శరీరాన్ని ఇలా నాశనం చేసుకున్నారు. ఎందుకు చెప్పండి. అన్నయ్య మనస్సును మనం అర్థం చేసుకున్నదేకదా! అన్నిటిని ధైర్యంతో ఎదుర్కోవాలి అందుకు చాలా ఓర్పు అవసరం అని నిర్ణయించు కున్నామే! అవన్నీ మరచిపోయారా! మీలో దాగున్న మరొక మనస్సును నాకు చూపలేకపోయారు. అంటే నన్ను పూర్తిగా నమ్మలేకపోయారు. సూజికిచ్చిన విలువ నాకివ్వలేకపోయారు. అతని మాటలలో అనుకోని దెబ్బతిన్న అవ మానంతో కూడిన బాధ.

"ప్లీజ్! మధూ! నన్ను అర్థం చేసుకో! ఆ హెరాయిన్‌కు బానిస అయిన కారణాన్ని ఇప్పటికి చెప్పలేదు. కాని ఇప్పటికి చెప్తున్నాను అది నాకు కావలసిన మనశ్శాంతి ఇచ్చింది. నేను తప్పు చేశాను నన్ను క్షమించు, ఇక చేయను అని మాట ఇవ్వను. నేను సాధారణమైన ఆడపిల్లను, నాలో వేదన నన్ను మించి పోయింది. అది నా వయస్సుకే మించిపోయింది. అది తట్టుకోలేకే అమృతాన్ని అందుకున్నట్లుగా దానిని స్వంతం చేసుకున్నాను."

"మధూ! ఎవరితో మాట్లాడుతున్నావు?" భరత్ గొంతు వినగానే మాటలు ఆపింది అంజు.

"వదిన లేచింది అన్నయ్యా!"

"భరత్ తలుపు తెరుచుకుని లోనికొచ్చాడు. అతనిని చూడగానే అంజు మధు చేతిలోనున్న తన చేతిని విడిపించుకుని అటువైపు తిరిగింది.

భరత్ అంజు దగ్గరగా వచ్చి నుదుటిమీద చేయి ఆనించి చూచాడు.

"మధూ వెళ్ళి హార్లిక్స్ తీసుకురా!" అని మరొక రెండు దిండ్లు తెచ్చి అంజు తల ఒక చేత్తో ఎత్తిపట్టి, మరొక చేత్తో దిండ్లు ఎత్తుగా పెట్టి, తనను కూర్చుండబెట్టి, నుదుటిమీద చిందరవందరగా పడివున్న వెంట్రుకలను సర్దాడు. మధు హార్లిక్స్ తేగానే ప్రక్కనే ఉన్న టేబిల్‌మీదనున్న టాబ్లెట్స్ బాటిల్ తెరిచి చేతిలోకి రెండు టాబ్లెట్స్ తీసుకున్నాడు.

అంజుకు అతను సపర్యలు చేస్తుంటే, ఒక ప్రక్క ఆశ్చర్యం, మరొక ప్రక్క ఆనందంతో మూసిన కళ్ళు తెరవడానికే భయపడింది, తను కళ్ళు తెరిస్తే ఎక్కడ అతను వెళ్ళిపోతాడో అన్నట్లు.

"నోరు తెరువు." అనగానే బుద్ధిమంతురాలిలా నోరు తెరిచింది. అతను మాత్రలు వేసి, హార్లిక్స్ తాగించాడు. తడి టవలుతో మూతి మొహం తుడిచి సరిగా పడుకోబెట్టాడు.

"మధూ! డాడీకి ఫోన్ చేయి మెకం తెలిసిందని. నీకు ఏమైనా పని వుండచ్చు. వెళ్ళి చూసుకో! నేను ఇంట్లోనే వున్నాగా!" అన్నాడు.

"ఊహూ! నేను ఎక్కడకి వెళ్ళనన్నయ్యా! వదినకు తోడు కావాలి. మీరే లీవు కాన్సిల్ చేసుకొని హాస్పిటల్‌కు వెళ్ళండి" అన్నాడు.



"నాకు రెండు రోజులు లీవు వుందిగా! ఆ తరువాత హాస్పిటల్‌కు వెళ్ళడం తప్పనిసరి. నేను చూచుకుంటానుగాని, డాడీ అదే పనిగా ఫోన్ చేస్తున్నారు నీవు వెళ్ళిరా! నా లీవు పూర్తయిన తరువాత నీవు రెండు రోజులు ఇంట్లో వుండవచ్చు." అతను అలా అంటుంటే అంజుకు మనస్సులో మధుమీద కోపంగా ఉంది. తమ ఇద్దరిని ఒంటరిగా వదలి వెళ్ళాడే అని.

"ఓకే! అన్నయ్యా! నేను పోతున్నాను. మీరు ఏదో బుక్కు మొహానికి అడ్డు పెట్టుకుని వదినను జాగ్రత్తగా చూడకుండా వుంటారేమో! మీరు నిర్లక్ష్యంగా వుంటే నేను ఆఫీసుకు వెళ్ళనే వెళ్ళను." బెదిరిస్తూ అంజును వదలలేనట్లుగా వదలి వెళ్ళిపోయాడు. అంజుకు తిరిగి నిద్ర వస్తుంటే బలవంతంగా కళ్ళు మూసింది ఎక్కడ ఈ కల కరిగిపోతుందో అన్నట్లు.

"ఏ డాక్టరు తన పేషంటును నిర్లక్ష్యంగా వదలడులే! భయపడకు వెళ్ళు. శ్రద్ధగా చూచుకుంటాగా!" మధును పంపేశాడు.

సాయంత్రం ఆరుగంటలప్పుడు శివసుబ్రమణ్యంగారు, బాన్, పిల్లలు వచ్చారు. సుబ్రమణ్యంగారు కోడలిని పలుకరించి, యోగక్షేమాలడిగి హాల్లో కొడుకులతో మాటలలో పడిపోయాడు. బాన్ అంజుకు టవల్‌బాత్ చేసి, ఒంటి మీదున్న గుడ్డలు, పడక గుడ్డలు మార్చి, సూప్ తీసుకువచ్చి అంజుచేత స్పూన్‌తో తాగించింది. ఆమె అలా చేస్తుంటే అంజుకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అది చూడ గానే, బాన్ సూప్‌బేసిను ప్రక్కన టీపాయ్‌మీద పెట్టి అంజును దగ్గరకు తీసికొంది. అంజుకు ఇక దుఃఖం ఆగలేదు. అది ఆపుకోవడం అసాధ్యమయినట్లు ఆమె గుండెలలో తలదూర్చి వెక్కివెక్కి ఏడవసాగింది.

"ఊరుకో అంజూ! అలా ఏడిస్తే తలనొప్పి వస్తుంది. ఇప్పుడు నీ ఆరోగ్యం సరిగా లేదు. ఇలా చూడు. నీ మనసులో కొరత ఏమిటో నాకు తెలుసు. ఇప్పటి సమయంలో నీకు తల్లి తోడు కావాలని నీ మనస్సు కోరుతోంది. ఇలాంటి సమయాల్లోనే ఒక ఆడదిక్కు అవసరం. అందుకే నేను హాస్పిటల్లోనే భరత్‌ను అడిగాను. అతను వినిపించుకోలేదు. మొండిపట్టుదల అతనూ! నేను రోజూ వచ్చి చూస్తుంటాగా. అతనిని తిరిగి అడిగి చూస్తాను. పిచ్చి మనస్సు, శరీరం పాడుచేసు కోకు." అంజు జుట్టు సరిచేస్తూ అలాగే వుండిపోయింది.

ఇంతలోనే తలుపు తెరుచుకుని లోనికి వచ్చిన భరత్ వాళ్ళిద్దరిని చూసి ఆశ్చర్యపోతూ "ఏమిటి ఏమయింది" అని అన్నాడు.

"భరత్! ఈ అమ్మాయిని నాతో పిలుచుకెళతాను. నేను జాగ్రత్తగా చూచుకొంటాలే! తనకు ఇప్పుడు తల్లి ప్రేమ అవసరం. వారం రోజుల తరువాత పంపుతాగా!" అంది.

"ఊహూ! ఇప్పుడు తనకు తల్లి ప్రేమకాదు ముఖ్యం. డాక్టరు ట్రీట్ మెంటు. తనకు ఆరోగ్యం సరిపడేంతవరకు వేరొక చోటికి కదల్చడం అపా

యానికి దారితీయడమే! మీరే వచ్చి పోతుండండి చాన్! తనకు పిల్లలతో కాలక్షేపం అవుతుంది" అన్నాడు.

చాన్ నిస్పృహగా అంజు వైపు చూసింది. అంజు ఇక చేసేది ఏమిలేనట్లు వెనుకకు వాలి కళ్ళు మూసుకుంది.

మరునాటిరోజు తిరిగి మైకంతోపాటే జ్వరం మొదలయింది, భరత్ ఇంజక్షన్ ఇచ్చి అక్కడే ప్రక్కనున్న కుర్చీలో కూర్చుండిపోయాడు. అంజు మత్తుగా కళ్ళు మూసుకుని వుంది.

హాల్లో అడుగుల చప్పుడుతోపాటే, వంటావిడ గొంతుతోపాటే మరొక ఆడగొంతు వినిపించడంతో భరత్ లేచి హాల్లోకి వచ్చాడు. అక్కడ సూజి.

"నువ్వా!" ఆశ్చర్యంగా అన్నాడు.

"అంజును చూడాలి."

సూజి గొంతు విన్న అంజు నిద్రమత్తు అతికష్టంగా వదుల్చుకుంది. శరీరం బలహీనంగా ఉన్నందువలన లేవలేకపోతుంది.

"వీల్లేదు. మర్యాదగా ఇక్కడినుండి వెళ్ళిపో!" సీరియస్‌గా అన్నాడు.

"నీవు ఏ విధంగా మాట్లాడినా ఐ డోన్ట్ కేర్. అంజును చూసికాని వెళ్ళను" కచ్చితంగా అంది.

"అంజు నా భార్య, నా పర్మిషన్ లేకుండా నీవు తనతో మాట్లాడడంకాని, చూడడంకాని సహించను."

"హుఁ! భార్య. నీకు తను భార్య అయినందువలననే ఆత్మహత్యకు కూడా వెనుదీయలేదు. అంజును ఆదరించి, అనునయించి తన దుఃఖాన్నుండి కాపాడినదాన్ని నేను. అంజుకు సంతోషాన్ని పంచిఇచ్చినదాన్ని నేను. నువ్వు కాదు. నీవు తన మనస్సును చిత్రహింసలపాలు చేస్తున్నావు. తనను నరకయాతనకు గురి చేస్తున్నావు. తను ఇప్పుడు నాకు స్వంతంకాని నీకు కాదు. తన మనస్సులో నీకు కాదు స్థానం నాకు. ఈ క్షణాలలో తనను నాతో తీసుకొని వెళ్ళగలిగే చనువు, స్వతంత్రం నాకు ఉంది కాని నీకు కాదు."

ఇదంతా వింటున్న అంజు ఒణికిపోయింది. రెండు భయంకర సింహాలు ఢీకొన్నట్లుగా వుంది. ఏ విధంగానైనా వాళ్ళను ఆపితే చాలు, భగవంతుడా నాకు శక్తినివ్వు. లేవబోతోంది కాని నీరసం వెనక్కు తోస్తోంది.

"సంతోషమా ఇస్తున్నావు. విషాన్ని అమృతమని నమ్మించి తనలోని అణువణువును హత్య చేస్తున్నావు. ఇదిగో! ఇదే లాస్ట్ వార్నింగ్. మరొకమారు నిన్ను అంజుతో చూశానంటే ఆ తరువాత నీవుండేది కమ్మీలవెనుక. జాగ్రత్త!" బెదిరించాడు.

"ఏ విధంగా?" వెటకారంగా నవ్వింది.

"ఏ విధంగానా! నీవే డ్రగ్ పుషర్ అని రిపోర్ట్ ఇస్తాను. దీనికి ఆధారం



అంజు గదిలో దొరికిన డ్రగ్స్. మనదేశంలో డ్రగ్స్ వ్యాపారం చేసేవాళ్ళకు శిక్ష ఏమిటో తెలుసుగా! ఉరి. అది గుర్తుంచుకో!"

"యూ ఫూల్! ఆడవాళ్ళను ఎప్పటికి అర్థం చేసుకుంటావు. నిన్ను ప్రేమించి. నీ ప్రేమభిక్ష యాచించాననేకదూ నీకింత చులకన. హుఁ! అందుకే... అందుకే..." అతి వేగంగా వురుకుతున్న ఉచ్ఛ్వాశ నిశ్వాసలను ఆపుకోవాలన్నట్లుగా ఆగి తిరిగి అంది, "నీకు నాలాంటి ఎంగిలి ఆకే దొరికింది అది చాలు నీ అహంకారానికి శిక్ష."

"డోన్టాక్ రబ్బిష్! గెటవుట్ ఫ్రమ్ హియర్" గర్జించాడు.

దబ్ అన్న చప్పుడుతో భరత్ వేగంగా అంజు గదిలోకి వచ్చాడు. అంజు కుప్పలా క్రిందపడి పోయివుంది. శరీరంలో ఎలాంటి చలనంలేదు.

"అంజూ! అంజూ!" భరత్ అంజును కదిలించి చూశాడు. అంజు మైకంలో పడివుంది. రెండు చేతులతో పైకెత్తి పడకమీదకు చేర్చాడు. మరొక రెండు నిమిషాలకు కళ్ళు తెరిచిన అంజు ఎదురుగానున్న భరత్‌ను చూడగానే మొహం తిప్పుకుంది. అతను హార్లిక్స్ తీసుకునివచ్చి స్పూన్‌తో కొద్దికొద్దిగా నోట్లో వదులుతుంటే, అది వద్దని చెప్పలేక బలవంతంగా మింగింది.

అంజు బాగా కోలుకునేటప్పటికి రెండు వారాలు పట్టింది. భరత్, మధు ఇద్దరూ కంటికి రెప్పల్లా కాపాడారు. భరత్ ఈ రెండు వారాలు రాత్రివేళల్లో హాల్లో సోఫాలోనే నిద్రపోయేవాడు అంజు సూజిని కలిసి మాట్లాడాలని తపించిపోతోంది. ఇప్పటికి సూజి అన్న మాటలు తన చెవులలో గింగుర్లు తిరుగుతూనే వున్నాయి. నిన్ను ప్రేమించి, నీ ప్రేమ భిక్షను యాచించాననేకదూ ఈ చులకన. అంటే సూజి, భరత్ వెనుక ఏదో దాగుంది. దానిని గురించి మధుకాని, సూజికాని చెప్పలేదు. హటాత్తుగా ఆవేశంలో నోరు జారింది. అసలు సూజి ఏం తన తల్లిదండ్రులతో చనువుగా, అనురాగంగా కలిసి వుండదు. వాళ్ళ గురించి ఒక్క మాటైనా చెప్పదు. సూజి జీవితంలో ఏదో జరిగింది, తన మనస్సును విప్పి ప్రతిది వివరించింది. కాని సూజి తెరువని పుస్తకంలా అలాగే ఉండిపోయింది.

ఎంగిలి ఆకు, తనేకాదు! సూజి కూడా అంతే! అలా అని సూజియే ఒప్పుకుంది. ఏ విధంగా సూజిని కలవాలి. భరత్ చాలా త్వరగానే వస్తున్నాడు. హాస్పిటల్‌కు వెళ్ళేటప్పుడు. వంటామెకు తనకు కావలాపెట్టి వెళుతున్నాడు. ఆమె ఒక్క నిమిషమయినా ఏమారడంలేదు. ఈరోజు ఎలాగయినా తనను కలుసుకోవాలి. గట్టిగా నిశ్చయించుకుంది.

అంజు అనుకొన్నట్లు ఆ రోజు జరగలేదు. మరొక రెండు రోజుల తరువాత శనివారం మధ్యాహ్నం వేళ ఇద్దరు కలుసుకున్నారు. అంజును చూడగానే సూజి రెండు చేతులతోచుట్టి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "నా వల్లనే కదూ ఇలా

అయింది. అంజూ నన్ను క్షమించు. భరత్, మధు నన్ను అసహ్యించుకుంటున్నారంటే అసహ్యించుకోరూ! నామీద కోపమా అంజూ! నీ కడుపులో వుండే బిడ్డను హత్య చేసిన దానిని నేను. నాకు క్షమాపణే దొరకదు." కళ్ళ నీళ్ళు తుడుచుకుంటు అంది.

"ఛీ! ఛీ! అలా ఏడవకు! ఇంతవరకు నీ కళ్ళలో నీళ్ళు చూసి ఎరుగను. నీవు నాలా బలహీనురాలివికాదు సూజీ! నీ ధైర్యాన్ని ఆధారంగా చేసుకునే నేను బ్రతుకుతున్నాను. నీవే బేలవైతే నేనెలా కాలం గడపగలను. ఆ బిడ్డ పాపానికి ఫలితం. సరయిన భార్యాభర్తల అనురాగానికి చిహ్నంకాదు. అలాంటప్పుడు నీవు ఏదో కీడు చేశావని కళ్ళనీళ్ళు పెట్టుకోవడం సరయినదికాదు. ఇక ఆ బిడ్డ నెలలునిండి పుట్టినా డ్రగ్స్‌తో నిండిన నా రక్తాన్నేకదూ పంచుకుని పుడ్తాడు. అలా పుట్టినవాడు సక్రమంగా పుడ్తాడా! భగవంతుడు అన్నీ మంచికే చేస్తుంటాడు. కాని ఒక్కటే బాధ, ఆ బిడ్డతోపాటే నేనెందుకు చావలేదు అని. నేనొక డాక్టర్ని కాకుండా ఒక సాధారణ వ్యక్తిని పెండ్లాడి వుంటే ఈనాడు నిండు ప్రాణాలతో నీ ఎదురుగా నిలిచి వుండను," వేదనగా అంది.

"అలా అనకు అంజూ! నీవు ఇలా ప్రాణాలతో వుండబట్టే నాకు భగవంతుని దగ్గర క్షమాపణ అయినా దొరుకుతుంది. నిజంగానే దేవుడు కరుణామయుడు. నిన్నైనా నాకు దక్కించాడు. అంజూ! నాతో వచ్చేయి. మనిద్దరం ఎక్కడయినా ఒకటిగా వుందాం. భరత్ మన ఇద్దర్ని దూరం చేస్తున్నాడు. మన స్నేహాన్ని కించపరుస్తున్నాడు. నా ప్రాణమయిన నిన్ను నానుండి విడదీస్తున్నాడు. ఏమంటావు అంజూ! అతనికి నీకు మధ్య ఎలాంటి అనుబంధం లేనప్పుడు అతడినే నమ్ముకుని అతనితో ఉండడం కేవలం తిండి కొరకేనా! ఆ తిండి అనేది ఈ దేశంలో ఏ చిన్నపనినయినా చేసినా దొరుకుతుంది. ఇది తిండికి గుడ్డకు కరువులేని దేశం. బదులివ్వు అంజూ! చదువుకున్నదానివి, కొన్నైనా స్వాతంత్ర భావాలు ఉండకపోవు. ఎప్పటికైనా నీకు నచ్చినవాడు ఎదురవక పోడు. మరొక వివాహం చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా గడపక అతనిని అంటిపెట్టుకుని అడుగడుగునా అవమానాలతో, నీలో నీవే కృంగిపోతూ నీ నిండు బ్రతుకు సర్వనాశనం చేసుకుంటున్నావు. నేను భరత్‌మీద ద్వేషంతో ఈ మాటలు అనడం లేదు. నీమీద ప్రేమవలన నాలో కలుగుతున్న భావాలివి. నిన్ను పూర్తిగా అందరిలా సంతోషంగా గడిపే ఆడ పిల్లలా చూడాలనే!" ఆవేశంగా అంది సూజీ.

అంజుకు సూజికి, తనమీదనున్న ప్రేమాభిమానాలకి కళ్ళు చెమ్మగిల్లాయి. తను అంత ధైర్యంగా ఇల్లు విడిచి వెళ్ళగలదా! భర్తకు తనమీద ఎలాంటి అభిమానం, గౌరవం ఉండక పోవచ్చు. కాని తను అలాకాదే! తన ప్రాణాలన్ని అతనిమీదనే నింపుకుని వున్నది. తన మనస్సు ఎంత వద్దనుకొన్నా అతఙ్ఞ చుట్టూ



వలయంలా తిరుగుతూనే వున్నది. అలాంటప్పుడు తన జీవితంలో మరొక వివాహమా! మరొక వ్యక్తా! అది ఊహించనైనా ఊహించగలదా!

"మాట్లాడు అంజూ! నా తపన అర్థం చేసుకో! నాకు తెలుసు భరత్ తిరిగి మనల్ని కలువనీయడని, బాగా ఆలోచించు. నా దగ్గర డబ్బుకు కొరవలేదు. నీకు ఎలాంటి లోపం రానివ్వను."

"సూజీ! నిజంగా నామీద నీకింత ప్రేమ అనేది వుంటే ఒక్కసారి, ఒక్కసారయినా నీ గురించి చెప్పావా! నేను నిన్ను నమ్మినంతగా నీవు నన్ను నమ్మకనేగదూ! ఏదో చెప్పలేకపోయావు. భరత్‌కు నీకు మధ్య ఏదో జరిగింది కాని దానిని గురించి నీవు ఏనాడు చెప్పలేదు. అందే నా దృష్టిలో పలచనయి పోతావనే కదూ!"

"అంటే ఆ రోజు అన్నీ విన్నావా!" ఆశ్చర్యంగా అంది.

"ఊఁ!"

"మై గాడ్! అంజూ! నాకు తెలియనేలేదు. మరి అలాంటప్పుడు ఏం బయటకు రాలేదు."

"రావాలనే ప్రయత్నించాను. మీరిద్దరి తగవు ఆపాలనే అనుకొన్నాను. కాని నా శరీరం నా ప్రయత్నాన్ని విఫలం చేసింది. చివరగా ఎంతో కష్టంమీద పైకిలేచిన నేను తిరిగి స్పృహతప్పి పడిపోయాను."

"అలాగా! భరత్ నిన్ను చూడనీయకుండా అడ్డగించాడు. ఆ పిచ్చి కోపంలో ఏం మాట్లాడుతున్నానో ఆలోచించక నోటికి వచ్చినట్లు వాగాను. అవి మనస్సులో వుంచుకోకు అంజూ!"

"నీవు నోటికి వచ్చినట్లు మాట్లాడిన మాటలు నిజంకాని అబద్ధంకావుగా! నీకు ఇష్టం వుంటేనే చెప్పు, లేకుంటే వదిలేయి. బలవంతంలేదు," నిష్ఠూరంగా అంది.

"కోపగించుకోకు అంజూ! ఏమని చెప్పమంటావు? నేను నీలానే తల్లిదండ్రుల చాటున అపురూపంగా పెరిగిన ఆడపిల్లనని చెప్పనా! వికసించిన వయస్సులో మొట్టమొదటసారిగా ప్రేమ అనే దానికి అర్థం తెలిపిన భరత్ గురించి చెప్పనా! బలవంతంగా ఒక పశువుచేత మానభంగం జరిగిన ఉదంతం చెప్పనా! ఆ తరువాత ప్రతిఒక్కరిచేత వెలివేయబడ్డ సంగతులు చెప్పనా! అదంతా రెండు సంవత్సరాలక్రింద జరిగిపోయిన కథ. తిరిగి నీవు అది వినాలని వుంటే ఎందుకు కాదంటాను. ఓపికవుంటే విను."

"అంజూ! నీలా నేను గ్రాడ్యుయేట్‌నుకాను. కాని మాకు ఇక్కడ ఫిఫ్త్ ఫారమ్ వరకు చదివితే చాలు. ఎక్కడయినా మంచి ఉద్యోగమే దొరుకుతుంది. నేను నా ఫార్మ్ ఫైవ్ పూర్తికాగానే సెక్రటరీ కోర్సు చదివి ఒక కంపెనీ ఆఫీసులో సెక్రటరీగా చేరాను. నాకు తెలుసు నేను అందంగా వుంటానని, ప్రతి మగ

వాడి హృదయాన్ని కదిలించగలనని. కాని మనస్సుమటుకు ఎవ్వరూ ఆక్రమించలేకపోయారు. నాకు అలాంటి ఆలోచనలేదు. కాని నేను ఊహలలోనయినా తలచని అలాంటి మార్పు అనుకోకుండా ఒకనాడు నాలోను చోటు చేసుకుంది, అది ఒకరోజు సాయంత్రం వేళ లిఫ్టు దగ్గర భరత్‌ను చూడడం, అతనిని చూడడం అదే మొదటి సారి. ఎందుకో అతనిని చూడడంతోనే విచిత్రంగా మనస్సులో ఏదో స్పందన, గుండె వేగంగా కొట్టుకోవడం ఇదంతా క్రొత్త అనుభవం. ఇతను ఎక్కడివాడు. ఈ ఫ్లాట్‌లోనే వుంటున్నాడా! ఈ ఫ్లాట్స్‌లో ఎక్కడ ఉన్నా ఇతనితో పరిచయం చేసుకుని తీరుతాను కాని అలాకాక ఏ విజిటరో అయిన పక్షంలో ఏ విధంగా ఇతన్ని పరిచయం చేసుకోగలను? కాని ఎలాగయినా సాధిస్తాను. నేను వెళ్ళాల్సిన ఆరవ ఫ్లోర్ వరకు ఇతను ఎక్కడ ఆగితే అక్కడ ఆగుతాను. అయినా పలుకరించిచూస్తే తప్పేముంది. నాలాంటి అందగత్తెకోరి పలకరిస్తే ఏ మగవాడు కాదంటాడు,

"హలో! మీరు ఈ ఫ్లాట్స్‌కు క్రొత్తవారా!" పలుకరించాను.

"అవును. నేను రెండురోజుల క్రిందనే స్టేట్స్‌నుండి వచ్చాను. కాని నా బ్రదర్ ఇక్కడనే వుంటున్నాడు," అతను మర్యాదగా బదులిచ్చాడు.

ధైర్యం వచ్చింది. అంటే ఎవరి ఇంటికి విసిటర్‌కాదు. థాంక్‌గాడ్! మనసులోనే నిట్టూర్చాను,

"అలాగా! మీ బ్రదర్ పేరేమిటి? ఏ ఫ్లోర్‌లో ఉంటున్నారు? ఇద్దరం లిఫ్టులో దూరగానే అడిగాను.

"మధుకర్! ఆరవ ఫ్లోర్‌లో చివరి ఇల్లు మాదే!"

ఎగిరి గంతువేయాలనిపించింది. ఎందుకంటే భరత్ ఇంటికి ఇవతలి ఇల్లు మాదే కనుక.

"ఓహ్! లక్కీడే ఈరోజు, మీ ప్రక్కనున్న భాగం మాదే! మధు నాకు తెలుసు." సంతోషంగా అన్నాను.

"ఊహూఁ!" అంతే తిరిగి బదులేలేదు.

ఇద్దరం లిఫ్టుదాటి బయటపడ్డాం. అరే! ఇల్లు దగ్గరకి వచ్చేస్తున్నదే! ఇతను మాటలు పెంచడేమిటి. ఏం చేస్తాం. నేనే పొడిగిస్తాను లేకుంటే గబుక్కున ఇంట్లో దూరేటట్లు వున్నాడు. ఇక ఆగలేనట్లు. "ఇంతకీ మీ పేరు చెప్పనే లేదు. ఏం చేస్తుంటారో చెప్పండి," నిజం చెప్పాలంటే అతనిని చూడకపోయినా మధు ద్వారా అతని వివరాలు నాకు తెలుసు.

"నా పేరు భరత్. హార్ట్ స్పెషలిస్టుని!" ఇంటి దగ్గరకు వచ్చేశాం, అతనిని వదిలి వెళ్ళాలంటే అశాంతిగా వుంది.

"నా పేరు అడగనేలేదు." నిష్ఠూరంగా అన్నాను.

"చెప్పండి," చిరునవ్వు నవ్వాడు.



క్షణం నా శరీరం. నా మనస్సు వశం తప్పింది. అతని మధురమైన చిరు దరహాసం చూసి.

"నా పేరు సూజీవాంగ్, మీ ప్రక్క ఇంట్లో ఉండే లిమ్ యూ కూతురిని. సెక్రటరీగా పని చేస్తున్నాను." నాకు నేనుగా వివరాలు అందించాను.

"గ్లాడ్ టు మీట్‌యు," ఒక్కమాటలో కట్‌చేసి లోపలికి వెళ్ళిపోయాడు.

అతను లోనికి వెళ్ళినట్లుగా నేను పోలేకపోయాను. మనసంతా శూన్యంగా వుంది. తిరిగి అతనిని ఎప్పుడు చూస్తాను. ఎలా స్నేహం పెంచుకుంటాను ఇవే ఆలోచనలు. స్నేహం. నిజంగానే ఇది స్నేహమా! స్నేహమయితే ఇలా మనస్సంతా ఏదో కావాలన్న కోరికతో ఏం తపించిపోతున్నది. ఎంతోమంది స్నేహితులు వున్నారే, అప్పుడు కలగని ఈ భావం ఇప్పుడేం ఇల్లా తనన్ను వెర్రిదానిని చేస్తున్నది. అతను చివరకు తన జాతి కూడా కాదు. అతను ఇండియన్. తాను చైనీస్. ప్రేమకు జాతి, మతం లేదు అని వూరికే అనలేదు. ఓహ్! అంటే తను ప్రేమలో పడింది. అది మొదటగా! అంటే లవ్ యట్ ఫస్ట్‌సైట్. నాకొరకు భగవంతుడు నిర్ణయించిన వ్యక్తి ఇతనే! భగవంతుడా! ఇవిగో నా మనఃపూర్వక కృతజ్ఞతలు. నాకు చూపించిన ఈ అపురూపమయిన వ్యక్తిని నాకు స్వంతం చేయి. జీవితాంతం నీకు దాసిగా వుంటాను. కనిపించని ఆ దేవుణ్ని మొదటగా మనసారా ప్రార్థించాను.

అతను తిరిగి వెలుపలికి వస్తాడేమో అని రాత్రివరకు ఎదురుచూస్తుండిపోయాను. కాని అతనిని చూడలేకపోయాను. రోజులు గడుస్తున్నాయి. అతనితో పరిచయం ఎక్కువగా పెరగలేదు. కారణం అతని నోటిగుండా ఒక్క సమాధానమేనా పది ప్రశ్నలకు ఒచ్చే జవాబు. ఎంతసేపు అవసరమయినవి, అనవసరమయినవి పిచ్చి ప్రశ్నలతో అతనితో వెర్రిదానిలా సంభాషణ పెంచేదాన్నికాని, అందువలన నాకనివున్న ఆత్మగౌరవం, ఆత్మాభిమానం దెబ్బతింటున్నాయని ఆలోచన కూడా లేకపోయేది. ఒకే ధ్యేయం. అతనిని నావాడిగా చేసుకోవాలన్నదే! అతని అలవాట్లను, వాటికి అతను ఉపయోగించే సమయాలను పనిమనిషి ద్వారా తెలుసుకున్నాను. అతను ప్రతిరోజు ఐదుగంటలకే నిద్రలేస్తాడని, ఆ తరువాత ఆరుగంటలవరకు జోగింగ్‌కు వెళుతాడని, ఆ తరువాత ఏడువరకు స్విమ్మింగ్ చేస్తాడని, అటుపిమ్మట అన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేసుకుని హాస్పిటల్ వెళుతాడని, సాయంత్రం అతను ఒచ్చే టయిమ్ తెలుసుకున్నాను.

ఉదయం అతనితో వెళితే రెండుగంటలసేపు అతనితో గడపవచ్చు. ఇదే నా ప్లాన్. మరుసటిరోజు నాలుగుగంటలకే లేచి కూర్చున్నాను. నాలుగున్నరకల్లా ట్రాక్ సూటులో తయారయి, చిన్న బ్యాగ్‌లో బికిని వేసుకుని వెలుపలికి వచ్చాను. కరక్ట్ ఐదు. అతను వెలుపలికి వచ్చాడు. తెల్ల షార్టు, తెల్లి బనీను టక్‌చేసి వున్నాడు. తెల్ల కాన్వాస్ బూట్లు, చేతిలో చిన్న ప్లాస్టిక్ బ్యాగ్. నాకు

తెలుసు. అందులో అతని స్విమ్మింగ్ ట్రంక్స్, టవల్ ఉంటుందని. అప్పుడే అతనిని చూస్తున్నట్లుగా పలుకరించాను. ఈమధ్య వెయిట్ ఎక్కువయిందని, జోగింగ్ చేయాలని నిర్ణయించానని బొంకాను. అతనినే అనుసరించాను, అది అతనికి నచ్చలేదని అతని మొహమే చెప్తున్నది. కానీ అంత తేలికగా నా ప్రయత్నాలను వదలదలచలేదు. జోగింగ్, స్విమ్మింగ్ అతనిని అంటిపెట్టుకునే చేసేదాన్ని. రోజులు గడుస్తున్నాయే కాని అతని దగ్గరనుండి ఎలాంటి రెస్పాన్స్ లేదు. కాని నేనుమటుకు ఊహలలో అతనితో కాపురం చేసేదాన్ని. నాకూ అతనికి పెండ్లి జరిగినట్లు, అది హిందూ పద్ధతిలో దేవాలయంలో అతనిచేత వసుపుదారం, తాళిబొట్టుతో మూడుముళ్ళు వేయించుకున్నట్లుగా, స్నేహితులకంతా ఇండియన్ పద్ధతిలో డిన్నరు అరేంజి చేసినట్లుగా, ఆ తరువాత అతనితో కాపురం ఏవిధంగా జరిపేది, అతనికొరకు చీర కట్టుకోవడం, వెంట్రుకలు పెంచి జడవేసుకోవడం, మొహాన బొట్టు, తలలో పూవులు, ఒకటేమిటి, ఒక ఇండియన్ స్త్రీకి ప్రతిబింబంగా ఉండాలని, అతను ఇచ్చిన ప్రతి బిడ్డకు తల్లిని కావాలనుకోవడం, అతనితో షికార్లు, అతనికొరకు ఎదురుచూడడం, ఇలా ప్రతి ఆలోచనతో స్వర్గంలో తేలుతుండేదాన్ని. ఆఫీసులో కూర్చున్నా, రాత్రి పడుకున్నా ఎక్కడున్నా, ఏం చేస్తున్నా అతని తలపులే! అతను లేకుండా నేను లేనని, నేను లేకుండా అతను లేడని పిచ్చిదానిలా అతనికే అంకితమయ్యేదాన్ని.

ఇలాంటి టయిమ్‌లో మా బాస్ ప్రవర్తనలో మార్పు. అతనికి దాదాపు నలభై ఐదు పైనే వయస్సు వుంటుంది. మొదట ఎంతో పెద్దరికంగా, చూసే వారికి గౌరవనీయంగా ఉంటున్న అతను క్రమేణా అతని మాటలలో చేతలలో నామీద తనకున్న అభిప్రాయాన్ని చూపించడం మొదలు పెట్టాడు. నాకు అతనిని చూస్తే అసహ్యంతో శరీరం జలదరించేది, కాని ఒక మొండి ధైర్యం వీడు నన్నేం చేయగలడు అన్న. నాకు వీడి ఉద్యోగం జీవనాధారంకాదు. వ్యాపారం మీద ఇంటరెస్ట్ లేకే, మా ఫాదర్ వేరే మనుషులకు జీతాలు ఇచ్చి ఉద్యోగం చేయిస్తుంటే; నేను ఇలా ఆఫీసు లైఫ్ యంజాయ్ చేస్తున్నట్లుగా ఈ ఉద్యోగంలో చేరనేకాని వాడిచ్చే జీతంకొరకుకాదు. వాడు చాలాసార్లు నైట్ క్లబ్బులకు, హోటల్సుకు ఎక్కడికయినా పోదాం రమ్మని పిలిచేవాడు. నేను చెవిలో వేసుకునేదాన్ని కాను. నా మనస్సంతా నిండిపోయి, నన్ను పూర్తిగా బానిస చేసుకున్న భరత్ రూపం తప్ప నా కళ్ళ ముందర మరొక రూపం నిలువను చోటెక్కడది.

ఎంతో ఓర్పుతో భరత్ దగ్గరనుండి నేనంటే తనకు ఇష్టమేనన్న వార్త వస్తుందని ఎదురు చూసిచూసి చివరకు నాకు నేనే మనసు విప్పి చెప్పాలన్న నిర్ణయానికి వచ్చాను.

ఒకనాడు భరత్ క్రింద పార్టీ ఇస్తున్నాడు. ఆ పార్టీకి నన్ను ఆహ్వానించాడు. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. అతనిని ఆకర్షించేందుకు అద్భు



తంగా అలంకరించుకు తయారయాను. అద్దంలో నా ప్రతిబింబం ముద్దొచ్చేలా వుంది. పార్టీ గ్రాండ్‌గా ముగిసింది. అంతా అతని స్నేహితులు, డాక్టర్లే. పార్టీ ముగిసేంతవరకు, నేనే అతని భార్య నన్నట్లుగా అతనిని అంటి పెట్టుకుని తిరిగాను. పార్టీ ముగిసింది. గెస్ట్స్ అంతా వెళ్ళిపోయారు. నేను మటుకు భరత్‌ను వదలి వెళ్ళలేదు. రాత్రి ఒంటిగంట అయింది. ఇద్దరం కలిసే బయటకువచ్చాం. అతను మా వాకిలి దగ్గరకు రాగానే గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోబోయాడు. కాని ఇంత చక్కని సమయం వృధా పోనివ్వకూడదని అతనికి దగ్గరగావచ్చి నిలబడ్డాను. తనతో కొంచం మాట్లాడాలని పది నిమిషాలు టైమ్ ఇవ్వమని కోరాను. అతను ఆశ్చర్యపోయినట్లుగా అతని మొహమే చెప్తున్నది. ఇంత రాత్రికి ఏమిటి, రేపు చెప్పకూడదా అన్నాడు. కాని నన్ను నేను కంట్రోల్ చేయడం అసాధ్యమయి పోయింది. అత్యంత సుందరమైన అతని రూపాన్ని ఏ రకంగానైనా నా వశం చేసుకోవాలన్నట్లుగా, ఇక నిలువలేనట్లు అతని చేరువగా వెళ్ళి నా రెండు చేతులను అతని మెడచుట్టువేసి ఐ లవ్ యు భరత్, మీరు లేకుండా ఒక్క క్షణమైనా బ్రతకలేను, నన్ను విడిచి వెళ్ళకండి. నన్ను వివాహం చేసుకోండి భరత్" అని సిగ్గు విడిచి, ఆడదాన్నన్నది కూడా మరచి ప్రాధేయపడ్డాను. అతని చేతులు నన్ను చుడతాయేమో అని ఎదురు చూసిన నాకు అతని రెండు చేతులు తనను చుట్టిన నా చేతులను విడ దీశాయి. మరు క్షణం అతను దూరంగా జరిగి నిలబడ్డాడు,

"చూడు సూజీ! లిక్కర్‌లో ఉన్నందువలన నీవు ఏదేదో మాట్లాడుతున్నావు. పోయి నిద్రపో! రేపు ఉదయం ఇదంతా ఏమి గుర్తుండదు. వెళ్లు. ఇప్పటికే చాలా ఆలస్యమయింది" అన్నాడు.

"లేదు భరత్! నేను చెప్పేది నిజం. నూటికి నూరుపాళ్ళు నిజం. మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలోనే మీరు మానసికంగా భర్త అయ్యారు. మీరే నన్ను అడుగుతారని ఇన్ని రోజులు ఎదురు చూశాను. మీ దగ్గర ఎలాంటి బదులు లేకనే నాకు నేనుగా సిగ్గు విడిచి ప్రాధేయపడుతున్నాను. భరత్ మీరు కాదంటే నాకు జీవితమే లేదు. నన్ను కాదనకండి. ప్లీజ్! భరత్! నన్ను.... నన్ను దూరం చేయకండి." అతనిని పట్టుకుని ఏడ్చాను. అతను రాయిలా నిలబడ్డాడేకాని, నా కన్నీళ్ళకు కరగలేదు.

"మాట్లాడండి భరత్! మౌనంగా ఉండకండి" ఎంతగానో ప్రాధేయపడ్డాను.

అతను పెదవి విప్పాడు. అతని నోటిగుండా నన్ను అలరించి ఆనందపరిచేమాట వస్తుందని ఆశతో నా కన్నీళ్ళ మధ్య ఎదురు చూశాను. కాని నా ఊహల మేడలు కూలిపోతున్నట్లుగా అతని బదులు "సారీ! నీవు అలా భావించుకునేందుకు నేను, నా ప్రవర్తన కారణం అయినందుకు క్షమార్పణ కోరుకుంటున్నాను సూజీ! నీకు నీవుగా నాతో స్నేహం చేశావు. నేను అది ఆదిలోనే తుంచ

ప్రయత్నించాను, కాని నీవే దానిని పొడిగించావు. నాకు ఈ ప్రేమలు వాటిమీద నమ్మకంలేదు. పెద్దలు నిర్ణయించి, నా మనస్సును కదిలించి, తనూ నన్ను మనస్పూర్తిగా కోరితేనే నాకు వివాహం అన్నది జరిగేది. అంతవరకు ఇలాంటి ప్రేమ కధలు నా వెనుక పెట్టుకోవడం అన్నది జరగనివ్వను. అంతేకాదు. నాకు నీమీద స్నేహభావం తప్ప మరెలాంటి అభిప్రాయం లేదని మనస్పూర్తిగా చెప్తున్నాను. నన్ను మన్నించు" అని వెళ్ళిపోయాడు.

సుడిగుండంలో చిక్కుకుపోయి ప్రాణంమీద ఎలాంటి ఆశలేని వ్యక్తిలా, ఈ ప్రేమ సుడిగుండంలో చిక్కుకుపోయి దానినుండి బయటపడలేక, చేయి అందించే కాపాడే శక్తిలేక అల్లాడి పోయాను. కాని ఎక్కడో మరి కొంచం ఆశ. అతను ఆలోచిస్తాడు. నన్ను చేరదీస్తాడు అన్న ఆశ. ఆ ఆశను చంపుకోలేక పోయాను.

రాత్రంతా ఏడ్చి నిద్రపోయిన నేను ఆలస్యంగా నిద్ర లేచాను. రాత్రి జరిగిందంతా, ఒక్కొక్కటిగా కండ్ల ముందర మెదలసాగాయి. అదంతా కలా నిజమా అన్న అనుమానం, భగవాన్! భరత్ లేకుండా నేను బ్రతకలేను. భరత్ నాకు మటుకే స్వంతం, అతను నా వాడు. నిద్రమత్తు వదుల్చుకుని గడియారం వైపు చూసిన నాకు టయిమ్ పదిన్నర తెలుపుతోంది. భరత్ వెళ్ళిపోయి వుంటాడు. అతని కొరకు కళ్ళు కాయలు కాచేలా సాయంత్రం వరకు బయటే నిలబడి ఎదురు చూశాను,

అంత దూరంనుండి అతను వస్తుంటే గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. కాళ్లు తడబడుతుంటే సంతోషాన్ని, దుఃఖాన్ని కలబోసి ఆశతో ఎదురు పరుగెత్తాను.

చిరునవ్వు నవ్వాడు. "ఎలా ఉన్నావు! రాత్రి పైత్యం దిగిపోయిందనుకొంటాను," అతను అలా నవ్వుతుంటే వెన్నెల కురిసినట్లు వుంది.

బదులు పలకలేక వెన్నంటి వెళ్ళాను. అతను లోపలికి వెళుతుంటే మొట్ట మొదటి సారిగా అతను ఆహ్వానించకపోయినా అతని వెనుకనే లోపలికి వెళ్ళాను.

"ఏమిటి? ఏమైనా చెప్పాల్నా! రాత్రి నీవు చెప్పినదంతా నేను మరచిపోయాలే! ఇలాంటివి ఎన్నోమార్లు విన్నాను." అతను సోఫాలో కూర్చుంటు కాలికున్న సాక్స్ తీస్తున్నాడు. చటుక్కున నన్ను నేను మరచి అతని కాళ్ళ దగ్గర కూర్చొని ఆ సాక్స్ నేనే విప్పబోయాను. అతను కాళ్ళు వెనక్కు జరుపుకుంటూ "సూజీ! ఏమిటిది. రాత్రి మైకంలో ఏదేదో మాట్లాడావనుకొన్నాను. ఇప్పుడు ఇలా!" అతను దిగ్భ్రమగా చూస్తున్నాడు.

"మీరు నావారు. అలాంటప్పుడు మీ పనులు చేయడంలో తప్పేంలేదు." తలవంచుకునే బదులిచ్చాను.



"నీవు....నీవు ఏం మాట్లాడుతున్నావో తెలుసా! మీ తల్లిదండ్రులు చూస్తే ఎంత అసహ్యం. దయవుంచి వెళ్ళిపో; మరొకమారు నన్ను వెతుక్కుంటూరాకు" అతను లేచిపోబోయాడు.

వంటావిడ అక్కడే ఉన్నదికూడా మరచిపోయాను. "ప్లీజ్! భరత్ నన్ను కాదనకు, మీరు కాదంటే నేను పిచ్చిదాన్నయిపోతాను. భరత్ నన్ను నమ్ము," ఏడ్చాను.

"సూజీ! ఇది ఇంపాజిబుల్! రాత్రే చెప్పాను. నా కలాంటి ఉద్దేశంలేదని. అందమైనదానివి నీవు. నీకు తగిన వరుడు మీ జాతిలోనే నీకు భర్తగా వస్తాడు. నిన్ను కళ్ళలో పెట్టుకుని కాపాడుతాడు నన్ను వదిలేయి" అన్నాడు.

అతను విసుగు పైకి చూపడంలేదుకాని అతని మాటలుద్వారా తెలుస్తోంది. ఏడ్చాను, గొడవ చేశాను, బెదిరించాను. నా కళ్ళ నీళ్ళకు, నా బెదిరింపులకు అతను కరగలేదు, జడవలేదు. ఇదంతా తనకు అలవాటేనన్నట్లు కామ్‌గా ఉండిపోయాడు. చివరకు వంటామెను పిలిచి, నన్ను పంపేయమని తన గదిలోకివెళ్ళి తలుపు బిగించుకొన్నాడు వెఱ్ఱిదాన్నయ్యాను. తిండితిప్పలు మానేశాను. నా తల్లి దండ్రులకు ఇదంతా తెలియదు. మా ఫాదర్ మటుకు అప్పుడప్పుడు భరత్‌తో మాట్లాడుతుంటాడు. ఇలాంటి సమయంలోనే జరగరాని ఘోరమే జరిగింది. మా బాస్ ఒకనాడు మర్యాదగా పిలిచాడు. తన కొడుకు బర్త్‌డే అని! తన భార్య నన్ను చూడాలని అంటున్నదని, తనను చూస్తుంటే తన చనిపోయిన అక్క కూతురుని చూస్తున్నట్లుగా ఉంటుందని. నన్ను విందుకు ఆహ్వానించాడు. నేను మొదలుమాదిరి గట్టి మూడ్‌లో ఉండి వుంటే కచ్చితంగా నిరాకరించేదాన్ని. కాని భరత్ వేదనలో మునిగిపోయిన నేను అతని మాట కాదనలేక, అతని భార్యను పరిచయం చేసుకోవచ్చునన్నట్లుగా అతని ఇంటికి ఆఫీసు వదలగానే, పిల్లవాడి ప్రజంటేషన్ కొనుక్కొని అతని కార్లోనే బయలుదేరాను. అతని బంగళా జూరింగ్ ఏరియాలోనే ఉన్నది. అన్ని పెద్దపెద్ద బంగళాలు, కారు పోర్టికోలో ఆగింది. పెద్దపెద్ద కుక్కలు నాలుగు ఎదురయినవి. ఇంట్లో ఏలాంటి సందడిలేదు. నిశ్శబ్దంగా ఒక విధమైన భయంకర వాతావరణం నెలకొని ఉంది. ఎందుకో మనసు కీడును శంకించింది. అయినా ధైర్యం కూడగట్టుకున్నాను. అప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి. హాల్లోకి అడుగు పెట్టాను. గెస్ట్స్ లేకపోతేపోని కనీసం పనివాళ్ళ అలికిడయినాలేదు.

"బాస్ మీ భార్యా పిల్లలు ఎక్కడ" అని అనుమానం వెలువరచక ధైర్యం నటిస్తూ అడిగాను.

"అతిదుల్లందరిని ఇన్‌వయిట్ చేయలేదు. అందువల్ల సందడిలేదు. పైన వుంటారు పద" అని ముందుకు పోసాగాడు.

ముందుకు పోవాలా, వెనక్కు తిరిగి పోవాలా ఆలోచిస్తూ, అనాలోచితంగానే ముందుకు అడుగేశాను. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ చివరకు పై భాగాన్ని చేరుకున్నాను. నా వెనుకే నాలుగు కుక్కలు నాలుగు నల్ల పిశాచాల్లా నాలుకలు తెరుచుకుని చూస్తున్నాయి. ఒక్కసారి ఆ హాలంతా కలయచూశాను. చటుక్కున నా వెనుకన తలుపులు మూసుకున్న చప్పుడు. తాళం తిప్పుతున్న చప్పుడు. వెనుకకు తిరిగి చూశాను. వాడు అదే మా బాస్ పళ్ళు ఇకిలించి నిలబడి వున్నాడు.

"బాస్! మీ భార్యా పిల్లలు ఎక్కడ?" భయంగానే అడిగాను.

"భార్యా! పిల్లవాడు, నా భార్య ఇక్కడుంటే నిన్నెందుకు ఇంత తెలివిగా పిల్చుకుని వస్తాను," పకపక నవ్వుతున్నాడు. ఒక్క క్షణం వాడిని చూస్తుంటే టైగర్ బామ్ గార్డన్స్‌లో మనం చూశామే. చిన్న సైజు పర్వతంలాంటి పొట్ట, నున్నటి గుండు, పళ్ళు ఇకిలించి కూర్చునివున్న చీనబొమ్మ అలా ఉన్నాడని పించింది. ఎద్దులా నామీద దూకాడు.

"సూజీ మర్యాదగా ఒప్పుకో! నా చేతిలో చిక్కుకున్న ఆడది తప్పించుకున్న చరిత్రే లేదు. అందులో నీవేమీ తీసిపోవు. నీ అంత నీవు ఒప్పుకున్నావో, కొంచం తేలికగానే కోరిక పూర్తవుతుంది, అలా కాకుంటే నిన్ను చిత్రహింసలు పెట్టి అనుభవిస్తాను. జాగ్రత్త. ఇక్కడనుండి నీవు ఏ విధంగానూ తప్పించుకో లేవు. వెనుకల చూడు, ఆ నాలుగు కుక్కలు నిన్ను ఏ భాగానికాభాగం చేస్తాయి. ఆ కుక్కలకు కనికరమేలేదు."

అడుగడుగు దగ్గరకి వేస్తున్నాడు. ఆ క్షణంలో నాకు గుర్తుకు వచ్చిన వాడు భరత్. నన్ను తను స్వీకరించి వుంటే ఈ క్షణం ఈ భయంకర పిశాచం ఎదురుగా నిలబడి వుండేదాన్నా, ఆ రోజే ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి ఉండే దాన్ని. ఇలా ఈ వెధవ ఇంటికి వచ్చివుండే దాన్నికాదు.

భరత్! నన్ను సర్వనాశనం చేశావు. నా కడుపుమంట తగలకపోతుందా! నా కథ ఈ రోజుతో ముగిసిపోతున్నది. భగవంతుడు కూడా నన్ను ఈ క్షణం కాపాడలేడు,

"ఏమంటావు?" అప్పుడే జూ నుండి తప్పించుకుని వచ్చిన బాబూన్‌లా ఉన్నాడు. పాములా వాడు నామీద పాకుతుంటే కళ్ళు మూసుకున్నాను. ఆ తరువాత ఏముంది, నాలో ఉన్నది పోగొట్టుకుని పిచ్చిదానిలా వాడి వైపు చూశాను. నాముందు కొంత డబ్బువున్న కట్ట. "ఇదిగో ఇది తీసుకుని వెళ్లు, ఇలా జరిగిందని, పోలీస్ రిపోర్టుకాని, మరెవరికైనా చెప్పావో నీ బ్రతుకు ఆ రోజుతో ముగిసిందనుకో. నా బావమరిది పేరు మోసిన గాంగ్‌స్టర్. వాడి దగ్గర నీ గురించి ఒక్కమాట చెప్పానంటే, చాలు నీ శవం నడిరోడ్డులో పడి వుంటుంది. అలా కాకుండా అప్పుడప్పుడు నా కోరిక తీరుస్తున్నావంటే, కారు, బంగళా అన్ని



ఇస్తాను, వెళ్లు. నేను చెప్పినదంతా గుర్తుంచుకుంటావనుకొంటాను.

నేను నడిచానో, లేక గాలిలో తేలి వచ్చానో నాకే తెలియదు. ఏ విధంగా ఇల్లు చేరానో నాకే అర్థం కాలేదు. నేను చేసిన మరొక పొరబాటు నా తల్లిదండ్రుల దగ్గర చెప్పక పోవడం. కాని నాలో మెల్లగా కసి రాజుకుంటోంది పగ. పోలీసు రిపోర్టు ఇవ్వవచ్చు. వాడికి ఏ రెండుమూడు సంవత్సరాలో జైలు శిక్ష పడుతుంది. తిరిగి యధా ప్రకారం వాడి అక్రమ కార్యాలు సాగుతూనే వుంటాయి. నాకు కావలసింది వాడికి జైలు శిక్షకాదు. వాడు నన్ను ఏవిధంగా భయంచూపి నాశనం చేశాడో అలాగే వాడు అణువణువునా భయంతో క్రుంగి కృశించి చావడం. దానికి చాలా నేర్పు. ఓర్పు అవసరం. వారం రోజులు వెర్రి దానిలా ఆలోచించాను, చక్కని ప్లాన్ తయారు చేశాను. కాని అది నెరవేరాలంటే మరొక వ్యక్తి తోడు అవసరం. ఆ వ్యక్తి అందుబాటులో వున్నాడు. ఇన్ని రోజులు అతనిని నేనే దూరంగా ఉంచాను. అతను నాకోసం ఏమైనా చేయగలడు. అతనికి కావలసింది నేను. అంతే! ఒకసారి చెడ్డా, పదిసార్లు చెడినా, చెడినదాని క్రిందే లెక్క. నా వర్జినిటీ నన్ను వదిలిపోయింది. వారం తరువాత ఆఫీసుకు వచ్చాను. అతని పేరు "మైకల్ చువా!" మైకల్‌ను పిలిచాను. అతను పొంగిపోయాడు. సాయంత్రం నా కొరకు కాచుకు వుండమని ఇద్దరం ఏదైనా హోటల్‌కి పోదామని చెప్పాను. ఆఫీసు వదలగానే ఇద్దరం హోటల్ వైపు దారి తీశాం. ఎవరి అంతరాయం లేకుండా మూలగానున్న టేబిల్ బుక్ చేయించుకున్నాము.

"మైకల్!" అతని చేతిని నా చేతిలోకి తీసుకొని నొక్కాను. అతనికి మొదటినుండి నా ప్రవర్తన అయోమయంగా ఉంది. అతను ఆనందంగా నా చేతిని మరొక చేతిలో మూసి సూజీ! నీవు నీవేనా!" ఆశ్చర్యంగా అన్నాడు. "ఇప్పటి సూజి వేరు మైకల్. నీవల్ల నాకొక సహాయం కావాలి. అందుకు ప్రతిఫలంగా నన్ను నేను ఇచ్చుకుంటున్నాను. కాని నేను కోరేకోర్కె చాలా రహస్యంగా వుండాలి, అది ఏ విధంగా బయటపడినా మనిద్దరం జైలు ఊచల వెనుక వుండవలసి వస్తుంది. బాగా ఆలోచించుకో! నేను నీకు కావాలనుకుంటే నేను కోరిన సహాయం చేయి." అతను మనస్పూర్తిగా ఒప్పుకున్నాడు, నా ప్లాన్ వివరించాను. నేను ఏ విధంగా సర్వనాశనమయింది రహస్యంలేకుండా చెప్పాను. నాకు కావలసింది పగ తీర్చుకోవడం. అందుకు అతను ఒప్పుకున్నాడు.

రెండు రోజుల తరువాత మైకల్ మా బాస్ బావమరిది గురించి వివరాలు తెలుసుకుని వచ్చాడు. వాడి పేరు లీలూచిన్. సాధారణమైన గాంగ్‌స్టర్ కాదు! బ్లాక్ క్యాట్ గ్యాంగ్ లీడరు. అంతేకాదు అండర్ గ్రౌండ్ మెంబర్ కూడా! వాడు పోలీస్ లిస్టులో మొదటి వాడు. ఒక తమాషా ఏమిటంటే మా బాస్ నన్ను బెదిరించినట్లుగా అది నిజంకాదు. మా బాస్‌కు బావమరిది అంటే టెర్రర్. వాడు

వస్తున్నాడంటే, డబ్బు రెడీగా పెట్టుకుని వీడు కాచుకుని వుండాల్సిందే! ఏ టయిమ్‌లోనయినా, ఎక్కడయినా, వీడిని కలుసుకుని వాడి పని సాధించుకుని పోతాడు. అంత దుర్మార్గుడయినా వాడికీ అక్క అంటే ప్రాణం, ఆ అక్క కొరకు ఏదైనా చేస్తాడు. నాకు కావలసిన అద్భుతమైన క్లూ దొరికింది. మరొక వారం రోజుల తరువాత అమాయకురాలిలా కొంచం మాట్లాడాలంటు మా బాస్ ఎదుట నిలిచాను. వాడి మొహం వెయ్యి నియన్‌లైట్ల వెలుగులా వెలిగింది. నేను వాడిని తీసుకొని, హోటల్ వైపు కాదు, జపనీస్ గార్డన్స్ వైపు తీసుకెళ్ళాను.

రకరకాల పూలతోటలు,, అందమైన సరస్సు, ఇంద్ర ధనస్సులాంటి వారధి, ప్రతి క్యామెరాకి పని కల్పించే అందమైన గార్డన్స్ అవి. చీకట్లు ముసురుకుంటుంటే వచ్చిన విజిటర్లంతా వెళ్ళిపోతున్నారు. నిర్మానుష్యంగానున్న చోటు చూసుకుని! పొదలు చాటుగా చేసుకుని ఇద్దరం కూర్చున్నాం. వాడి అవసరం ఆపుకోలేక పోతున్నాడు. సాధ్యమయినంతవరకు నేను అర్ధ నగ్నంగా తయారయ్యాను. వాడి పరిస్థితి అలాగే ఉంది. ఫ్లాష్ తటుక్కున నాలుగయిదు సార్లు మెరిసింది. అన్ని రకాల పోజులు వాడితో కలిపి ఇచ్చాను. వాడికి అనుమానం వచ్చినట్లుంది. ఫ్లాష్ వెలుతురులా లేదూ అన్నాడు ఉలిక్కిపడి. ఎక్కడో టూరిస్టులు ఏవో ఫోటోలు తీసుకుంటున్నారులే అని త్రోసి పుచ్చాను. మరుసటి రోజు నా చేతిలో ఐదువేల డాలర్లు పెట్టాడు. ఈసారి డబ్బు వద్దనలేదు. మరొక నాలుగు రోజుల తరువాత లంచ్ అవర్లో ఇద్దరం వాడి గదిలోనే మాట్లాడుతున్నప్పుడు, ప్యూన్ అందించిన టపా విప్పాడు.

"పర్సనల్" అన్న కవర్ అందుకని నా ఎదుటే తెరిచాడు. నేను ఊపిరి ఉగ్గబట్టి చూస్తున్నాను వాడిలో కలిగే మార్పులు తలుచుకుంటు. కవరు తెరిచి లోపలున్న రెండు ఫోటోలు, ఒక చిన్న స్లిప్ బయటకు తీశాడు. స్లిప్‌మీద టైప్ చేయబడిన అక్షరాలు వాడితోపాటే నేను చదివాను. ఈ రెండు ఫోటోలేకాదు, మరికొన్ని పోజులలో మరో నాలుగు నా దగ్గరున్నాయి. యాభై వేల డాలర్లు పెట్టి కవరును రేపు రాత్రి ఎనిమిది గంటలకు మీ ఇంటి బయటనున్న డస్ట్‌బిన్‌లో వేయి. అలా చేయకుండా పోలీస్ రిపోర్టు ఇచ్చావంటే ఈ ఫోటోలు ప్రతి ఒక పేపరుకు పోతుంది. అంతేకాదు నీ బావమరది చేతులలోకి చేరేటట్లు చేస్తాను. ఆ తరువాత ఆ కసాయివాడి చేతులలో నీ పని ఖాళీ, జాగ్రత్త.

అంతే! అది చదవగానే కుర్చీలో మైకంలో పడిపోయాడు. శరీరమంతా చెమటలో తడిసిపోయింది. నా మొహం సంతోషంతో దిగ్విజయంగా వెలిగింది నీళ్ళు తెచ్చి మొహాన చల్లాను. వాడు కళ్ళు తెరవగానే కల్లబొల్లి ఏడ్పులు ఏడ్చాను. వాడు పరువుకుకాదు ముఖ్యంగా ఏడ్చేది వాడి బావ మరిదికి, వాడు తన అక్కకు జరిగే అన్యాయం ఏమాత్రం సహించడు. మరుసటి రోజు డస్ట్‌బిన్‌లో యాభై వేలు క్రొత్త నోట్లకట్లతో కవరు దొరికింది. మైకల్ సగం, నేను సగం తీసుకున్నాము. ఈ విధంగా రెండు నెలల్లో పదిసార్లు చేశాము. ఆ తరువాత అడుగడుగునా ఫోన్ కాల్సు, మైకల్ ఎవరి ద్వారానో చేయించేవాడు. వాడికి డబ్బు మటుకేకాదు, మనశ్శాంతి కరువయేటట్లు చేశాం. ఇంటికి ఆఫీసుకు ఒకే విధమైన ఫోన్ కాల్సు. ఆఫీసులో ఎవరిని చూసినా ఉలిక్కిపడేవాడు. నన్ను చూస్తే త్రాచుపామును చూసి జడుసుకునేట్లు వణికి పోయేవాడు. ఆ తరువాత నా సాన్నిహిత్యం అంటేనే బెదిరిపోయేవాడు. ఒకనాడు సడన్‌గా వాడి బావమరిది వాడి ఆఫీసు గదిలోకి వచ్చాడు. నేను మైకల్‌కు సైగ చేశాను. మైకల్ చాలా తెలివిగా గొంతు మార్చి ఫోన్ చేశాడు. అతని ఫోన్ వచ్చే సమయంలో నేను ఫైల్ తీసుకుని, పని ఉన్నట్లుగా వాడి గదిలోకి దూరాను. బావమరిది ఎదురుగా నిలబడి ఉన్నాడు. వాడి మునికాళ్ళమీద నిలబడినట్లు అసహనంగా ఉన్నాడు. మొదటే బావమరిదిని చూసి వణికిపోతున్నాడు. నేను అక్కడికి రావడం, ఫోన్‌లో మైకల్ చేసే బ్లాక్‌మైల్.

ఒకసారి చమటలు క్రక్కుతున్న మొహంలో నన్ను, వాడి బావమరిదిని మార్చి మార్చి చూసి, "ఆ" అని గుండె పట్టుకున్నాడు. ఫినిష్! వాడి కథ పూర్తయింది. తెరుచుకున్న నోరుతెరుచుకునే ఉండిపోయింది. కళ్ళు తేలిపోయాయి. చలనరహితంగా వుండిపోయింది శరీరం. నా కసి తీరిపోయింది. వాడి బావమరిది పారిపోగానే విరగబడి నవ్వాను. మరుసటిరోజు వాడికి అంత్యక్రియలు జరుగుతుంటే ఆఫీస్ స్టాఫ్‌కంతా నా బర్త్‌డే అని గ్రాండ్‌గా పార్టీ ఇచ్చాను." పకపక నవ్వింది.

అంజు భయంగా, వింతగా, కళ్ళు పెద్దవిచేసి సూజివైపు చూస్తూండిపోయింది. తనకు నోట్లో కూడా మాట రావడం లేదు. తను ఒక క్రొత్త సూజిని చూస్తున్నది. తన సూజియేనా!

చటుక్కున సూజి నవ్వు ఆపింది. కళ్ళనిండా నీళ్ళు చిప్పిల్లాయి, "అంజూ! నా పగ తీరిపోయింది. కాని ఆ తరువాతనే నా అసలు కథ మొదలయింది.

నా కార్యం సాధించేంతవరకు భరత్‌ను కలుసుకోవడంగాని, చూడడంగాని జరగలేదు. ఒకవిధంగా చెప్పాలంటే నా లక్ష్యసాధనలో అతని ఉనికినే మరచిపోయాను. కాని ఒకరోజు.... ఆరోజు ఆదివారం. నా తల్లిదండ్రులు ఇంట్లోనే వున్నారు. మధ్యాహ్నవేళ. బాత్‌రూమ్‌లోకి వెళ్ళిన నేను కాలుజారి పడిపోయాను. దానితో మైకం క్రమ్మింది. కళ్ళు తెరిచేటప్పటికి ఎదురుగా నా తల్లిదండ్రులతోపాటు స్టెతస్కోప్‌తోపాటు భరత్ నిలబడి వున్నాడు. అతని చూపు.... ఆ చూపు.... అంజూ! ఈ జన్మలోనే కాదు ఎన్ని జన్మలయినా గుర్తుండే చూపు. అతనికి నామీద ఉండే ఏవగింపు అంతా ఆ ఒక చూపులోనే దాగుంది. నీరుగారిపోయాను. అతను మొహం అసహ్యంగా తిప్పుకుంటు నన్ను

మరొకసారి చూస్తేనే పులికిపడుతున్నట్లుగా అక్కడినుండి వెళ్ళిపోయాడు. మా అమ్మా నాన్న పిచ్చివాళ్ళే అయిపోయారు. నన్ను ఎదిగిన దాన్ననికాని, నా సంపాదనతో నేను బ్రతుకుతున్నాననిగాని కూడా తలచక కేవలం వాళ్ళింట్లో ఒక బానిసనన్నట్లు గొడ్డును బాదినట్లు బాదారు. దీనికంతా కారణం నేను గర్భవతి. ఆ రోజుతో నాకు వాళ్ళకు మధ్యనున్న అనుబంధం తీరిపోయింది.

అంజూ! మా చైనీస్‌లో ఆడ పిల్లలకన్న మగవాడి పుట్టుకనే ఎక్కువగా కోరుతారు. ఆ సంతోషాన్ని పంచుకోను కోడిగుడ్లకు ఎర్రని రంగులో ఉడకబెట్టి అందరికీ పంచుతారు. మగవాడు డబ్బు సంపాదించడంలోను, వ్యాపార విషయాలలోను, ఎంతో తెలివి తేటలు చూపుతారని, తమ చివరి రోజులవరకు తోడు నీడగా ఉంటారని, ఆడ పిల్లల వలన ఎలాంటి ఆదాయం వుండదని తక్కువ అభిమానమే చూపుతారు. స్పష్టంగా చెప్పాలంటే ఆడ పిల్లల పుట్టుకను విధిలేని పరిస్థితిలోనే స్వీకరిస్తారు. కాని నా విషయంలో నా తల్లి దండ్రులు అలాంటి భేదాభిప్రాయం చూపలేదు. ఇప్పటి నా పరిస్థితి వాళ్ళను పూర్తిగా మార్చేసింది. వాళ్ళు ప్రతి తల్లి దండ్రుల్లా కూతురు ఎలాంటి కళంకం లేకుండా వివాహం చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా వుండాలనే కోరుతున్నారు. వాళ్ళ కోర్కె మట్టిపాలయింది. నన్ను చూస్తూనే చీదరించుకునేవారు. ఆనాటినుండి నేనొక "పేయింగ్ గెస్ట్"గానే ఉండిపోయాను. వాళ్ళకు నాకు ఎలాంటి సంబంధ బాంధవ్యాలు లేవు. ఆ తరువాత అబార్షన్ చేయించుకున్నాను, కరాటే, జూడో నేర్చుకున్నాను. అదే ఆర్ట్సు మొదటే తెలుసుకునివుంటే ఆ మద పిశాచిని నా కాళ్ళ క్రిందే తొక్కి వుండేదాన్ని. అందువలననే ఆనాడు శంతోషా ఐలండ్స్‌లో చంద్రన్ నీమీద చేయివేస్తే సహించలేకపోయాను. ఒకేఒక దెబ్బతో క్రిందకు తోశాను. ఆ తరువాత నాకు నచ్చినవాడు అనీ కాదు, నన్ను కోరిన ప్రతి మగవాడిని నన్ను నేను కానుకగా ఇచ్చుకున్నాను. ఒక్కొక్కసారికి రెండువేలుపైనే కలెక్ట్ చేసేదాన్ని. నాకు మరొక వ్యక్తిమీద పగ. అది నీ భర్త. అతను చూస్తుండగానే రోజుకు ఒకడిని వెంటబెట్టుకుని తిరిగేదాన్ని. వాళ్ళలో మధు కూడా ఒక్కడు. మధు నన్ను కోరినపుడు కాదన్నాను. కాని ఆ తరువాతే నాకు నేనుగా అతనికి లొంగిపోయాను. భరత్ నన్ను అసహ్యించుకునేవాడు. మొహం తిప్పుకునేవాడు. నన్ను చూస్తూనే చీదరించుకునేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే హి హేట్ మి. అందుకే భరత్ నిన్ను నాతో కలిసి చూడడం సహించలేక పోయేవాడు. నేను నిన్ను నాలా ఎక్కడ మారుస్తాడనో అన్న భయం. తను పెండ్లి చేసుకోబోతున్నట్లు, యిండియాకు పోతున్నానని, తిరిగి వచ్చిన తరువాత పార్టీ అరేంజి చేస్తున్నానని మా ఫాదర్‌తో అంటుంటే కుమిలి కుమిలి ఏడ్చాను. మీ వెడ్డింగ్ కార్డు చూసిన రోజు పిచ్చిదాన్ని అయిపోయాను. అతను బాచిలర్‌గా ఉండడం అదొక తృప్తి. కాని ఇప్పుడు, ఆ తృప్తి కూడా లేకుండా పోయింది.



అతని మనస్సును దోచుకున్న ఆ అమ్మాయి ఎవరో! ఎవరైతే ఏం తానొక వర్జిన్ అయి వుంటుంది. ఎన్ని సార్లో తలచేదాన్ని. ఏ యాసిడో తీసుకునిపోయి అతని మొహంమీద చల్లి అతని రూపాన్ని వికృతంచేసి ఏ స్త్రీ అతనిని చూసినా దడుచుకుని, పారిపోయేటట్లు చేయాలని, కాని నాకు తెలుసు, నేను అలా చేసినా ఈ ప్రపంచంలో ఏ మూలకయినా వెళ్ళి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుని తిరిగి యథా రూపంలో తిరిగి వస్తాడని. యెలాగయితే ఏం అతనికి వివాహం అయింది. నేను మా బాస్‌మీద కసి తీర్చుకున్నట్లు ఇతనిమీద తీర్చుకోలేకపోయాను. ఎప్పటికీ అతనిదే పై చేయి. అతనిని నేను జయించలేను అని తెలిసిపోయింది. అతను తిరిగి వచ్చాడు. ప్రక్కన భార్యలేదు. ఎలాంటి పార్టి ఇవ్వలేదు. మా ఫాదర్ బ్రైడ్ ఎక్కడ అంటే చదువుకుంటున్నది. అది పూర్తయితే వస్తుందని, అప్పుడే పార్టి ఇచ్చేదని నవ్వుతూ చెప్పాడు. ఇప్పుడనుకుంటే నవ్వు నటిస్తూ చెప్పి ఉంటాడు అనిపిస్తున్నది. కాని అంజూ! అతను పెండ్లి జరిగిన తరువాతనుండి, స్నేహితులకు, పార్టీలకు దూరమయ్యాడు. ఏ సమయంలో వస్తాడో, ఎప్పుడు పోతాడో కూడా తెలియకుండా పోయింది. ఎప్పుడు చూసినా సీరియస్‌గా వుంటాడు. అతని భార్యవైన నిన్ను చూడకముందు ద్వేషించేదాన్ని, అసూయతో మండిపడేదాన్ని. కాని నిన్ను చూసిన తరువాత నీతో పరిచయం చేసుకున్న తరువాత నా ద్వేషం పూర్తిగా తుడుచుకుపోయింది. ఆ రాత్రి నీవు ఏడుస్తూ నన్ను కౌగలించుకుని అమ్మా అని పిలిచావే. అప్పుడే నీవు నాలా అభాగ్యురాలివని అనుకొన్నాను. కానీ అంజూ! మరుసటి రోజు నీవు నన్ను నమ్మి నీ గురించి పూర్తిగా చెప్పినప్పుడు నీమీద జాలేకాదు, భరత్‌మీద నాకున్న కసి తీరిందనుకొని, అతని ముందు నిలబడి విరగబడి నవ్వాలనిపించింది, నీవు నా స్నేహితురాలివికాకుంటే అతను సిగ్గుతో కుమిలేటట్లు చేయాలని, అతనిని అడుగడుగునా అవమానించాలని, మనస్సు వెర్రిగా గంతులేసేది. కానీ ఏమి చేయలేకపోయాను. కారణం నువ్వు. అమాయకంగా నన్నే నమ్మి, అయినవాళ్లు, అభిమానించేవాళ్ళు లేక ఒంటరిగా నాలానే జీవితాన్ని ఎదుర్కొంటున్నావని తలవగానే నా ప్రయత్నాలన్ని ఆపుకున్నా! నాకు ముఖ్యం నీ మనశ్శాంతి. అతనిమీద ఏదో పగతీర్చుకోవాలన్నట్లు తలుచుకుని నిన్ను నేను కూడా సుడిగుండంలోకి తొయ్యదలుచుకోలేదు. ఇప్పటికీ భరత్‌దే పై చేయి అయింది. ఎందువలనంటే మానసికంగా నీవు వర్జిన్‌వే. నేను ఒక విధంగా చెరచబడితే- నీవు మరొకరకంగా శీలం పోగొట్టుకున్నావు. అలాంటప్పుడు గెలుపు నాదెలా అవుతుంది. అంజూ! మనస్సు సమ్మతించక పోయినా ఒక మాట చెప్తున్నాను, భరత్ నిన్ను ప్రాణంలా ప్రేమిస్తున్నాడు. అతని అహం అందుకు ఒప్పుకోదు. దానికి ద్వేషపుపూత పూసి నిన్ను ద్వేషిస్తున్నాడు. ఆ రోజు నీవు మెట్లమీదనుండి పడిపోయినపుడు, మైకంలో వున్న నిన్ను అతను రెండు చేతులతో ఎత్తి గుండెలకు హత్తుకుని. నైట్ డ్రస్

మార్చాలన్న ఆలోచనయినాలేక, అంబులెన్స్ అటెండర్స్ స్ట్రెచ్చర్ క్రిందకు తెచ్చేంతవరకైనా ఓపిక పట్టక ఒక్క వుదుటన అందులోకి ఎక్కి కూర్చుని వెళ్ళాడే, ఆ దృశ్యం నా జన్మలో మరవలేను. మధు అయినా అంతే! నిన్ను నాకు పరిచయంచేస్తే నీవు నాతో స్నేహం ఎక్కడ చేస్తావో అని తెలియనట్లుగానే వుండిపోయాడు. అతనికి నా దేహం ముఖ్యమయింది కాని, నా మనస్సును అర్థం చేసుకుని ఆదరించే మనస్సు లేకపోయింది. తన వదిన నాలాంటి స్త్రీ అని తెలిసి కూడా నీకిచ్చిన గౌరవం నాకు ఇవ్వలేకపోయాడు. మగవాళ్ళను అర్థం చేసుకున్నావా అంజూ! ఐట్ ఐ డోన్ట్ కేర్ ఇట్. ఐ డోన్ట్ కేర్ ఎనీ బడీ! ఐ వాంట్ యూ ఓన్లీ!"

అంజు సూజీ చేయి పట్టుకుని కళ్ళనీళ్ళు కారుస్తూ ఉండిపోయింది. కాలగమనాన్ని ఇద్దరూ గుర్తించలేదు. సాయంత్రం కావడం భరత్ రావడం, ఇద్దరు గమనించలేదు. దగ్గరిగా వచ్చిన అతనిని చూడగానే అంజు, సూజీతో చెప్పి అతని వెనుకే లోపలికి వెళ్ళింది.

సూజీ కథ విన్నప్పటినుండి అంజు మనస్సు బాధతో కకావికలు చేస్తున్నది. మరీ సున్నితమైన తన మనస్సును తనే కసురుకుంది! కాని ఎన్ని విధాలా తనుతానే ఓదార్చుకున్నా సూజి చెప్పిన కథ కళ్ళముందు రకరకాల దృశ్యాలలో ఎదురవుతున్నది. పురుషులంతా ఇంతే, దుర్మార్గులు, శారీరకంగా బలహీనంగా ఉండే స్త్రీలను మానసికంగాను బలహీనులనుచేసి ఆటలాడుకుంటున్నారు. కిరాతకులు, సూజి బాసేకాదు. తన భర్తలాంటివారు ఎంతోమంది మగవాళ్ళు కూడా! ఆలోచనలతో ఎక్కడా ఉండలేక పోతున్నది. టి.వి. ముందర కూర్చుంది. విసుగేసింది. పుస్తకం చేతికెత్తింది. ఏకాగ్రత కుదరలేదు. పడక మీద వాలి కళ్ళు మూసుకుంది.

కళ్ళు మూసుకున్న అంజుకు ఎదురుగా వికృతంగా నవ్వుతున్న ఆ చీనా మృగం, నాలుకలు చాచుకుని నల్లగా నిగనిగలాడుతూన్న శరీరంలో పొట్టిగానున్న తోకలను కదిలించడానికి ప్రయత్నిస్తూ, ఆకలిగా, ఆతృతగా చూస్తున్న జర్మన్ కుక్కలు, బేలగా, అసహాయంగా, తనను కాపాడేవాడే లేనట్లు నిరాశతో చూస్తున్న సూజి ఎదురవుతున్నారు. సూజి స్థలంలో తను ఉంటే, మరుక్షణం మరొక దృశ్యం. దట్టంగానున్న అడవిమధ్య చిమ్మచీకటిలో, రాళ్ళగుట్టలు, పొదలమధ్య స్మారకంలో లేని స్థితిలో పడున్న తను, తనకు దగ్గరగా, తెల్లగా మెరుస్తున్న కళ్ళుతప్ప, మరొక పోలికే తెలియని ఆకారం, తనను అల్లుకుపోతూ.... కెవ్వున కేకవేసింది అంజు. భయంతో, చమటలు కక్కుతూ, గజగజలాడుతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమే అసాధ్యమయిపోయింది తనకు.

"వదినా! వదినా!" మధు మంచం ప్రక్కగానున్న టేబుల్‌లైట్ స్విచ్ ఆన్‌చేసి, అంజును కదిలించసాగాడు.



ఒక్కసారిగా వెలుతురుకు కళ్ళు చిట్లించి మధువైపు చూసిలేచి చటుక్కున నిలబడింది. "మధూ! ఏడుస్తూ అతని దగ్గరగా వచ్చింది. క్షణం తటపటాయించి అతను అంజు వీపుచుట్టు చేతులువేసి దగ్గరకు తీసుకున్నాడు.

"భయంగా వుంది మధూ!"

"భయమా! ఇప్పుడు గంట ఎంతయిందో తెలుసా! తొమ్మిది. మనం ఇంకా భోజనమైనా చేయలేదు. మీరు లైట్ ఆన్ చేసుకోకుండా నిద్రపోయి పీడకలలు కంటున్నారా!" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"ఊహూ! నిద్రపోలేదు."

"వాట్! నిద్రపోకుండానే కలలు కంటున్నారా! ఇంతకీ ఆ కల ఏమిటి చెప్పండి. మరీ విపరీతంగా చెమటలు కారుతున్నాయి." అంజును పట్టుకునే ప్రక్కన వున్న తెల్లటి టవల్ అందుకొని అంజు మొహం తుడవసాగాడు.

"అది.... అది... "

"మధూ! తనను తీసుకోని డైనింగ్ హాలుకురా!" భరత్ గొంతు గంభీరంగా పలికింది. అప్పుడుకాని ఇద్దరూ తలుపుకు దగ్గరగా నిలుచుని వున్న భరత్‌ను గుర్తించలేదు. అప్పటి తన స్థితి గుర్తుకు వచ్చి చటుక్కున మధు చేతుల నుండి విడిపించుకుని దూరంగా జరిగింది.

"భోంచేస్తాంరా వదినా మధు అనురాగమంతా మాటలలో చూపుతూ పిలిచాడు.

"ఊహూ! నా కాకలిలేదు. నీవు వెళ్ళి భోజనం చేయి" మెల్లిగా అంది.

"మీరు అలా అంటే నేను ఏమి తినను. అన్నయ్య నేను టేబల్‌మీద ప్లేటు సర్దుతుంటే మీ కేక వినిపించింది. అన్నయ్య వెయిట్‌చేసుంటారు రండి." అంజు మరేం జవాబు చెప్పక అతనిని వెంబడించింది. మధుకు ప్రక్క కుర్చీలో కూర్చున్న అంజు ఒక్కసారయినా తలెత్తి భరత్‌వైపు చూడలేదు. తన ప్లేటులో కూరలు వడ్డిస్తున్న అతనివైపు చాలు అని చెప్పడం కూడా చేతకానట్లు మౌనంగా వుండిపోయింది.

మధు అంజుచేత ఏదైనా మాట్లాడించాలని ఎంతగానో ప్రయత్నంచేసి చూశాడు. కాని అంజు మూగదే అయింది. బలవంతంగా కొద్దిగా తిని ప్లేట్ తీసేసి హాల్లోకి వచ్చింది. మరికొన్ని నిమిషాలకు హాల్లోకి ప్రవేశించిన మధు అంజుకు ప్రక్కగానున్న సోఫాలో కూర్చుంటూ అంజు చేతికి కోసిన ఆపిల్, ఆరంజ్ ముక్కలు వున్న ప్లేటు అందిస్తూ కబుర్లలోకి దిగాడు. అతను ఎలాగైనా అంజు భయం పారద్రోలి మామూలు మనిషిని చేయాలన్న ఆలోచనలో, తన యూనివర్శిటీ కబుర్లు చెప్తున్నాడు. అంజు వింటున్నట్లు నటిస్తుందేగాని, మనస్సుమటుకు సూజీకి జరిగిన అన్యాయాన్నే ఆలోచిస్తున్నది.

ఇంతలో ఫోన్ రింగవడం, ఫోన్ అందుకుని మాట్లాడుతున్న మధు వెంటనే తన గదిలోకి పోయి డ్రస్ మార్చుకుని వచ్చి "వదినా మా స్నేహితుడికి ఆక్సిడంటయి హాస్పిటల్లో ఉన్నాడట. నన్ను రమ్మని దగ్గర మరెవ్వరూ లేరని మరొక స్నేహితుడు ఫోన్ చేస్తున్నాడు. నేను త్వరగా వచ్చేస్తాగా! మీరు ఏ భయాలూ పెట్టుకోకుండా హాయిగా నిద్రపోండి." అంటూ భరత్‌తో చెప్పి వెళ్ళిపోయాడు.

తనకు ఒంటరితనం కావాలన్నట్లు అంజు గదిలోకి వచ్చేసింది. కాని ఆ ఒంటరితనమే తనను భయంకరంగా వేటాడుతూ పలురకాల ఆలోచనలతో వెర్రి దాన్ని చేస్తున్నది. అంజుకు తను ప్రశాంతంగా, ఏ ఆలోచనలు లేకుండా నిద్ర పోవాలంటే తనకు కావలసింది ఒకే ఒక మందు.... అది తనలో చేరకపోతే ఈ వెర్రి ఆలోచనలతో తల వగులగొట్టుకుని చావను కూడా సంశయించదు. కాని అది సూజిదగ్గర వుంది. ఏ విధంగానైనా సూజిని పిలిచి అది తీసుకోవాల్సిందే. ఇక ఆలస్యం జరగడం తనవల్ల కాదన్నట్లుగా గది తలుపు తెరుచుకుని హాల్లోకి వచ్చింది. హాల్లోకి వచ్చిన అంజుకు అడుగు ముందుకు పడలేదు. అక్కడ భరత్ సోఫాలో కూర్చుని టేబిల్‌లైటు క్రింద బుక్కు చదువుతున్నాడు. వెనకకు తిరిగి వచ్చింది.

"హుఁ! పుస్తకం చదవాలంటే తన రూమ్ లేదూ! లోపలికి వెళ్ళి చదువుకోక హాల్లో పనేమిటి?" విసుక్కుంది. అంజుకు నిద్ర రావడంలేదు. మందుకొరకు శరీరం పెట్టే యాతన భరించడం తన శక్యం కావడం లేదు. మరొక గంట తరువాత తిరిగి తలువు తెరిచింది. హాల్లోకి ప్రవేశించిన అంజుకు భరత్ పుస్తకంలో నుండి తలెత్తి చూసి తిరిగి అందులో లీనమవడం చూసి ఏంచేయను అర్థంకావడం లేదు. తన పరిస్థితి బోనులో చిక్కుకున్న సింహంలా వుంది. అడుగు ముందుకు వేయాలంటే ధైర్యం చాలడంలేదు. గదిలోను నిలువలేకపోతుంది. తిరిగి వెనుకకు వచ్చింది. ఇంకొద్ది సమయం ఇలా ఉంటే తనకు పిచ్చిపట్టేది సత్యం. ప్రతిరోజు పదిగంటలకల్లా గదిలో దూరి తలుపులు మూసుకునే ఇతను ఇలా గార్డులా తనను కావలా కాయడం ఎందుకో? తనన్న అసహ్యమయినపుడు తన మానాన తనను వదిలి వేయకూడదూ! ఇప్పుడు తనకు ఒక ఖైదీకి తేడా లేకుండా పోయింది. ఇది ఒక లక్ష్యూరియస్‌గానున్న పొలటీషియన్ జైలులా ఉంది. టైమ్ పన్నెండు కావొస్తున్నది. మధు జాడలేదు. భరత్ నిద్రపోయి వుంటాడు. ధైర్యంగా తలుపు తెరుచుకుని హాల్లోకి వచ్చి భరత్ వైపు చూసింది. అతను సోఫాలో మొహాన పుస్తకం మూసుకుని నిద్రపోతున్నాడు. అమ్మయ్య అనుకుంటు తలుపు దగ్గరగా వచ్చి పిడిమీద చేయి వేసింది. తలుపు తెరుచుకోలేదు. ఏమయి వుంటుందా అని ఆలోచిస్తుండగా "అది లాక్‌చేసి వుంది" అన్న గంభీరమైన గొంతు వినగనే ఎగిరి పడింది అంజు.



అతను మేలుకునే ఉన్నాడు. అతని మొహానవున్న పుస్తకం చూసి అతను నిద్రపోతున్నాడని అపోహపడింది.

"గో ఇన్‌సైడ్," తిరిగి అన్నాడు.

అంజు కదలలేదు, ఎలాగైనా తను సూజిని కలువాల్సిందే.

"ఐ సె గో ఇన్‌సైడ్," సోఫాలోనుండి లేస్తూ అన్నాడు. అంజు నిర్లక్ష్యంగా నిలబడింది, తన చేయి డోర్‌నాబ్ మీదనుండి కదలలేదు.

"చెప్పేది నీకు కాదూ! ఒక్కసారి ఫూల్ చేసినట్లు తిరిగి చేయాలనే! మర్యాదగా లోపలికెళ్ళు" దగ్గరగా వస్తూ అన్నాడు.

అంజుకు ఎక్కడలేని ధైర్యం ఒక్కసారిగా పొంగింది. "నేను లోపలికి పోదలుచుకోలేదు, తాళం తీయండి. నేను....నేను వెళ్ళిపోతాను. భయం ఒక వైపు, త్వరగా పోవాలన్న తొందర మరొక వైపుతో వణికిపోతోంది.

"అది జరగని పని. నీ వాడిందే ఆటనుకొన్నావా! లోపలికి పోతావా లేదా.!"

"వెళ్ళను, వెళ్ళను. మీరేం చెప్పినా వినను. తలుపు తీయండి, తలుపు తీయండి" తలుపును పిడికెళ్ళతో గుద్ద సాగింది.

"యూ క్రేజీ లిటిల్ ఫూల్! అంత ధైర్యమే!" అతను రెండు చేతులతో బలంగా అంజును చుట్టి తన గదివైపు సగం లాక్కు వచ్చినట్లుగా, మరి సగం ఎత్తుకు వచ్చినట్లుగా తీసుకుపోసాగాడు.

"వదులు, వదులు, నేను వెళ్ళిపోతాను. తిరిగి రాను, ఈ జైల్లో అడుగు పెట్టను. ఆ గదిలోకి నన్ను తీసుకుని పోకు," అరుస్తూ, ఏడుస్తూ, అతనిని కాళ్ళతోను, చేతులతోను తోస్తోంది. కాని భరత్ పట్టు ఉడుం పట్టులా వుంది. అంజు ఎంతగా పోరాడినా, గింజుకున్నా అతనిదే పై చేయి అయింది. అతని బలమైన చేతులనుండి శరీరంలోని చిన్న అణువైనా విడిపించుకోలేక పోయింది. అతను తన గదిలోకి రాగానే ఎడమ కాలితో తలుపును తన్ని అంజును పడకపై వేసి రాక్ వైపు తిరిగాడు. అంజు భయంగా కళ్ళు పెద్దవి చేసి అతనివైపు చూస్తూండి పోయింది. భరత్ సిరంజీలోనికి మందు ఎక్కించి అంజు చేతికి ఇంజక్ట్ చేశాడు. క్రమేణా ముందున్న ఆరాటం తగ్గి ప్రశాంతంగా అతని వైపు చూస్తూండి పోయింది. మరి కొద్ది సేపటికి తనకు తెలియకుండానే కళ్ళు మూసింది.

"అరే! అదేమిటి? అంత త్వరగా వచ్చావు పని ఎగ్గొట్టావా! లేక ఆరోగ్యం సరిలేదా!" మధును ఆశ్చర్యంగా చూస్తూ అంది. శనివారం తప్ప మిగత రోజులలో ఐదు గంటలపైన ఇల్లు చేరే మధు మూడు గంటలకే రావడం ఆశ్చర్యంగా వుంది.

"అదేం లేదు వదినా! రాత్రికి స్నేహితుడొకడు హోటల్లో వెడ్డింగ్ పార్టీకి

ఆహ్వానించి ఉన్నాడు. చాలా ఆలస్యమవుతుంది' కొద్ది సేపు రెస్ట్ తీసుకుని సాయంత్రం వెళ్ళేటప్పటికి ఫ్రెష్‌గా వుంటుందని వచ్చేశాను. డాడి గొణుగుతూనే ఉండి పోయారు. తిరిగి మళ్ళీ చూడకుండా పారిపోయి వచ్చాను," చిరునవ్వు నవ్వాడు.

"అబ్బ! పనిదొంగ, నీవు లెక్చరర్‌గా వచ్చావంటే మొదటి రోజు స్టూడెంట్సుకు ఫేవరెట్ మాస్టరు అవుతావు. అయినా ఫస్ట్‌క్లాస్‌లో ఎలా పాసవుతున్నావో కాని- పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులో ఫేవరిజం ఉందట. ఏదో లంచం పెట్టి క్లాస్ కొట్టేసి ఉంటావు" అంజు కిలకిల నవ్వింది.

"పొండి వదినా! సింగపూర్లోనే బి.యస్సీ చదివాను. ఇక్కడ క్లాస్‌లోనే పాసయ్యాను. చదువు వేరే! యంటర్‌టైయిన్‌మెంట్సు వేరే! చదువుకునేటప్పుడు చదివే పాఠంమీద కాన్‌సన్‌ట్రేషన్ ఉంటే చాలు. ఒక గంట చదివినా సరిపోదూ! ఇంతకీ వదినగారి చదువు గురించి చెప్పలేదు."

"నేను నీ అంత జీనియస్‌ను కాదులే. ఏదో చదువుకుపోయే రకం."

"ఎప్పుడు మా యూనివర్శిటీ కబుర్లు చెప్పమంటారే కాని మీ కాలేజీ కబుర్లు చెప్పనే చెప్పరు. అంతేకాదు మీ యక్స్‌కర్షన్ గురించి కూడా చెప్పండి. ఏయే ఊర్లు తిరిగారు."

మధు ఏదో తెలుసుకోవాలన్నట్లుగా అడుగుతుంటే అంజు మొహం వెలవెల బోయింది. ఏదైతే మరచిపోవాలని ప్రయత్నిస్తున్నదో అదే ఈనాడు మధు తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అతనిని ఎందుకు కాదనాలి. అసలు ఏంజరిగిందని తనకుమటుకు తెలుసునా! ఇలా జరిగి వుంటుంది అని తల్లిదండ్రులతోటి తను ఒక అభిప్రాయానికి రావడమే కాని.

భరత్‌తో గొడవచేసిన నాటికి ఇప్పటికి అంజులో చాలా మార్పే కలిగింది. ఇప్పుడు డ్రగ్స్ కావాలని కోరడం లేదు. ఆలస్యంగానయినా తను ఆ ఊబిలో నుండి తప్పుకుంది కారణం భరత్. అతను రాత్రంతా అంజును కనిపెట్టుకుని ఉండడమే ముఖ్యమైన ధ్యేయంగా తన నిద్ర చంపుకుని, కావలి కాసేవాడు. అంజుకే అతని పరిస్థితి జాలి కలిగించేది. తన ప్రతి కదలికకు అతను లేచి కూర్చునేవాడు. తన దినసరి నడవడికల నుండి, తన ఆహార విషయాలలో కూడా తగు జాగరూకత వహించేవాడు. తల్లి తన పురుటిలో ఉన్న కూతురును చూసుకొన్నట్లుగా అతి శ్రద్ధతో అంజును మునుపటిలా పూర్తి ఆరోగ్యంతో కళకళలాడేట్లు చేశాడు. అంజు గట్టిగా నిశ్చయించుకుంది. ఇకమీద భరత్‌ను ఏవిధంగాను బాధపెట్టకూడదని. నాటికి జరిగిపోయిన సంఘటనల గురించి తను ఆలోచించి, తన మనసు, శరీరం సర్వనాశనం చేసుకొని సాధించేది ఏదీలేదని గట్టిగా నిర్ణయించుకుంది. అదంతా విధి. విధి చేతులలో బొమ్మలు కామిద్దరు. కామిద్దరులాంటివాళ్ళు మరెందరున్నారో ఈ ప్రపంచంలో. జరిగిపోయిన సంఘట



నలు గురించి ఆలోచించి మనస్సు పాడుచేసుకోవడం అనవసరం. క్రమేణా అంజులో మునుపున్న వేదన తరిగి మనస్సు నిర్మలం కాసాగింది. మెదడులో ఆలోచనలు కొరవడడంతో శరీరంలోకి ఉత్సాహం చోటుచేసుకోసాగింది. ఆ ఉత్సాహంవలననే మొహంలోకి జీవకళ చేరుకోవడం, టైమ్‌కు సరయిన ఆహారం భరత్ చూపే శ్రద్ధ. నిర్మలంగా ఉన్న మెదడు, అంజులో క్రొత్త అందాలు నింపుకోసాగాయి. కాని ఈ రోజు మధు పాత జ్ఞాపకాలను తిరుగతోడమంటున్నాడు. అది వివరించడంలో తను నష్టపోయేది ఏమీలేదు. మధు నమ్మినా నమ్మకపోయినా తను చెప్పేది నిజం. అది తన మనస్సుకు తెలుసు. మధు మంచి మనసున్నవాడు కాబట్టి అది నమ్మవచ్చు. కాని భరత్ నమ్మడు. తను వాళ్ళు నమ్మాలని జరిగింది చెప్పడం లేదు. తను ఎవరిని సాక్షిగా తీసుకుని రాగలదు? తను చేయని తప్పుకు ఘోరంగా నరకం అనుభవించింది. తన పందొమ్మిది సంవత్సరాల వయస్సుకు తొంభయిఒక్క సంవత్సరాల అనుభవాలు అనుభవించింది. ఇక తను ఎవరికి, ఎందుకు భయపడదు.

"ఏమిటి వదినా ఆలోచన, కాలేజి లైఫ్ మరిచిపోయారా!"

"నిజమే! నీవన్నట్లు కాలేజి ఏమిటీ, మా అమ్మా నాన్నలను, చెల్లాయిని కూడా మరిచిపోయాను. చాలా సెల్ఫిష్‌గా తయారయ్యాను. నీవు మా కాలేజి గురించి అడుగుతున్నావో లేక నాకు గర్భం ఏవిధంగా వచ్చిందని అడుగుతున్నావో తెలియదు కానీ నాకు తెలిసినంతవరకు నిజమే చెప్తున్నాను. నీవు నమ్మినా నమ్మకపోయినా నేను చెప్పేది సత్యం.

"నేను ఇంటర్ మంచి మార్కులతోనే పాసయ్యాను. మెడిసన్‌కు అప్లై చేశాను. సీటు రాలేదు. తిరుపతి వుమన్స్ కాలేజీలో బి.యస్సీకి అప్లై చేశాను. అది సీటు వెంటనే దొరకలేదు. ఆ తరువాత ఉన్న ఊర్లోనే కో ఎడ్యుకేషన్ అయినా పరవాలేదని అదే సైన్స్ కోర్సుకు అప్లై చేశాను. సీటు దొరికింది. సంతోషంగా చేశాను. ఇప్పుడనిపిస్తుంది తెలుగు మెయిన్‌గా తీసుకుని బి.ఏలో చేరివుంటే కథలు వ్రాసుకుని స్వతంత్రంగానైనా బ్రతికేదాన్నేమో! రెంటికీ చెడ్డ రేవణ్ణయ్యాను, అట్ల సైన్స్ చదివి ఉద్ధరించింది లేదు. ఇట్ల తెలుగు పూర్తిగా చదివి తెలుసుకుంది లేదు. నీకు తెలుసుగా కాలేజీలో జరిగే గొడవలు. మగపిల్లలు ఆడపిల్లలను, లెక్చరర్లను నిక్‌నేమ్స్ పెట్టి ఏడిపించడం, తామే మహా అందగాళ్ళ అన్నట్లు, మిగతావాళ్ళు వానర వంశానికి వారసులయినట్లు ఏడిపిస్తూ, ఎక్కిరిస్తూ తమకుతామే ఆనందించడం, ఇదంతా ప్రతి కాలేజీలోను జరిగే సాధారణ విషయమే! అందులో మా కాలేజీ ఏమీ తీసిపోదు. మొదటి సంవత్సరం ఇలా అల్లరితో, ఆనందంతో గడిచిపోయింది. దిగులు, విచారం తెలియని దశ విద్యార్థి దశ. అలాంటి అద్భుతమైన దశలో ఏ క్షణాన నాలో రాహువు ప్రవేశించాడో

తెలియదు కాని ఆ విద్యార్థి జీవితం పూర్తిగా అనుభవించింది లేదు. రెండవ సంవత్సరంలో బాటనీ ముఖ్యమైన సబ్జక్టుగా తీసుకునే వాళ్ళను ప్లాంట్ కలక్షన్‌కు తీసుకోనిపోవడం ఒక ముఖ్యమైన పాఠ్యభాగం అయినందువలన మమ్మల్ని ఏ వూరు పోయేది సెలక్ట్ చేసుకోమన్నారు. ఊటీ లేక కొడైకెనాల్. ఆఖరుకు కొడైకెనాల్ ఎన్నికయింది. నాకు ఊటీకన్నా కొడైకెనాల్ వెళ్ళడమే ఇష్టం. ఊటీ మనకు పెద్దదూరం అనిపించదు. బెంగుళూరు టూరిస్ట్ స్పాట్‌వలన ఊటీకి ఎప్పుడైనా పోగలం. కాని కొడైకెనాల్ అలా కాదు. మధురకు దగ్గరుండే కొడైకెనాల్ అతి దూరపు ప్రయాణమే! అది తల్లిదండ్రులతో కలిసిపోయే తేలిక ప్రయాణం కాదు. అందుకే నేను కొడై కావాలంటూ చేయెత్తాను.

సహజంగా ప్రతి సంవత్సరం ప్లాంట్ కలక్షన్‌కు దసరా హాలిడేస్‌కు పోతారు. కాని కాలేజీ స్ట్రయిక్‌వలన మా ప్రయాణం పొంగల్ శెలవులకు వాయిదా పడింది.

చలి అధికమని, మమ్మల్ని స్వెట్లర్లు, రగ్గులు, స్కార్ఫులు అన్ని ఇబ్బంది లేకుండా తెచ్చుకోమన్నారు. సాధ్యమైనంతవరకు తక్కువ లగేజ్‌తో రమ్మన్నారు. ఎవరి లగేజ్ వాళ్ళే మోయాలని మొదటే చెప్పేశారు. ప్రయాణపు రోజులు దగ్గరకు వచ్చే కొద్ది సంతోషంతో మాకు నిద్రపట్టేది కాదు. భోజనం సహించేది కాదు. ఎప్పుడూ ఆ రాబోయే ప్రయాణపు కబుర్లే! మేము కలలుగన్న రోజు రానే వచ్చింది. ఇద్దరు లెక్చరర్స్ ఒక అటండరు, మొత్తం ముప్ఫయిమందిదాకా బయలుదేరాం. ఓహ్! ఆ రోజు. జీవితంలో మరువలేనిరోజు. రైల్వేస్టేషనంతా ఒకే కోలాహలం. మామా ఆరాధకులతో రైల్వేస్టేషనంతా ఒకే అల్లరి. కొంత మంది మిగతా ప్రయాణీకులతో దెబ్బలాడి మాకు వసతిగా సీట్లు ఏర్పాటుచేశారు. మేమేదో కాలేజీ వదలిపోతున్నట్లు వాళ్ళలో విషాదం. ట్రైన్ కదిలింది. ఫేర్‌వెల్ విషస్ అందుకుని సంతోషంగా మా సీట్లలో కూర్చుని ఒకే కబుర్లలో పడిపోయాం. మద్రాసువరకు రిజర్వేషన్ లేదు. మద్రాసులో ట్రైన్ మారగానే మాకు రిజర్వుచేసిన కంపార్ట్‌మెంట్స్‌లో ఎక్కి కూర్చున్నాం. మరునటిరోజు ఉదయం ఆరుగంటలకు కొడై రోడ్డు చేరి, తిరిగి బస్సు ఎక్కి కొడైకెనాల్ కొండపైకి మధ్యాహ్నానికి చేరాం. క్రిందనే ట్రైన్ దిగగానే మా లెక్చరరు మాకంతా ఒక ఆశపెట్టారు. వారు బుక్కు వ్రాస్తున్నానని, ఇంతవరకు కనిపెట్టబడని క్రొత్త మొక్కలను, వాటి జాతులను కనుగొన్న వారి పేర్లు. ఫోటోలు తన పుస్తకంలో వేస్తానని, అంతకుముందు సంవత్సరం ఒక రేర్ స్పిసీస్ మధురై కాలేజివాళ్ళు కనిపెట్టారని, అది మేము బస్సుకొరకు వేచివున్న రోడ్డుకు ప్రక్కగానే దొరికిందని అన్నారు. మేము అలాగే కనుక్కొని మా కాలేజి పేరు నిలబెట్టాలని మాలో ఉత్తేజం నింపారు. ఇక చెప్పవలెనా మాలోని వుత్సాహం. మా కళ్ళు నలువైపులా పరుగెడుతుంటే ఏ మొక్క కనబడినా అటువైపు పరుగెత్తే



వాళ్ళం. పైకి చేరగానే, మాకని బుక్‌చేసిన లాడ్జిలో, అందరం సర్దుకున్నాము. మా దినసరి కార్యక్రమం, ఉదయం ఐదుగంటలకు లేవడం. స్నానాలు పూర్తి చేసుకుని టీ తాగి భుజాలకు బ్యాగ్‌లు తగిలించుకుని ప్లాంట్ కలక్షన్‌కు బయలుదేరే వాళ్ళం. వాహనాలు ఎంతదూరమైనా ఉపయోగించేవాళ్ళం కాము. అన్ని మైళ్ళు నడిచి వెళ్ళేవాళ్ళం. కొండలు, గుట్టలుగుండా నడుచుకుంటూ, కావలసిన మొక్కలను బాగ్‌లో వేసుకుంటూ, అలసట అన్నది మరచి సంతోషంగా ఉత్సాహంగా ఎంతదూరమైనా పోయేవాళ్ళం. ఫేరిఫాల్స్, సిల్వర్‌కాస్కేడ్, పిల్లర్‌రాక్స్ ఇలా రోజుకొక చూడవలసిన స్థలాలను చూచుకుంటూ, సన్నని కాలువలప్రక్కన అందమైన జిమ్నేకప్స్, పిచ్చర్స్, గోల్డన్‌ఫెరన్, సిల్వర్‌ఫెరన్, ఇలా రకరకాలవి చూచుకుంటూ, బేరీలతో నిండిన తోటలు, అందమైన లాండ్‌స్కేప్స్, ఒకదేమిటి ప్రతిది వచ్చగా కళ్ళను, హృదయాన్ని ఆకట్టుకొనేలా ఉన్న చెట్లతో నిండిన కొండలను, మంచుతో నిండిన లోయలను చూసి ఆనందిస్తూ, ఆ అందాలని ఆస్వాదిస్తూ గడిపేవాళ్ళం. మాతోపాటే కాలికట్ నుండి వచ్చిన ఉమన్స్ కాలేజి అమ్మాయిలను, మద్రాసు యూనివర్శిటీ స్టూడెంట్స్, పిక్నిక్‌కొరకు వచ్చిన మధురై మెడికల్ కాలేజి స్టూడెంట్స్, సినిమా షూటింగ్ కోసం వచ్చిన సినిమా యాక్టర్లు అందరిని కలిశాము.

కాలికట్ నుండి వచ్చిన అమ్మాయిలు మరీ నాటీ. మా స్టూడెంట్స్, మా బాచ్‌లర్ లెక్చరర్ ఒక ఆయన వాళ్ళనుచూసి బెదిరిపోయేవాళ్ళు. మా స్టూడెంట్స్ అంటుండేవాళ్ళు. మన అమ్మాయిలు బంగారుబొమ్మలు సార్. ప్రతి ఆడపిల్ల నేర్చుకోవాల్సిన సత్ప్రవర్తన మన అమ్మాయిలలోనే వుంది. మమ్మల్ని ఎంత అపురూపంగా చూచుకునేవాళ్లు తెలుసా! మాకే ఆశ్చర్యం. వీళ్ళే నా కాలేజిలో అంత అల్లరిచేసే గడుగ్గాయిలు అని.

ఆ రోజు ఫేర్‌ఫాల్స్‌కు బయలుదేరాం. ఆకుపచ్చ వెల్వెట్ తివాసి పరచినట్లున్న తోటలతో నిండిన కొండలు, విశాలమయిన పచ్చికబయళ్ళు, ఉండి ఉండి బంగారు కాంతులను వెదజల్లుతున్న చిరుచిరు ఎండలు, పూలజల్లులా కురుస్తున్న సన్నని వర్షపు తుంపరులు, అది ప్రకృతి సౌందర్యానికి నిర్వచనమనిపించేట్లుగా వుంది. అక్కడే ఎన్నో ఫోటోలు తీసుకున్నాం. ఎప్పుడూ మధ్యాహ్నం మూడు గంటలకు మా ప్లాంట్ కలక్షన్ ముగించుకుని లాడ్జి చేరేవాళ్ళం. సాయంత్రం బోట్ షికారు, షాపింగ్ సెంటరు అన్నట్లుగానున్న చిన్నచిన్న అంగళ్ళు అవి చూసుకుని రాత్రి ఎనిమిది లోపలే గూళ్ళు చేరేవాళ్ళం. అలాంటి సాయంత్రపు వేళలోనే మద్రాసి యమెస్సి స్టూడెంట్స్‌ను కలుసుకుంది. అందులో ఒక అమ్మాయి మా కాలేజి యక్స్ స్టూడెంటట. అందువలననే వాళ్ళ వివరాలు తెలిసినయి. అలాగే ఒక తమిళ సినిమా షూటింగ్ చూశాము.

పిల్లర్‌రాక్స్ చూసుకుని, అక్కడేనున్న అబ్జర్వేటరీకి సంబంధించిన

సెంటర్ చూచుకుని మూడుగంటలకు తిరిగి బయలుదేరాం. పిల్లర్‌రాక్స్ చూసే దానికి చాలా దబ్బుకట్టి టాక్సి మాట్లాడుకున్నాం. కాని అది డైరక్టుగా ఊర్లోకి కాదు. ఊరికి ఒక మైలు ముందరే దిగి మరికొన్ని ప్లాంట్స్‌కొరకు రోడ్డుకు రెండువైపులానున్న కొండలమీదకు చీలిపోయాం. అమ్మాయిలమంతా ఒక జట్టుగా ఒకవైపు బయలుదేరాం. మాకు ఒక వయసయిన ప్రొఫెసరు తోడు. ఆయనంటే మాకు ప్రాణం. ఆయన మమ్మల్ని తన స్వంత పిల్లలు అన్నట్లుగా చూచుకునే వారు. అలా జట్టుగా పోతున్న మాలో నేనెలా వేరయ్యానో నాకే తెలియదుకాని సడన్‌గా చీకట్లు ముసురుకొనేటప్పటికి వెనక్కుతిరిగి చూశాను. అక్కడ నా ఫ్రెండ్స్ ఎవరూ లేరు. అదిరిపడి నాలుగడుగులు అటు ఇటుకేసి, గొంతెత్తి పిలిచాను. కాని బదులుగా ఎవ్వరి గొంతు వినిపించలేదు. గడియారంవైపు చూస్తే టైమ్ క్లియర్‌గా తెలియలేదు. కటిక చీకటి. బహుశ చాలా దూరమే వాళ్ళను వదిలి వచ్చానేమో అనుకుంటు, మనసులో భయం అనిపిస్తున్నా, దగ్గర్లోనే ఫ్రండ్స్ వుంటారులే అన్నట్లు లేని ధైర్యం తెచ్చుకుని వెనుకకు మరొక వది అడుగులు వేశాను. అంతే తలకు బలంగా ఏదో ఒంగిన కొమ్మ తగలడం మరుక్షణం బాధతో అరవడంమటుకే తెలుసు. ఆ తరువాత ఏమయిందో తెలియదు. తిరిగి కళ్లుతెరిచిన నేను తలకు కట్టుతో గిరుకుపోయిన కాళ్ల చేతులకు వేసిన ప్లాస్టర్లతో పరుపుమీద పడుకుని వున్నాను. నా ఎదురుగా మా లెక్చరర్స్, స్టూడెంట్స్ నిలబడి వున్నారు. అందరి మొహాలలో ఆందోళన, ఆతృత నిండివున్నాయి. నీరసంగా పిలిచాను. నాకేమయిందని అడిగాను. మునుపున్నంత చలి లేదు. చాలా వెచ్చగా వుంది. వేడి కాఫీ స్పూన్‌తో నా నోట్లో పోశారు. కాఫీ కడుపులోకి దిగుతుంటే క్రమేణా జరిగినదంతా ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగాయి. భయంతో వణికిపోతుంటే, ఇక భయపడ పనిలేదని, ధైర్యంగా వుండమని మాస్టర్లు నన్ను రెస్ట్ తీసుకోమని వెళ్ళిపోయారు. ఆ రోజంతా పడకమీదే వుండిపోయాను. శరీరమంతా నీరసంతో పైకి లేవడానికి కూడా శక్తిలేనట్లు బలహీనమయింది. స్నానం చేయాలని, నాతోటి అమ్మాయిలతో షికారు చేయాలని కోరిక. కాని మా లెక్చరర్స్ నన్ను ఎక్కడికీ పిలుచుకునిపోలేదు. మరుసటిరోజు ప్లాన్‌ప్రకారం మరొకరోజు గడపాల్సిన మా ప్రోగ్రామ్స్‌ను కాన్సిల్ చేసుకుని మధురకు వచ్చేశాం. కాని నాలో మునుపున్న ఉషారు తగ్గింది. జరిగినదంతా స్నేహితులద్వారా తెలుసుకున్నాను. ఒక రాత్రంతా, ఆ చలిలో, కారుచీకట్లో, భయంకరమైన ముళ్ళపొదలలో స్పృహ లేకుండా ఒక రాత్రంతా గడపడం ఇప్పటికి తలచినా వెన్నులో చలి పుట్టుకు వస్తుంది. మా స్నేహితులూ, మా లెక్చరర్ అంత చీకట్లో ప్రతి స్థలం వదల కుండా టార్చిలైట్లతో వెదికి వేసారిపోయారంట. ఆ చీకటికి తోడు విపరీతమైన వానట. చివరకు నేనే దారితప్పి రోడ్డుచేరి వుంటానని నేను లాడ్జికి ఏదో ఒకవిధంగా చేరివుంటానని కొన ఆశతో వచ్చామని, అక్కడ నేను కనిపించక



పోయేటప్పటికి మాస్టర్లు ఇద్దరూ తిరిగి వెదకడానికి బయలుదేరారని చెప్పారు. కాని ఆ రాత్రి వాళ్ళ ప్రయత్నాలు వృధా అయ్యాయని మరుసటిరోజు ఉదయాన్నే అదే స్థలానికి వెదుక్కుని వచ్చిన తమకు రోడ్డుకు పక్కగా చినిగిన గుడ్డలు, రక్తపుచారలు తోటి మైకంగా వున్న నేను కనిపించానట. ఎంతగా కదిలించినా కదలలేదట. శరీరం మంచువలన గడ్డకట్టుకుపోయిందట. అటువైపుగా ఫిలిమ్ కంపెనీ కారును ఆపి నన్ను తీసుకుని లాడ్జికిచేర్చి డాక్టరును పిలిపించబోయామని, ఆ లోపలే హీటరు తెచ్చి గదంతా వేడి చేయించగానే నాలో కదలిక కలిగిందని చెప్పారు.

"భగవంతుడు దయామయుడు అంజూ! నీవు లేకుండానే తిరిగి మనవూరు చేరవలసి వస్తుందేమో అని భయపడ్డాం. నీ అదృష్టమో, మన బాధ్యత తలమీద వేసుకున్న లెక్చరర్ల అదృష్టమోకాని తిరిగి నిన్ను మేము ప్రాణాలతో చూడగలి గాము అన్నారు. కాని మాకు అర్థంకాని ఒకేఒక సమస్య ఎంత వెతికినా, ఎంతగా అరచినా కనిపించని నీవు ఆశ్చర్యంగా రోడ్డుకు ప్రక్కగా చిన్నచిన్న మొక్కలమీద పడుకుని వున్నావు. అదే నమ్మరాని నిజం" అన్నారు.

ఆ తరువాత ఒక రోజు మధురై, మరొక రోజు రామేశ్వరం గడిపి తిరిగి మద్రాసు చేరి అదే రాత్రి ట్రైనుకు మా వూరు వచ్చేశాం. మాస్టర్లు జరిగినది మా ఇంటికివచ్చి వివరిస్తామన్నారు. నేనే వద్దని వారించాను. నేను సలక్షణంగా ఉన్నాను, అలాంటప్పుడు మా అమ్మా నాన్నకు చెప్పి వాళ్ళను వేరే భయభ్రాంతు లను చేయడం అనవసరమయిన విషయం అని చెప్పాను. కానీ మధూ! అది అంత తేలికగా వదలనట్లు తిరిగి తిరిగి గుర్తు చేసుకోమన్నట్లు రెండు నెలల తరువాత పెండ్లి పీటలమీద మీ అన్నయ్య ద్వారా మరల బయటపడింది. ప్రమాణ పూర్వకంగా చెప్తున్నాను మధూ! నేను ఏ తప్పు చేయలేదు. ఎవరి ప్రేమలో పడిందిలేదు. దానికి ఇంకా వయస్సు ముందుందని, నా కొరకు ఏ రాజకుమారుడు కాచుకుని వుంటాడని అనుకునేదాన్నేకాని ఆలా నీచంగా మటుకు ప్రవర్తించిందిలేదు. కాని నన్ను ఎవరూ నమ్మరు. నేను నిరపరాధినని పలికే సాక్షులు ఎవరున్నారు. నన్ను అలాంటి స్థితికి తీసుకువచ్చిన ఆ కామపిశాచి, ఆ భూమి, ఈ ఆకాశం అక్కడున్న వృక్షాలు ఇవే సాక్షులు. అవి అన్ని పలక లేవు. ఇక ఆ దుర్మార్గుడ్ని ఎక్కడున్నాడని వెతకను. ఏ మూలనున్నాడని వెతకను. ఏ ఆధారంతో వెతకను!" అంజుకు ఏడుపు ఆగలేదు. "మీ అన్న య్యను ఎలా ఒప్పించ...." వాక్యం పూర్తికాలేదు. భరత్ బెడ్‌రూములోనుండి భళ్లున గ్లాసు బద్దలయిన శబ్దం వినిపించింది. అంజు భయంగా మధు వైపు చూసింది. మధు చటుక్కునలేచి పడకగదివైపు పోబోయాడు. అంజూ చటు క్కున మధు చేయి పట్టుకుని "మధూ! పోకు అక్కడ ఎవరో దొంగ దూరినట్లు.

వున్నాడు, అతని చేతులలో కత్తి, తుపాకి ఉంటుంది, వెళ్ళకు మధూ! చేతిలో ఏమైనా తీసుకో!

"ఉండండి వదినా! మనం ఇక్కడ ఉండగా దొంగ దూరడమేమిటి! చూడనివ్వండి." అంజును వదిలించుకుని భరత్ గది తలుపు తీశాడు. లోపలికి చూసిన అతను మాట రానట్లుగా నిలబడిపోయాడు. పడకమీద భరత్ తలను దిండు క్రింద దూర్చి కణతలు వత్తుకుంటున్నాడు, గాజు గ్లాసు క్రింద పడిపోయి వుంది. అది ముక్కలు ముక్కలుగా చెల్లా చెదురుగా పడివుంది.

"అన్నయ్యా!" మెల్లిగా పిలిచాడు.

అతను దిండులోనుండి తల ఎత్తి చూశాడు. అతని కళ్ళు ఎఱ్ఱగా చింత నిప్పులా మెరుస్తున్నవి. తలంతా చెదిరిపోయి వుంది. అతను డ్రస్సయినా మార్చుకుండా పడకమీద వున్నాడు.

"ఏమిటన్నయ్యా అలాగున్నారు. ఆరోగ్యం సరిగాలేదా! అసలు ఎప్పుడు వచ్చారు? కాఫీ తీసుకురానా!"

మధు భరత్ దగ్గరగాపోయి చేతిని, అతని నుదుటిమీద తాకించి తల వెచ్చగా వుండడంచూసి టాబ్లెట్లు కొరకు ర్యాక్ వైపు తిరిగాడు!

"టాబ్లెట్లు తీసుకొన్నాను. నీళ్ల తాగేటపుడు గ్లాసు జారింది. ఉదయమే షార్ట్ అపరేషన్ ఒకటి చేశాను. మరేం కేసులు లేవు. అలసటగా అనిపించింది. రెస్టు తీసుకుందామని ముందే వచ్చాను. నేనొచ్చినప్పుడు నీవు లేవు" భరత్ అన్నాడు.

"భోజనం చేశారా!" ఆత్రుతగా అన్నాడు.

"ఊఁ! అక్కడే భోంచేశాను."

"కాఫీ తీసుకుని రానా?"

"అక్కర్లేదు నీవు వెళ్ళు. కొద్దిసేపు నిద్రపోతే అదే తగ్గిపోతుంది" అతను అటు వైపు తిరిగి పడుకున్నాడు. మధు చప్పుడు చేయకుండా తలుపు మూసి బయటకు వచ్చాడు.

అంజు బిక్కచచ్చిపోయి చూస్తూ వుంది. తను చెప్పినదంతా అతను వినలేదుకదా! నేను కథ కల్పించి చెప్తున్నానని కోపంతో గ్లాస్ విసిరేసి వుంటారేమో! అన్ని గదులలో ఎ. సి. వున్నా తమది ఆరవ ఫ్లోర్‌లో వున్నందువలన ఎప్పుడు రివ్వున వీచే గాలికి ఎ. సి. ఎక్కువ వాడడం మానేశారు. ఎండలు అధికంగా వున్నప్పుడు మటుకే ఉపయోగిస్తుండడంవలన హాల్లో మాట్లాడే ప్రతి మాట బెడ్‌రూములకు స్పష్టంగా వినిపిస్తుంది. భరత్ తనను ఇప్పుడు అబద్ధాల కోరుగా కూడా నిర్ణయిస్తాడు. తన దురదృష్టం అతను ఈ రోజు ఇంట్లో ఉండడం, తను అది గుర్తించక పోవడం.

* * * *



"అంజూ నీకొక శుభవార్త చెప్పబోతున్నాను. నాకేమి బహుమతి ఇస్తావు." సూజి సంతోషంతో వెలిగిపోతున్న మొహంతో అంజును దగ్గరకు తీసుకొని బుగ్గలమీద ముద్దు పెట్టుకుంది.

"ఏమిటి అంత సంతోషమైన వార్త. మొదట చెప్పు. ఆ తరువాత బహుమతి మాట." తనూ ఉత్సాహంగా అంది.

"చెప్తున్నాగా! కాని నాకు ప్రామిస్ చెయి, ఎవరికి చెప్పనని. కార్యం పూర్తవగానే అప్పుడే అందరికి తెలిపేది."

"ఎవరున్నారు చెప్పడానికి! మధూ ఒక్కడేగా! చెప్పనులే! త్వరగా చెప్పు, సస్పెన్స్‌తో చంపక."

"మరి....మరి....మరొక వారం రోజులలో మిస్ సూజి మిసెస్ సూజిని కోలాన్‌గా మారబోతోంది. అలా పలుకుతున్నప్పుడు సూజి మొహాన సిగ్గు కనిపించలేదు కాని సంతోషం మటుకు వెయ్యి దీపాల వెలుగులా వెలుగుతోంది.

"వాట్! సూజి! నీవు చెప్పేది నిజమా! ఇంతకీ ఎవరా లక్కీచాప్," అంజుకు ఆశ్చర్యంతోపాటు ఆనందంగా వుంది.

"నిజం అంజూ! నిక్ అమెరికన్, టూరిస్ట్‌గా వచ్చారు. ఇద్దరం మూడు రోజుల క్రింద నైట్ క్లబ్‌లో కలిశాం. ఆ కలయిక, స్నేహంగా మారి, స్నేహం అనుబంధం అయింది. అతను అంత త్వరగా పెళ్ళి చేసుకొమ్మని అడుగుతాడని అనుకోలేదు. అతను హటాత్తుగా అలా అడిగేటప్పటికి, నేను దిమ్మెర పోయాననుకో. మొదట అతను ఫూల్ చేస్తున్నాడేమో అని కూడా తలిచాననుకో! కాని అతని ప్రపోజల్ నిజం. అతను డైవర్స్‌డ్ అంట. మంచి ఉద్యోగం ఉంది. వయస్సు ముప్పయి అయిదు సంవత్సరాలట. మా ఇద్దరికి వయస్సులో ఎక్కువే వ్యత్యాసం. కాని అతను చాలా బాగుంటాడు తెలుసా! అతని గురించి చెప్పినపుడు నేను నా గురించి దాచడం అవివేకం అని తలిచాను. అందుకే అతనికి వర్జిన్ కానని, జరిగినది టూకిగా చెప్పాను. అతను నా పాస్ట్ అనవసరమని ఫ్యూచర్‌లో తామిద్దరు అనుకూలమైన దంపతులుగా ఉండడమే తనకు కావలసిందని కోరాడు. నేను అతనికి ప్రమాణం చేశాను. ఎట్టి పరిస్థితులలోను నా వలన తనకు ఏవిధంగాను తిరిగి ఎందుకు పెండ్లిచేసుకున్నా నా అనే ఆలోచనేరాని విధంగా నడుచుకుంటానని. అంజూ! రేపే మా ఎంగేజ్‌మెంట్. నిక్ రేపు మెర్లిన్ హోటల్లో పార్టీ ఇస్తున్నాడు. ఎవ్వరూ లేరులే. నీవే ముఖ్య అతిథివి. రిజిస్ట్రేషన్‌కు అప్లయి చేశాము. మరొక నాలుగయిదు రోజులలో రిజిస్టర్ ఆఫీసులో సంతకాలు పెట్టుకుని భార్యాభర్తలు అనిపించుకుని, ఇద్దరం కలిసే పోతాం అమెరికాకు. ఈ పెళ్ళితంతు పూర్తయేదాకా మా తల్లి దండ్రులకు తెలియకూడదు. ఆ తరువాతనే చెప్పదలచుకున్నాను. అంజూ! నీకు సంతోషంగా లేదా!"

రెండు చేతులతో సూజీ మొహాన్ని తనకు దగ్గరగా తీసుకుని మెరిసే కళ్ళతో అంది. "మనసారా సంతోషిస్తున్నాను సూజీ. నీ జీవనగతి సరయిన బాటగుండా పోతున్నందుకు, నిన్ను నిన్నుగా కోరి తన స్వంతం చేసుకుంటున్న అతను ఉన్నత మనస్కుడు. ఐ యామ్ సో హాపి. ఇంతకీ అమ్మగారికి కావలసిన బహుమతి ఏమిటో!" చిలిపిగా అంది అంజు.

"ఇదిగో ఈ రెండు చెంపలమీద తీయని రెండు ముద్దులు."

"ఛీ! నాటీ! నేనేం మగవాడినా అలా ముద్దు పెట్టుకోను."

"ఊహూ! ఒప్పుకోను, నాకు కావలసింది అదే స్వీట్."

"ఓకే! కళ్ళు మూసుకో! పూర్తయేవరకు కళ్ళు తెరువకూడదు." బెదిరించింది.

సూజీ కళ్ళు మూసుకున్నట్లు మూసుకొని అంజు మెత్తని పెదవులు తన చెంపలను తాకగనే చటుక్కున కళ్ళు తెరిచింది. అంజుకు సిగ్గనిపించింది. "కళ్ళు తెరవకూడదని ముందే చెప్పానుగా!" ముద్దుగా గుణిసింది.

"అబ్బ! మీ యిండియన్ స్వీట్‌లా ఉంది," పకపక నవ్వింది.

"అవును నన్ను ముఖ్యమైన గెస్ట్ అన్నావు. నేనెలా రాగలను. భరత్ రానిస్తాడంటావా!" అనుమానంగా అంది.

"మైగాడ్! అతనికి తెలియడమే! నిన్ను లోపల పెట్టి లాక్ చేస్తాడు. రేపు ఐదు గంటలకల్లా రెడీగా ఉంటే మనిద్దరం కలసి వెళ్ళిపోదాం. ఆ లోపల మధు కూడా రాడుగా! డిన్నరు డాన్స్ పూర్తవగానే వచ్చేద్దాం. మరీ ఆలస్యమయితే డాన్స్ సగం చూసి వచ్చేద్దాం. నీ గురించి నిక్‌కు చెప్పాను, నీవు నా బెస్ట్ ఫ్రెండ్ అని! అతను నిన్ను కలుసుకోవాలని ఆతృత పడుతున్నాడు, సమ్మతమేనా!"

"భయంగా ఉంది సూజీ. ఆ తర్వాత భరత్ గొడవ చేస్తాడేమో అని, కాని మన చివరి కలయికను వదలదలుచుకోను మనస్సు రావడంలేదు, సూజీ.... నిన్ను ....నిన్ను వదలాలంటే గుండెలంతా మండుతున్నట్లుగా వుంది. కాని నా స్వార్థంకోసం నీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొమ్మని కోరను," అంజు కళ్ళు తడిగా అయ్యాయి.

"నేను అదే ఆలోచించాను అంజూ! నేను 'నిక్'తో నీ గురించి మాట్లాడాను. అతను అన్నీ అర్థం చేసుకున్నాడు. అతను ఒక బాధ్యతగల ఉద్యోగి మాత్రమే కాదు. కొన్ని జనరల్సుకు రిపోర్టర్ కూడా! ఇప్పుడు కూడా సింగపూరులోని కొన్ని ముఖ్య స్థలాలను గురించి, ఇక్కడి ప్రజల సమైక్యత గురించి కొన్ని వ్యాసాలు వ్రాస్తున్నాడు. నాకు నిన్ను వదలి వెళ్ళాలనిలేదు. కాని నీవే ధైర్యం చూపడం లేదు. నేను వెళ్ళిన తరువాత బాగా ఆలోచించుకో! నా స్నేహం నీకు కావాలని, అది నీ భర్తమీది నీకున్న పేమకన్న ముఖ్యమయినది



అనీ అనుకుంటే నాకు జాబు వ్రాయి. నేను నీకు టిక్కెట్టు, వీసా పంపుతాను. నీవు నా దగ్గరకు వచ్చావంటే నీ ఫ్యూచరే మారుస్తాను. ఎన్ని రోజులు అతనిలో మార్పును ఎదురు చూస్తావు. ఇలాగే జీవితాంతం సన్యాసిలా గడుపుతావా! నీకు భర్త అనురాగం, పిల్లల మమత కావాలని లేదూ! నీకు ఏమి తక్కువని అతని కరుణకోసం కాచుకుని వుంటావు. లోకంలో భరత్ ఒక్కడే మగవాడు కాదు అంజూ! ప్రేమ బంధం. పవిత్రమైనదే! అది విడదీయలేనిదేకాని అది రెండు వైపులనుండి పెనవేసుకున్నప్పుడే. నీది ఒక వైపు రాగం. నీకు విద్య, రూపం, గుణం అన్ని వున్నవి, అవి వుపయోగించుకోక ఎన్ని రోజులు అతని కొరకు ఎదురు చూస్తూ వుంటావు. నీ జీవితాన్ని మరొక మలుపు తిప్పుకొనేందుకు ప్రయత్నించు అంజూ, నేను మారలేదూ! భరత్ లేకుండా బ్రతకలేను అనుకున్నా! ఏదో ఒక సంఘటన మనల్ని మారుస్తూనే వుంటుంది. నేను వెళ్ళిన తరువాత బాగా ఆలోచించుకో! నీమీద వున్న విపరీతమైన ప్రేమ వలననే నిన్ను ఇంతగా ప్రోత్సహిస్తున్నాను."

"థ్యాంక్స్ సూజీ! నీవు చెప్పినదంతా ఆలోచిస్తాను. కాని మరొక వివాహం గురించి కాదు. నా కాళ్ళమీద నేను నిలబడే దానికి ప్రయత్నిస్తాను. ఈ ఇంట్లో నేను పిలవని అతిథినే! నిజమే! నాకు ఏం అధికారం ఉందని ఈ ఇంట్లో శాశ్వతంగా ఉంటాను, నేను అనేది లేకుంటే అతనైనా మరొక వివాహం చేసుకుంటాడు. ఇప్పుడు నేనొక బాధ్యతను అతనికి."

"ఓకె! రేపు ఎలాంటి చీర కట్టుకోమంటావు. అది పెద్ద హోటలేమో! చాలామంది ఉంటారనుకొంటా! భయంగా ఉంది బాబూ!" తిరిగి వుత్సాహంగా అంది.

"ఊ! పెద్ద హోటలే! అంజనాగారు ఎలాంటి చీరలోనయినా ముద్దుగా మగవాళ్ళను మైకంతో క్రింద పడేటట్లుగా ఉంటారు. రేపు సరిగ్గా నాలుగున్నరకు రెడీగా వుండాలి." తిరిగి హెచ్చరించింది.

"సూజీ! మధుకు ఒక స్లిప్పు వ్రాసి పెట్టనా!" తిరిగి అంది.

"వద్దువద్దు. మధు తప్పకుండా వాళ్ళ అన్నయ్యకు చెప్తాడు. అతను ఈ సింగపూర్లో నీవు నాతో ఎక్కడున్నా లాక్కొచ్చేస్తాడు. మన పార్టీ అంతా రసాభంగమే!"

"అలాగే! రహస్యంగానే వస్తాలే!" అంజుకు సంతోషంగా వుంది. తిరిగి సూజీతో కొన్ని గంటలు హాయిగా గడపబోతున్నందుకు.

మరుసటి రోజు అనుకున్న ప్రకారం నాలుగున్నరకు రెడీ అయింది. మామగారు ప్రజంట్ చేసిన చీరలో పింక్ కలర్‌లో తెల్లని తీగలతో, చిన్న చిన్న పూవులతో బార్డరుగానున్న జపాన్ జార్జెట్ చీర కట్టుకుంది. అదే రంగు జాకెటు, ఎఱ్ఱ రాళ్ళ నగలు, గట్టిగా బిగించి వేసిన రెండు జడలు తిరిగి కాలేజికి

పోతున్న లావణ్యవతిలా ఉంది అంజు. అంజును చూసిన సూజి కళ్ళు తిప్పుకో లేక పోయింది,

"అబ్బ! ఉషస్సుకు విచ్చుకున్న ఎర్ర గులాబిలా వున్నావు అంజూ! నిక్ నిన్ను చూడగానే నన్నెందుకు సెలక్ట్ చేసుకున్నానా అని మథనపడుతాడు, మూర్ఖుడు భరత్!"

"అదిగో! వారిని అలా అంటే నాకు కోపం వస్తుంది."

"సారీ, సారీ! అనను అనను!" సూజి తమాషాగా ఒంగి పైకిలేచి నవ్వుతూ ముందుకు బయలు దేరింది. సూజికి ప్రక్కగా నడుస్తున్న అంజు సూజి వైపే చూస్తూంది. ఎంత అందంగా ఉంది సూజి ఈ రోజు! ఇది సాధారణమైన రోజా! తన యంగేజ్‌మెంటు రోజు. పెద్దవాళ్ళులేని నిశ్చితార్థం. లేత అరటాకు పచ్చ రంగు షిపాన్ మాక్సి బంగారురంగు శరీరంమీద గుండెల వరకు వుంది. రెండు స్ట్రిపులు మటుకు భుజాలమీద సపోర్టింగ్‌గా ఉన్నాయి. చెవులకు, మెడకు, చేతికి, వేలికి జేడ్ నగల సెట్టు, మాక్సి రంగుకు మాచింగ్‌గా వున్నాయి. భుజాల వరకు వున్న జుట్టును, కుడిసైడు పైకి దువ్వి ఆకు పచ్చని క్లిప్ వేసివుంది. అందమయిన మేకప్, అతికినట్లుగా మరీ ఆకర్షణీయంగా ఉంది, ఇంత అందాన్ని కాదన్నాడట భరత్. అతను సన్యాసి అయి వుంటాడు! లేకుంటే అభిరుచి తెలి యని వాడయి వుంటాడు. అతనికి అందంలోను, నాగరికతలోను నిండివున్న సూజి నచ్చలేదు. ఎంతో మామూలుగా పూర్తి తెలుగుతనంలో ఉన్న తను నచ్చింది. సూజీనే భర్త ప్రక్కగా పోల్చి చూసింది. చక్కని జంట అను కుంది, మరుక్షణం తనను దగ్గరకు తీసుకున్న అనుభవం సూజితో ఊహించు కుంది. మనస్సు అంగీకరించలేదు. అతని స్పర్శ తనకు మటుకే స్వంతం, సూజీయేకాదు. మరే స్త్రీ అయినా అతని స్పర్శ అనుభవించకూడదు. భరత్ తన వాడు. ముందురోజు అతని మరొక వివాహం గురించి ఆలోచించినందుకు ఇప్పుడు నవ్వు వస్తుంది. అది ఉక్రోషంగా ఊహించుకుంటే బాగానే వుంటుంది. కాని నిజ జీవితంలో తలుచుకుంటే అసూయతో ప్రాణమే పోతుంది.

చిన్నగా నవ్వుకుంటూ సూజి ప్రక్క సీట్లో కూర్చుని సీట్ బెల్ట్ ఫిక్స్ చేసుకుంది. ఇద్దరూ ఆరున్నరవరకు సిటీ చుట్టిచూసి, ఆరున్నరకు మెర్లిన్ హోటల్ చేరారు. హోటల్ పార్కింగ్ ప్లేసులో కార్లమధ్య ఈగ దూరనయినా సందులేనట్లు వుంది. దేశ విదేశాల వ్యక్తులు అతి ఆడంబరంగా వస్తున్నారు, పోతున్నారు. ఆకర్షణీయమైన స్త్రీలకు కొదవే లేనట్లు రంగురంగుల దుస్తులతో, తళుక్కున మెరిసే నగలతో ప్రతి స్త్రీ మెరిసిపోతున్నది. సిరి అంతా అక్కడే వున్నట్లనిపిస్తున్నది: అక్కడున్న చాలామంది కళ్ళు వీరిద్దరి మీదనే వున్నవి. చెలిమికి జాతి మతభేదం లేనట్లు ఇద్దరూ చేతిలో చేయి వేసుకుని నడుస్తుంటే చూడ ముచ్చటగా వుంది చూసేవారి కళ్ళకు,



లాంజ్‌లోకి రాగానే పొడవుగా, అందుకు తగ్గ లావుగా! ఆకుపచ్చ కళ్ళ తోటి, లేత గులాబి వర్ణంగల శరీరంతోటి. నల్లగా నిగనిగలాడుతున్న వెంట్రు కలతోటి ఎదురయిన వ్యక్తిని "నిక్‌లాన్" అని పరిచయం చేసింది సూజి. సిగ్గు పడుతూనే అతను అందించిన చేయి అందుకుని వదిలేసింది.

"నిక్! ఎలా వుంది నా ఫ్రెండ్, పేరు అంజనా. అంజు అని పిలువు." సూజి చెప్పగనే అతను చిన్నగ నవ్వి "నీ వన్నట్లు నీ ఫ్రెండ్ బ్యూటిఫులుగా వున్నారు, కాలేజి చదువు చదివి ఇంత సిగ్గుపడే అమ్మాయిని నేనెక్కడా చూడ లేదు."

అతను అలా అంటుంటే అంజుకు మరీ సిగ్గుతో ప్రాణం కుంచించుకు పోయేటట్లు ఉంది. వీరిద్దరూ తనను గురించి మాట్లాడడం ఆపితే చాలు, తను ఫ్రీగా మూవ్ అవుతుంది. అతను ఇద్దరిని తీసుకుని లిఫ్టుగుండా చివరి ఫ్లోర్ చేరి తమకని బుక్ చేసిన టేబిల్ దగ్గరకు వచ్చి కూర్చున్నారు. అది రౌండ్ టేబిల్ అయినందున ముగ్గురు ఎదురెదురుగా కూర్చున్నారు, ఆ హాల్లోని లైట్లు డిమ్‌గా వెలుగుతున్నవి. లైట్లు వెలుగుతున్నా ప్రతి టేబిల్‌మీద, స్పూన్లు, ఫోర్కులు, లిక్కర్ గ్లాసులతోపాటే పూలతో నిండివున్న చిన్న వాజులు. వెలుగుతున్న ఎర్రని కాండిల్స్, ఇవి ఎందుకా అన్నట్లు చూస్తోంది. అది వెస్టరన్ కస్టమ్ అని ఆపైన గుర్తు తెచ్చుకుంది. హాలు నలువైపులా దృష్టి సారించింది అంజు. చాలా వరకు టేబిల్స్ నిండి వున్నవి. కొంతమంది కబుర్లతో గ్లాసులలోనున్న రంగు ద్రవాలను తాగుతున్నారు. చిన్నగా మాట్లాడుకుంటున్నారు, గ్లాసుల చప్పుళ్ళు, స్పూన్లు, ప్లేట్ల చప్పుళ్ళు కొంచం కోలాహలంగానే ఉంది. స్టేజిమీద ఒక అమ్మాయి ఇంగ్లీషు పాటలు పాడుతోంది. ప్రక్కనున్న ఆర్కెస్ట్రా పాటకు అను గుణంగా మ్యూజిక్ ఇస్తున్నారు.

అంజు దృష్టి తిరిగి సూజి, నిక్‌మీదకు మరలింది. సూజి చిన్నగా అత నితో ఏదో మాట్లాడుతోంది అతను సూజి మాటలతో పూర్తిగా లీనమయివున్నాడు. మొట్టమొదటి సారిగా పరీక్షగా చూస్తున్నట్లు అతనివైపు చూసింది, తను సూజి ముప్ఫై సంవత్సరాలు పైబడిన వ్యక్తి అనగానే వయసయిపోయి, తల నెరసి, బట్టతలతో ఎర్రగా దొండపండులా ఉంటాడనుకొంది. కాని సూజి అతనిముందు చాలా పొట్టిగా ఉన్నట్లుంది. భరత్ ముప్ఫై సంవత్సరాల వయస్సులో ఎలా ఉంటారు ఆలోచనలో పడింది. తన కళ్ళముందు ఒక వింతయిన దృశ్యం వన్నిగా కనుపించింది. అరడుగుల రెండంగుళాల భరత్ రెండు అంగుళాలకు వంగిపోయిన పొట్టతోటి, సోడాబుడ్డి కళ్ళద్దాలతోటి, చేతిలో ఒక పొడుగాటి కర్రతో, సన్నగా, గాంధీతో బెన్‌కింగ్స్లీలా బాబోయ్! తననుతానే మరిచి పకపక నవ్వింది.

"అరే! అంజూ! ఏమిటి! ఏమిటి అంతగా నవ్వించే సీన్." సూజి అంజును కదిలించింది.

ఉలిక్కి పడింది అంజు. "మైగాడ్! నన్ను నేనే మరిచిపోయాను. సారీ!" సంభ్రమంగా అంది.

"ఊహూ! అదంతా వీల్లేదు. విషయమేమిటి చెప్పు," బలవంతం చేసింది.

"ఓ! సూజీ! నన్ను వదిలెయ్ బాబూ. నీకు పుణ్యం ఉంటుంది, కారణం చెప్పితే నీవు నవ్వుతావు."

"అదే నాకు కావలసింది, ఇంతకీ ఏమిటి చెప్పు, లేకపోతే నిన్ను వదలనే వదలను."

"నేను చెప్పిన తరువాత మీరిద్దరూ నవ్వనే నవ్వకూడదు."

"ఆల్‌రైట్! నవ్వంలే! త్వరగా చెప్పు."

"అది....అది....మరి నీవు నీ ఫియాన్సి వయసు ముప్పయి అయిదు సంవత్సరాలన్నావు కదూ! నేను మరొక రకంగా ఊహించుకున్నాలే!"

"ఎలా?"

"ఎలా అంటే, తెల్లబడి పలచబడిన జుట్టు, ఎర్రగా కందిపోయిన జుట్టు, చిన్నవిగా బండ వెలుతురు అంటే భయపడే కళ్లు, లావుగా పొట్టిగా, దాడీ, మీసాలులోవున్న వయసయిన ఆయన అనుకున్నా! అలాగే భరత్‌ను పోల్చుకున్నా, వంగిపోయిన గడ కర్రలా, పొట్ట లేకపోతే జెన్‌కిగ్లీస్‌లా! ఓహ్! నేను చెప్పనుపో...." తిరిగి కిలకిలా నవ్వింది. అంజుతోపాటే సూజీ, నిక్ కలసి శబ్దం చేస్తూ నవ్వారు. వీళ్ళ నవ్వులకు మిగత టేబిల్స్ దగ్గర కూర్చున్నవారు తిరిగి చూస్తున్నారు.

"అంజూ! ఏమి జోక్! మైగాడ్! ముప్పయి అయిదు సంవత్సరాలకు ముసిలివాళ్ళయ్యేదేమిటి, ఇన్ని ఇంగ్లీష్ సినిమాలు చూస్తున్నావు. యాభై సంవత్సరాలపైన వయసుంటేనే కదా నాయకుడు అని తెలియదూ! ఆంతలోనే మరచిపోయావా!"

చటుక్కున అతనన్నాడు. "మీ యిండియాలో థర్టీఫయివ్‌కు ముసలివాళ్ల అయిపోతారా!"

"ఊఁ! చేసే ఉద్యోగపు ఆదాయానికి మించిపోయే ఖర్చులకు ఎలా వుంటారు. పెళ్ళాం, బిడ్డలు, తల్లి దండ్రులు, జబ్బులు, వేలు అప్పుచేసి అక్కచెల్లెళ్ళకు పెళ్ళి చేసిన ఖర్చులు, తమ్ముళ్ల చదువులకయ్యే ఖర్చులు. ఇన్ని బాధ్యతలతో ఎలా వుంటారు. ముప్పయి అయిదు సంవత్సరాలుగాదు, పాతిక సంవత్సరాలు పైబడితేనే చాలు, తిన్నా తినకపోయినా పెరిగిపోయే పొట్ట, కళ్ళకు తలనొప్పి సాకుతో అద్దాలు, ఆలోచనల కొరకు అప్పుడప్పుడు జుట్టు పీక్కునేదానికి నాలుగు వెంట్రుకలు వుండనీ అని రాలిపోగా మిగిలిన జుట్టు....కాని ఒకటిమటుకు మా మగవాళ్ళను మెచ్చుకోవాలి, మీలా ఇరవయి ఒక సంవత్సరం ముగియడంతోటే బాధ్యతలు తెంచుకుని ఎగిరిపోరు."



"స్టాపిట్ అంజూ! ఈరోజు అమ్మాయిగారు బలే హుషారుగా వున్నారు, ఏమిటి కథ!"

"నీవు అమెరికా వెళ్ళిన తరువాత నేను గుర్తుండాలి కదా అందుకు."

"అంజూ!" సూజీ కళ్ళలో నీళ్ళు నిండాయి.

"డోన్ట్ బి సిల్లీ! సూజీని కొట్టి పారేస్తున్నదే కాని తనకు ఏడుపు వచ్చేట్లు వుంది. అతను వీళ్ళిద్దరి వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఇది సంతోషకరమైన రోజు, మనం వచ్చింది యంగేజ్‌మెంట్ పార్టీ కొరకు. మీరిద్దరూ మీమీ మూడ్సు కొంచం ప్రక్కన పెడితే నేను సంతోషిస్తాను. లేకపోతే మీతోపాటు నేను ఏడవాలి." అతను ఏడుపు వస్తున్నట్లుగా నటించేటప్పటికి ఇద్దరూ పక్కున నవ్వారు.

"థాంక్‌గాడ్! హారిబుల్ సీన్! ఆ ఏడుపులే నాకు పట్టవు. ఓకే! మిసెస్ అంజనా, మీనాశిగా సూజీ వాంగ్‌ను నాకాబోయే భార్యగా నిశ్చయం చేసుకుంటున్నాను. దానికి ఇదిగో ఈ రింగ్ నిదర్శనం." అతను కోటు పాకెట్‌లోనుండి చిన్న గ్లాస్ పెట్టె తెరిచి అందులోనుండి తెల్లగా ధగధగ మెరుస్తున్న రాళ్ల పొదగబడిన ఉంగరం తీసి సూజీ చేతి వేలికి తొడిగి, చెంపలమీద ముద్దు పెట్టుకున్నాడు. సూజీ తిరిగి అతని కుడి చెంపను తన పెదవులతో స్పృశించింది. ఆ తరువాత అతను టేబిల్‌మీద అప్పటికే చిన్నచిన్న గ్లాసులలో నింపివున్న ద్రవాన్ని తను అందుకుని మిగిలిన రెండు ఇద్దరిని తీసుకొమ్మని చీర్స్ చెప్పమన్నాడు. సూజీ తీసుకుంది కాని అంజు తాకలేదు.

"ఊ తీసుకో! అంజూ అది మైకం కలిగించే విస్కీకాదు. ఓన్లీ వైన్. తాగి చూడు- ఆ తరువాత నీకే నచ్చుతుంది." సూజీ బలవంతం చేస్తుంటే అది తీసుకొని వాళ్ళిద్దరి గ్లాసును తాకించి ఒక గుక్కలో తాగేసింది. తాగిన తరువాత బాగుందనే అనిపించింది.

"ఎలా ఉంది" సూజీ అంది.

"పరవాలేదు."

"అంటే మీకు నచ్చిందన్నమాట. మరొక గ్లాసు తీసుకోండి." అతను తిరిగి అంజు, సూజీ గ్లాసులకు నింపసాగాడు.

అంజు అది తాగేసి అబ్బ కడుపు నిండిపోయింది అంది.

"దీనితోనే! మన డిన్నరు సంగతేమిటి!"

"సూజీ! నాకు మీ చైనీస్ ఫుడ్, ఇంగ్లీష్ ఫుడ్ దిగవు. నన్ను మటుకు వదిలెయ్!"

"నాన్సెన్స్! అం... తేలి... వదులుతాననుకొన్నావా! అన్నీ తినాల్సిందే! బీఫ్, పోర్క్ వదిలెయ్. ... ఫిష్ ...ందిగా!"

అంతలోనే సర్వర్లు ఒక్కొక్క ఐటమ్ మెను ప్రకారం తెచ్చి ముందర పెడుతున్నారు. అతను తన ప్లేట్ ఒక్కొక్కటి తీసి పెట్టుకుంటుంటే సూజీ తనతోపాటే అంజుకు ప్లేట్లో ప్రతి పదార్థం సర్ద సాగింది. ఆ సలాడ్ వాసన అంజు కడుపులో తిప్పుతున్నట్లుగా ఉంది. కాని తప్పని సరి.

ఇంతలో అతను తిరిగి మరొక గ్లాస్ అందించాడు. "ఇదిగో ఇది తాగండి. ఆ తరువాత మీరు ఏం తింటున్నారో కూడా తెలియదు." అంజు అది అందుకుని గబగబ తాగేసింది. కాని ఈసారి ఘాటుగా గొంతును కడుపును మండించింది, అంజుకు తెలియదు, అతను చాంపేన్‌లో విస్కీ కలిపింది.

"ఎలా ఉంది?" అతనన్నాడు.

"కడుపు మండుతున్నది" అంజు మెల్లగా అంది. శరీరం మెల్లగా తేలుతున్నట్లుగా ఉంది.

"అది చల్లారాలంటే మీ ముందున్న పదార్థాలు తినాలి." అతను ఒత్తిడి చేస్తుంటే ఒక్కొక్కటిగా తిన సాగింది. దాని రుచి తెలియడం లేదు, అతను తిరిగి తిరిగి విస్కీ నింపిన గ్లాసు అందిస్తున్నాడు, అంజుకు అది వారించే శక్తి లేదు.

"ప్లీజ్! నిక్! స్టాపిట్! ఆ తరువాత మిస్టర్ భరత్ మీ మీద కేసు పెడతాడు," సూజీ వారించింది.

"నీకు తెలియదు, ఇలా పార్టీకి వచ్చిన గెస్ట్స్ మైకంలో పడిపోయేంత వరకు డ్రింక్ ఇవ్వాల్సిందే. అదే పార్టీ అంటే. గుర్తుంచుకోవాలిగా, నికోలాస్ ఎంగేజ్‌మెంటు పార్టీలో ఎక్కువగా తాగి పడిపోయాను అలా అంతకు ముందు ఎప్పుడు జరగలేదని. తాను తీసుకుంటుంటే మధ్యలో నీకు బాధేమిటి?"

సూజీ అతను స్టడీగా వుండడం. తను మటుకు ఇలా తూలడం ఆశ్చర్యంగా వుంది అంజుకు.

సూజీ తిరిగి అంటుంది. "నీకు అంజు భర్త, మరిది సంగతి తెలియదు. వాళ్ళు ఈ వూర్లో పేరున్న బిజినెస్ మాగ్నెట్ కొడుకులు. ఆ తరువాత విపరీతానికి దారి తీయొచ్చు

"యూ సిల్లీ! దీనికి భయపడడమేమిటి? ఇంతకీ మీ ఫ్రెండ్ భర్తను కలుసుకోవాలని వుంది."

"ఓ! దానికేం అబ్జక్షన్ చెప్పడు, ఎందుకంటే అతనికి ఇష్టమయినవాళ్లు మగవాళ్ళే."

"అంటే ఆడవాళ్ళంటే అలర్జీయా!"

"అలర్జీ కాదు, ఎక్కడ తనను తినేస్తారో అన్న భయం."

"వాట్?"

"భరత్ ఈజ్ ది టాప్‌మోస్ట్ హాండ్‌సమ్‌గై ఇన్ హోల్ సింగపూర్!"



"అలాగా! మరి నీవు నైబర్‌గా ఉంటూ లవ్‌లో పడలేదూ!"

"ఎందుకు పడలేదూ! పడ్డాను! ఆతని ద్వారా అతని కుక్‌చేత మెడబట్టి గెంటించుకో బడ్డాను.

"థాంక్స్ టు హిమ్! నిన్ను నా కొరకు వదిలేశాడన్నమాట," నవ్వాడు అతను.

"సూజీ! ఏమిటా తెలివి తక్కువ వాగుడు. కాబోయే భర్తతో మాట్లాడే మాటలేనా అవి," అంజు వచ్చిరాని తమిళంలో అతనికి అర్థం కాకుండా అంది.

"భయపడకు డార్లింగ్. మా ఇద్దరి మధ్య రహస్యమే లేనపుడు ఇది దాచి ఉంచడం ఎందుకు. నిక్ ఏం అనుకోడులే!" సూజీ బెరుకు బెణుకు లేకుండా అంది.

"నీ ధైర్యానికి మెచ్చుకోవాలి."

భోజనం పూర్తయింది. డాన్సు ప్రోగ్రాం మొదలయింది. ముగ్గురమ్మాయిలు డిస్కో చేస్తుంటే మొదట బాగానే ఉందనిపించింది. కాని నిక్ మరోమారు అందించిన విస్కీతో అంజూ పూర్తిగా తన స్వాధీనం తప్పి టేబిల్ మీద తల వాల్చి పడుకుంది, పూర్తిగా డాన్స్ చూడనేలేదు.

అంజూ! అంజూ! లే! ప్రోగ్రాం పూర్తయింది, ఇంటికి పోదాం." సూజీ అంజు భుజాలు పట్టుకుని కుదపసాగింది. బలవంతంగా కళ్లు తెరిచిన అంజుకు సూజీ మొహం మసకగా తెలుస్తోంది.

"అరె! అప్పుడే అయిపోయిందా! ఇప్పుడే కదూ మొదలయింది. అంజుకు మత్తులో మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి. "నేను....నేను....నేనిక్కడే పడుకుంటాను సూజీ." తిరిగి తల వాల్చింది.

అతనికి నవ్వు వస్తోంది. సూజీ బలవంతంగా అంజును లేపి, తన భుజంపై అంజు తలను వాల్చి అంజు నడుముచుట్టు చేయిపోనిచ్చి అతని సహాయంతో లిఫ్టుగుండా క్రిందకు వచ్చింది. అతనికి గుడ్‌నైట్ చెప్పి అంజును మెల్లగా వెనుక సీట్లో పడుకోబెట్టి కారు డ్రైవ్‌చేసుకుంటు ఇల్లు చేరింది. అతి కష్టంమీద తను నడిపించుకుంటు, బటన్ నొక్కింది. తలుపు తీసింది భరత్. సూజీకి శరీరం సన్నగా వణికింది. అయినా తనకు లెక్కలేనట్లు అంజును కుదిపి "అంజూ లే! కళ్ళు తెరు. లోపలికి వెళ్ళు అంది.

ఎంతో కష్టంపై కళ్ళు తెరిచిన అంజు తూలుతూ లోపలికి వచ్చి హాల్లో సోఫాలో పడిపోయింది. నిప్పులు కక్కుతున్న భరత్‌నుకాని, ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్న మధునుగాని గమనించే స్థితిలో లేదు.

భరత్ విసురుగా అంజును కదిల్చి లేపి కూర్చుండబెట్టాడు. "యూ ఇడియట్! ఎక్కడికెళ్ళావు ఇంతవరకు? ఇంత రాత్రివరకు ఎక్కడ తిరిగొచ్చావ్! లే! లేచి బదులు చెప్పు" అంజును భుజాలు పట్టుకుని ఊపేస్తున్నాడు. కళ్ళు తెరిచి

అతనివైపు చూసిన అంజు "నువ్వా! నీకు చెప్పనుపో!" కసిరింది. మత్తులో అతనిని మీరు అనడం కూడా మరచిపోయింది.

"మధూ! మధూ! ఎక్కడున్నావు?" అంజు మధుకొరకు వెదుకుతూంది.

"ఇక్కడే వున్నాను వదినా! మీ ప్రక్కనే వున్నాను" అతను అంజుకు దగ్గరగా వచ్చాడు.

"వదినా! ఎవడా వెధవ. త్వరగా చెప్పండి! మిమ్మల్ని ఇంతగా తాగించి పంపించాడు. వాడి రక్తం కళ్ళచూస్తాను."

"ష్! అలా....మర్యాద.... లేకుండా... మాట్లాడకు.... అతను....అతను...."

"ఊ త్వరగా చెప్పండి వదినా! వాడు ఎక్కడున్నాడు! వాడి అంతు తేలుస్తాను" మధు అంజు చేతులు పట్టుకుని తొందర చేస్తున్నాడు.

"మధూ! సూజి.... సూజి.... సూజిలేదూ!"

"డామ్ సూజి! ఆ తిరుగుబోతు గురించి చెప్పకు' కస్సుమన్నాడు.

"సూజిని అలా అంటే చెప్పను" తిరిగి పడుకుంద.

ఇదంతా శరత్‌కు వినుగ్గా వుంది. "మధూ నీవులే! నేనే తేల్చుకుంటాను. దీనికి ఒక ఫుల్‌స్టాప్ పెట్టకపోతే అనంతంగా సాగిపోయేట్లు వుంది.

"వద్దన్నయ్యా! నేను కనుక్కొంటాను. వదిన అమాయకురాలు. సూజికి పూర్తిగా బానిస అయింది."

"వదినా! ప్లీజ్! లేచి ఏంజరిగిందో చెప్పండి. రాత్రి రెండువరకు ఎక్కడి కెళ్ళారు. లేచి చెప్పండి వదినా!"

అంజు తిరిగి తల విదిల్చి లేచి కూర్చుంది.

"మధూ! సూజిలేదూ! సూజికి.... అమ్మో! అది రహస్యం. సూజి చెప్ప వద్దన్నది. ప్రమాణం చేయించుకుంది కూడా!"

"ఫరవాలేదు వదినా! నేనెవ్వరికి చెప్పనుగా! రహస్యంగానే వుంచుతాను. ఏమిటో చెప్పండి."

"ఒకే! నీకు.... ఒక్కడికే.... చెప్తాను. సూజికి ఈ రోజు.... "ఓక్" అనే శబ్దం చేసింది.

"మధూ! వాంతి వచ్చేట్లు వుంది. నన్ను.... నన్ను.... బాత్‌రూమ్‌లోకి తీసుకుపోవూ!"

"అలాగే మీరు లేచి నిలబడండి" అంజును లేపి వీపుచుట్టూ చేయివేసి నడిపించుకుంటూ బాత్‌రూమ్‌లోకి పిలుచుకుని పోయాడు. అంతే! బళ్ళున వాంతి చేసింది. కడుపులో ఉన్నదంతా బయటకొచ్చేసింది. కళ్ళలో ముక్కులో నీళ్ళు. క్రింద మీద అయింది. చీర అంతా నాశనమయింది. మధు అంజుదగ్గర నోరు కడిగించి, మొహం చేతులు కడిగి, తుడిచి డైనింగ్‌హాల్లో కుర్చీలో కూర్చుండబెట్టి అంజు గదివైపుపోయాడు మాక్సి తీసుకుని రాను.



అంజు నీరసంగా తలవాల్చి కూర్చుంది. ముందున్న మైకం కొంచెం తగ్గినట్లనిపించింది. కాని తలనొప్పి మొదలవుతోంది. నిద్రవేరే ముంచుకు వస్తున్నది. అలాగే నేలమీదయినా పడుకోవాలనిపిస్తున్నది.

మధు మాక్సి తెస్తుండడం చూసిన శరత్, "మధూ! అది ఇలా ఇవ్వు" అని అది అందుకుని డైనింగ్‌హాలువైపు వచ్చాడు. మధు అక్కడే నిలబడి పోయాడు.

శరత్ అంజుకు దగ్గరగా పోయి జాకెట్‌కు వెనుకగానున్న హుక్స్ విప్పి, తడిగానున్న చీరను క్రిందకు లాగి, మాక్సి తలమీదుగా వేసి జాకెట్ లాగి వేశాడు. మెడలోనున్న నెక్లెస్‌ను తీసివేశాడు. అతను ఏంచేస్తున్నా అంజులో కదలికే లేదు.

అంజును నడిపించుకుంటూ హాల్లోకి తీసుకుని వచ్చాడు. సోఫాలో కూర్చున్న అంజుకు దాహంతో నోరెండిపోతున్నది. "మధూ! తలనొప్పిగా ఉంది."

"కాఫీ తెస్తాను ఉండండి వదినా!" అతను కిచెన్‌లోకి పోయి, ఫ్లాస్కులో నున్న వేడినీళ్ళతో కాఫీ కలిపి, 'పెనడాల్' మాత్రలు రెండు తీసుకుని వచ్చి అంజుతో వేయించి కాఫీ తాగించాడు. రెండు నిమిషాలలో తల భారం తగ్గింది. తల ఎత్తి శరత్ మొహంవైపు చూసి తల తిప్పుకుంది.

"వదినా! ఇప్పుడు చెప్పండి. ఏంజరిగింది. మీకు ఎవరు ఇంత ఓవర్‌గా తాగించారు. వివరంగా చెప్పండి." మధుకు కసిగా ఉంది. ఆ తాగించినవాడెవడో ఎదురుగా ఉంటే నిలువునా చీరేసి ఉండేవాడు.

"అది.... నికోలాస్ బేబిచాంప్ అని ఇచ్చాడు. అది ఘాటుగా కడుపు మంటపుట్టేట్లుగా ఉంది. అంతే నిద్రపోయాను."

"ఇంతకీ ఎవరా ఇడియట్?"

"అలా అమర్యాదగా మాట్లాడకు. అతను సూజికి కాబోయే భర్త. ఈరోజే సూజికి యంగేజ్‌మెంట్ జరిగింది. మెర్లిన్ హోటల్లో పార్టీ ఇచ్చాడు. నే నొక్కదాన్నే గెస్టు. మధూ! సూజి ఏమందో తెలుసా! నన్ను తనతో వచ్చేయమంది. అతను కూడా చెప్పాడంట. నాకు టిక్కెట్టు, వీసా అన్నీ అతనే తీసిస్తాడంట."

"అంటే మీరు వాళ్ళతో పోవాలనుకుంటున్నారా!" మధు గొంతులో తీవ్రత ఉంది.

"అవును. ఇక్కడవున్నా, ఎక్కడవున్నా ఒక్కదే! నాకెవరు వున్నారు. ఎన్నిరోజులు మీమీద ఆధారపడి ఉండను. అందుకే సూజీతో వెళ్ళిపోవాలనే అనుకుంటున్నా!"

అంతే! మధు విసురుగా వెనక్కు లాగబడ్డాడు. అంజు చెంపలు అదిరి పోతున్నాయి.

"యూ రాస్కెల్! ఎంత ధైర్యం! ఎంతగా తెగించావు. చివరకు తనతోటి

"పారిపోవాలని చూస్తున్నావా? అమెరికాకు వెళ్ళి ఏంచేస్తావు? తనతోపాటే ప్రాస్టిట్యూట్‌లా మారాలనా?" అన్నిరోజుల అతని ఆవేదన ఆవేశంగా మారి, ఆవేశం, ఆగ్రహంగా రూపొంది తననుతానే మరచి భరత్ అంజును ఇష్టం వచ్చినట్లుగా చెంపలను అదరగొట్టసాగాడు. అంజుకు భయంతో నొప్పికి ఏడవాలన్నది కూడా తెలియకుండా, ఆ దెబ్బలను తప్పించుకోను కూడా ప్రయత్నించక అతనివైపు అలాగే చూస్తూండిపోయింది.

"అన్నయ్యా! వదులు! వదినను కొట్టకు. వదులన్నయ్యా! వదినను కొట్టకండి." మధు భరత్ చేతులను పట్టి వెనక్కి లాగుతున్నాడు. అతను మధును ఒక్క విదిలింపులో వెనక్కి నెట్టాడు.

"నీవు జోక్యం కలిగించుకోకు. నీవల్లనే తనిలా తయారయింది. తను ఇలాంటి నీతిలేనిదనే ఆనాడు వదిలేసి వచ్చాను. నీవే తిరిగి తీసుకువచ్చి నన్ను నరకయాతనకు గురిచేశావు. హుఁ! ఇంతటి గుణహీనకు భర్తనయ్యాను.

మధు అతికష్టంమీద అంజును విడిపించాడు. ఏదో నిశ్చయానికి వచ్చినట్లు, అంజువైపు చూసి "వదినా నిజంగానే వెళ్ళిపోవాలనుకుంటున్నారా?" అన్నాడు.

ఎర్రగా కందిన చెంపలను తడుపుకుంటూ, కళ్ళనిండా నీళ్ళతో "అవును. నాకెవరున్నారు మధూ. మీకు ఎన్నిరోజులు భారంగా ఉండను. అందుకే నా దారి నేను చూచుకోబోతున్నాను" అంది.

"నేను ఉన్నాను వదినా! మీకు నేను వున్నాను."

"హుఁ! నా మెడలో మూడుముళ్ళు వేసినవాడే నాకు స్వంతం కానపుడు నీవెలా నాకు బంధం అవుతావు మధూ!"

"అవుతాను వదినా! అన్నయ్యకన్నా మీమీద నాకే అధికారం వుంది. అన్నయ్య మీ మెడలో మూడుముళ్ళు వేశారేకాని, మీమీద ఎలాంటి అధికారం చూడలేదు. కాని నేను... మీ ఇప్పటి పరిస్థితికి పూర్తి కారకుడ్ని నేను. అన్నయ్య మూడుముళ్ళు వేయకముందే, మిమ్మల్ని తల్లిగా చేసినవాణ్ణి నేను."

క్షణం నిశ్శబ్దం.

అక్కడున్న ఇద్దరికి అతను ఏం చెప్తున్నాడన్నది అర్థం కావడం లేదు.

ఇద్దరూ వింతగా మధువైపే చూస్తున్నారు. ఇద్దరికి ఏం మాట్లాడాలన్నది తోచడంలేదు. మధు ఏదో కాకమ్మ కథ చెప్తున్నట్లు నమ్మనట్లుగా స్థాణువుల్లా నిలబడి వున్నారు.

క్షణాలు సెకన్లు, సెకన్లు నిమిషాలులా మారుతున్నాయి.

భరతే తేరుకుని "మధూ! పిచ్చివాడిలా మాట్లాడకు. తను తాగివచ్చింది కాని, నీవు కాదు. నీకు తనమీద ఎంత అభిమానమున్నా ఇలా తన తప్పు నీమీద వేసుకోను ప్రయత్నించకు. దేనికయినా కొన్ని ఎల్లలనేవి వున్నాయి."

ఆ మాత్రమయినా పలుకలేని అంజుకు నోరు పెగిలి రాలేదు. భరత్



చెప్పింది నిజమే! మధు చూపించే దయకు ఒక ఎల్లయే లేదా అని ఆలోచిస్తున్నది.

"ఎంత నమ్మకం అన్నయ్యా మీ తమ్ముడిమీద. కాని అదే నమ్మకం మరొక ఆడపిల్లమీద చూపలేకపోయారు. వదినా! ఏదో ఆదర్శం పేరుతో, నాగరికత సాకు చెప్పి మిమ్మల్ని యిండియా నుండి తీసుకు వచ్చింది మీ పరిస్థితికి జాలి కలిగి అనుకుంటున్నారు కదూ! నేను ఒక సాధారణ మగవాడినే వదినా! నేను చేసిన పాపానికి పరిష్కారం వెదుక్కోను మిమ్మల్ని ఇంతదూరం తీసుకుని రావడం, ఏదో మా అన్నయ్య మనశ్శాంతికొరకు మటుకేకాదు. మీ కడుపులో పెరుగుతున్న నా బిడ్డను నేను తీసుకోవాలనే ఉద్దేశ్యంతో కూడాను. ఈ విషయం మొదటే చెప్పాలనుకొన్నాను. కాని మీ గర్భానికి కారకుడు నేను అని తెలిస్తే అన్నయ్య మిమ్మల్ని పూర్తిగా కాదంటాడని, కనీసం మీరైనా అన్నయ్యమీద అంతటి మమత పెంచుకొనకుండా వుంటే మీకైనా చెప్పివుండేవాడ్ని. నేను చేసిన పొరపాటువల్ల మన ముగ్గురి జీవితాలలో శాంతి అన్నది లేకుండా పోయింది. ఏ బిడ్డకొరకయితే మిమ్మల్ని మీ వాళ్ళని ఒప్పించి తీసుకువచ్చానో, ఆ బిడ్డ కూడా దూరమయింది. నేను చేసింది క్షణికమైన ఆవేశంలో పొరపాటు. అంతే! మిమ్మల్ని మీ ఇంట్లో కలిసినప్పటినుండి ఇప్పటివరకు నేను మిమ్మల్ని నా అన్న భార్యగా తప్ప మరెలాంటి చెడు అభిప్రాయంతో మసలిందే లేదు.

అన్నయ్యా! మీరు అడ్డుకోకుండా వినండి. వదిన తన కాలేజి యక్స్‌కర్షన్స్ గురించి చెప్పడం మీరు వినే వుంటారు. ఒక వేళ వినకున్నా ఇప్పుడు నేను చెప్తున్నాను వినండి. వదిన తన కాలేజి స్టూడెంట్స్‌తో క్రాఢ్లై కెనాల్‌కు ప్లాంట్స్ కలక్షన్ కొరకు వచ్చింది. ఆ రోజు రెడ్ ఇంక్‌లో అండర్‌లైన్ చేయాల్సిన రోజు, జనవరి ఐదవ తేది. వదిన చెప్పిన మద్రాసు యమ్మెస్సి స్టూడెంట్సులో నేను ఒకడ్ని. వదిన మా లేడీ స్టూడెంట్స్‌ను కలిసినపుడు నేను లేను. అందువలననే నేను వదినను చూడలేదు. ఆ రోజు జనవరి ఐదవ తేది, నేను మా స్టూడెంట్సుతో కలియక కొన్ని ఫోటోలు తీసుకోవాలన్నట్లుగా బయలు దేరి, నాకు నచ్చిన దృశ్యాలను కెమెరాలో బంధిస్తూ ప్రకృతి సౌందర్యాలను తిలకిస్తూ కనిపించిన దారికుండా వస్తున్నాను. ఇంతలో సడన్‌గా చీకట్లు ముసురుకున్నాయి. సన్నగా పడుతున్న తుంపర కుంభవర్షంగా మారింది. ఒక్కసారి ప్రకృతి అంతా కాటుకలా మారింది. కాని నా వీపునవున్న నాప్‌శాకల్ అవసరానికి కావలసిన ప్రతి వస్తువు వున్నందువలన వెంటనే దాన్లోనుండి టార్చిలైట్ తీసుకుని వెలిగించి వస్తున్నాను. విపరీతమైన చలి. నా వంటిమీద ఉన్న స్వెట్టరు, దాని పైనవున్న జాకెట్‌ను మించిపోయింది. త్వరత్వరగా అడుగులు వేస్తూ వస్తున్నాను. ఇంతలో కాలికి మెత్తగా ఏదో తగిలినట్లయి ఎగిరిపడి ఏమయి వుంటుందని వంగిచూశాను. పవర్‌పుల్‌గా వెలుగుతున్న ఆ పెద్ద టార్చిలైటు వెలుగులో నా కాళ్ళదగ్గరున్నది ఒక యువతి శరీరం అనిపించింది. వానకు తడిచి, ఒంటికి అంటుకుపోయి

మోకాళ్ళ వరకు తొలిగిన పావడ జాకెట్‌మీద తడిచి ముద్దయిన గులాబి రంగు స్వెట్టరు తప్ప పమిట కూడా లేదు. తలమీద గడ్డకట్టిన రక్తం గుండా ఇంకా రక్తం కారుతూనే వుంది. ఒక్క క్షణం భయంతో బిగుసుకుపోయాను. కారణం, ఎవరో ఈ అమ్మాయిని కొట్టి కనిపించకుండా ఇక్కడ ఈ ముళ్ళ పొదలలో విసిరేసి వుంటారని అనుకున్నా. వంగి పరీక్షగా చూశాను. గుండెలు కొట్టుకుంటున్నాయి. ఉఛ్వాశనిశ్వాసలు యథా ప్రకారం తమ పని తాము చేసుకుంటున్నాయి. ఆ అమ్మాయిని తాకి చూశాను. శరీరమంతా మంచుగడ్డలా వుంది. కాని చలనంలేదు. ఎంతగా కదిపించినా, పిలిచినా ప్రాణంలేని బొమ్మలా వుంది.

మెల్లగా రెండు చేతులతో పైకెత్తి ప్రక్కనే వున్న పెద్ద చెట్టుక్రిందకు తీసుకుని వచ్చాను. అక్కడ ముళ్ళు, కొమ్మలు లేకుండా చేసి పండబెట్టాను. ఆ తరువాత ఏం చేయాలో తోచలేదు, తనను అలా నిర్దయగా ఆ కారు చీకట్లో వదలి వెళ్ళలేను. అలా అని తనను ఎత్తుకుని ఈ చీకట్లో రెండు మూడు మైళ్ళు నడచి టౌన్ చేరడం సాధ్యమయిన విషయంకాదు. ఆలోచించాను, చేతి గడియారం చూచుకున్నా, గంట ఏడయినా కాలేదు. ఈ అమ్మాయికి ఏ క్షణంలో నయినా స్పృహ రావచ్చు. అప్పుడు ఇద్దరం ఏలాగో ఊరు చేరవచ్చు. అంత వరకు తను ఇక్కడ గడపాల్సిందే అనుకుంటు. నామీదనున్న జాకెట్ ఆ అమ్మాయి స్వెట్టరు విప్పి కప్పాను. నా బ్యాగ్ తెరిచి దూదితీసి రక్తాన్ని తుడిచాను. మరి కొంచం దూది అద్ది కర్చీఫ్ కట్టాను.

బ్రాంది బాటిల్ తెరిచి, నేను కొంచం తాగి తన పెదవులు విప్పి నోట్లో పోశాను. కాని నేను పోసినది పోసినట్లే తిరిగి వచ్చింది. అలాగే లైటు కాంతిలో ఆ అమ్మాయి వైపే చూస్తుండి పోయాను, తడిసిన వెంట్రుకలు, ఒంటికి అంటుకుపోయిన పావడ, వళ్ళంతా గీరుకుపోయినా వాన నీళ్ళకు తుడుచుకు పోయినందువల్ల ఎక్కడా రక్తపు కర్రలు లేకుండా తెల్లగా తళతళలాడుతున్న కాళ్ళు, చేతులు, ఎంతో అందాలతో మెరుస్తున్న మొహం, నాలో మెల్లిగా మరొక మనిషి మేల్కొంటున్నాడు. చలికి నా శరీరం వణుకుతుంది. క్రమేణా కడుపులోనున్న మందు పని చేయడంతో, చేరువలోనున్న అమ్మాయిని దగ్గరకు తీసుకోమన్నట్లుగా తొందరచేసే శరీరాన్ని అరికట్టలేకపోయాను. మరుక్షణం నన్ను నేనే మరిచాను. సుఖం కావాలనుకొన్నప్పుడు పూలపాన్పులు అవసరంలేదు, మెత్తని ఫోమ్ బెడ్‌లు అవసరం లేదన్నట్లుగా ఆ ఆకులే పడకగా తలుచుకుంటూ ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకున్నాను. ఇంత జరుగుతున్నా ఆ అమ్మాయిలో చలనమే లేదు. నా కోరిక తీరింది. నాలో వేడి చల్లారింది. ముంచి పోస్తున్న వాన తగ్గింది. అమాయకంగా ఇంకా కళ్ళు మూసుకునే ఉంది ఆ అమ్మాయి. మెలకువ వచ్చేంతవరకు అక్కడే గడపాలనుకొన్నాను. ఆ రాత్రి అక్కడే తన ప్రక్కనే



నిద్రపోయాను. తిరిగి కళ్ళు విప్పిన నాకు గంట చూస్తే నాలుగున్నర అయింది. ఆ అమ్మాయి తలకున్న కర్చీఫ్ విప్పేశాను. నా కోటు తీసుకుని తడిసిన స్వెట్టరును తిరిగి వేశాను. టార్చ్‌లైట్ బెల్టుకు కట్టుకుని రెండు చేతులతో తనను ఎత్తుకుని రోడ్డు వరకు నడుచుకుంటు వచ్చాను. రోడ్డుకు ప్రక్కగా కనిపించేట్టుగా తనను పరుండచేసి దూరంగా పోయి చూస్తూ కూర్చున్నాను. ఎవరైనా తీసుకుపోతారేమోనని. త్వరలోనే స్టూడెంట్స్, లెక్చరర్స్ ఇద్దరూ ఆ అమ్మాయిని చుట్టుకోవడం, ఏవేవో మాట్లాడుకోవడం, ఆ తరువాత అటువైపే పోతున్న కారును నిలిపి ఆ అమ్మాయిని తీసుకుని పోవడం అన్నీ చూశాను. ఆ అమ్మాయి భారం వదిలింది. ఆ మరుసటిరోజే మద్రాసుకు వచ్చేశాను. అప్పుడప్పుడు ఆ అమ్మాయి గుర్తుకొచ్చేది. వెంటనే అది కల అన్నట్లుగా ఊహించుకుని మరచిపోయేవాడిని. అంతేకాని నేను చేసింది ఒక ఘోరమైన కార్యం అని ఏనాడూ తెలియలేదు. మీ వివాహానికి హడావిడిగా కొంతమంది స్నేహితులతో, ఫ్రెండ్ కారు తీసుకుని నేనే డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నాను. ఎదురుగా లారీ రావడంతో కారు కంట్రోల్ తప్పడం, ఆ తరువాత అది వెళ్ళి రోడ్డుకు ప్రక్కగానున్న రావైన్‌లోకి దొర్లడం అన్నీ క్షణాలలో జరిగిపోయాయి. తిరిగి కళ్ళు విప్పింది హాస్పిటల్లోనే. మీ దురదృష్టమో, నా అదృష్టమో మీ పెండ్లికి రాలేకపోయాను. ఒకవేళ నేనే ఆ మ్యారేజ్‌కి వచ్చివుంటే ఏమైవుండునో ఇప్పటికి ఆలోచించినా అర్థంకాదు. మీరు నన్ను చూడకనే తిరిగి సింగపూరుకు వచ్చేశారు. ఆ తరువాత పిన్ని, చిన్నాన్న నన్ను చూడవచ్చారు. కాని మీ వివాహ ప్రసక్తి నా ముందర ప్రసంగించిందేలేదు. నా కోర్సు పూర్తవడంతో, పిన్ని, చిన్నాన్నలను చూసి వెళదామన్న ఉద్దేశంతో అక్కడికి వెళ్ళాను. కాని అక్కడ పిన్నిద్వారా షాక్ గలిగించే న్యూస్ బయటపడింది. పిన్ని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఆ అమ్మాయి ఎక్కడుందని అడిగాను. అదే పూరని. చదువు ఆపేసి ఇంట్లోనే వుందని చెప్పింది. నాకెందుకో ఒక్కసారి అమాయకంగా తనకేం జరుగుతున్నదో కూడా తెలుసుకునే స్థితిలోలేని ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది. ఒక్క క్షణం నేనుచేసిన తప్పుకు అన్నయ్య శిక్ష అనుభవిస్తున్నాడా అన్న ఆలోచన కలిగింది. అందుకు తోడు పిన్ని మీ పెండ్లి ఫోటోలు, వదిన పాస్‌పోర్టు వున్న కవర్ నా ముందర పడవేసి, చూడు ఆ అమ్మాయి భరత్ జంట ఎంత అందంగా వుందో! భగవంతుడే వాళ్ళ జంటను ఓర్చలేకపోయాడు. అని తిరిగి ఏడ్చింది. నా చేతులు వణికాయి. మెల్లగా ఆ ఫోటోను తీసి ఒకటొకటిగా తీసుకుని చూస్తుంటే నా కాళ్ళక్రింద భూమి కంపిస్తున్నట్లయింది. నా చేతులలోనున్న కాఫీ కప్పు క్రిందపడి బద్దలయింది. ఊరికే అనలేదు. చేసిన పాపాలు నీడలులా వెన్నంటే వస్తాయని, పిన్ని ఏదో చెప్పుకుపోతూంది. కాని అది వినిపించుకునే స్థితిలో లేను. నా బిడ్డ వదిన కడుపులో పెరుగుతోంది. ఆ బిడ్డకు మీరు తండ్రి అని ఎలా సరిపెట్టుకో

గలరు. ఎంతగా కోరుకున్న అమ్మాయి అయినా ఒకనాటికి మీరు ఆ అమ్మాయిని స్వీకరించరు. వివాహం కాకముందే తల్లిని నేను చేస్తే, పెళ్ళిచేసుకున్న మీరు ఆ అమ్మాయిని నడిసముద్రంలో ముంచిపోయారు. ఎవరుచేసిన తప్పుకు ఎవరు బాధ్యులు. నాకు ఒకసారి వదిన స్థానంలోనున్న ఆ అమ్మాయిని చూడాలనిపించింది. పిన్నికి చెప్పకుండానే వాళ్ళ ఇంటికి వెదుక్కుంటూ వెళ్ళాను. నిశ్శబ్దంలో, శ్మశానవాటికను గుర్తుతెస్తూ వెలవెలబోతున్నట్లు ఉంది ఆ ఇల్లు. ఇక ఆ ఇంట్లో మనుషులు కేవలం మరబొమ్మలులా ఉన్నారు. వదిన పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నోరు విప్పనే భయపడుతుంది వదిన. తనను చూసిన క్షణానే ఎక్కడో కొట్టుకుంటున్న కొన ఆశ తను తను కాకూడదు అన్న ఆ ఆశ అడుగంటిపోయింది. నేను చేసిన తప్పుకు నేను బాధ్యుడను. వదిన బాధ్యత నాది. వదినను ఎలాగైనా మన ఇంటికి పిలుచుకుని రావాలనుకొన్నాను. మీరు కాదన్నా ఔనన్నా వదిన స్థానం మన ఇల్లు. వదిన మనస్సులో మీరుతప్ప ఎవరూ లేరని తెలుసుకున్నాను. వదిన తలిదండ్రులనూ అతి కష్టంమీద ఒప్పించాను. ధైర్యంగా ఇంటికి పిలుచుకువచ్చాను. వదిన నన్ను క్షమించింది. నాకు సహోదరి ప్రేమను ఇచ్చింది. కేవలం తన పరిస్థితికి జాలిపడే నేను తనమీద కరుణ చూపుతున్నాననే అనుకుంది. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నాడని ఈ దుర్మార్గుడు అనుకోలేదు. కానీ అన్నయ్యా! ప్రమాణంచేసి చెప్తున్నాను. మీకు భార్యగా నాకు వదినగా ఈ ఇంట ప్రవేశించిన వదినమీద నాకెలాంటి చెడ్డ అభిప్రాయం ఈనాటివరకు కలగలేదు. తను మీ కొరకే పుట్టింది, మీకుమటుకే స్వంతం అని ఈనాటివరకు అనుకుంటున్నాను. ఎంతో ఓర్పుతో ఎదురుచూశాను మీరు వదినను స్వీకరిస్తారని. అది అసంభవం అని తెలిసిపోయింది. అందుకే.... అందుకే!" మధు అంజువైపు తిరిగాడు.

అంజులో కాని, భరత్‌లో కాని చలనం అన్నది లేదు. ఇద్దరూ రాతి బొమ్మలా నిలబడి వున్నారు. ఇద్దరి కళ్ళుమటుకే మధువైపు చూస్తున్నాయి.

"అంజూ!" వదిన అన్న వరుసను వదలినట్లు పేరుతో పిలుస్తుంటే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చినట్లు అతనివైపు ఏమిటన్నట్లు చూసింది.

"అంజూ! ఈనాటినుండి నీవు నాకు స్వంతం. ఇక్కడినుండి పోదాం. పెళ్ళిచేసుకుందాం. మునుపు మీకు జరిగింది బొమ్మలపెళ్ళి అనుకుందాం. మీ ఇన్నిరోజుల నరకయాతనకు ఒక ముగింపు పెడుదాం. ఇకమీదట మీ జీవితంలో ఎలాంటి అపస్వరం పలుకనీయకుండా చేసే బాధ్యత పూర్తిగా నాది. కమాన్!" మధు ముందుకు రెండడుగులు వేశాడు.

తెప్పరిల్లిన అంజు మెడలోనుండి పసుపుదారాన్ని పైకిఎత్తి "దీనిని ఏం చేయమంటావు" అంది.

"అది వెంటనే తీసిపారేయండి. అన్నయ్య అనాడే చెప్పారుగా తెంచి పారెయ్యమని."



"అలాగే! కాని నేను నీలా నవీన నాగరికతకు వారసురాలుగా పెరగలేదే! నీవన్నట్లు అంత సులువుగా తెంచిపారెయ్యను. మీ అన్నయ్య ఆ పని చేయరు. ఎందుకంటె ఆయన నన్ను తాకితేనే భస్మమయిపోతారు. అదేదో నీ చేతులమీదే జరిగిపోనీ! ఈ కాలానికి ప్రతినిధివి నీవు. నీకు ఎందులోను తప్పొప్పులు కనిపించవు." మొహం ఎలాంటి భావావేశాలు కనుపరుచక తొణకకుండా అంది.

భరత్ ఇదంతా చూస్తూనే వున్నాడు. అతని మైండ్ పూర్తిగా బ్లాంక్ అయినట్లు. తనముందు జరుగుతున్నదంతా ఏమీ తనను సోకనట్లు నిశ్చలంగా నిలబడి వున్నాడు.

మధు ఒక అడుగు దూరంలో అంజుకు దగ్గరగా వచ్చి తన చేతులను అంజు మెడచుట్టూ వేయబోయాడు.

మరుక్షణం.

అంజు రెండు చేతులు ఎక్కడలేని బలం తెచ్చుకుంటూ అతనిని విసురుగా వెనక్కు నెట్టాయి. వెలుపలికి అతను స్టడీగా వున్నట్లు కనిపిస్తున్నా, అంతరంగికంగా అతని శరీరంలోని అంగాంగం చచ్చుబడిపోవడం అతనికి తెలుస్తూనే వుంది. ఏ దేశంలో పుట్టినా, ఏ దేశంలో పెరిగినా అతను ఒక భారతీయుడే! అతనిలోను ఆ భారత రక్తమే ప్రవహించేది. మరొక దేశంలో పుట్టగానే రూపురేఖలు ఎలా మారవో కొన్ని సాంప్రదాయాలు, మరికొన్ని కట్టుబాట్లు అలాగే మారవు. అలా అని బాహ్యంగా అతను ఒప్పుకోకపోయినా అంతరంగికంగా అతనికి తెలుసు. కాలం మారవచ్చు. కొన్ని అలవాట్లు మారవచ్చు. కట్టుబాట్లు మారవచ్చు. కాని పూర్తిగా కాదు. అలా ఎన్నటికి మారనిది, విలువ తరగనిది అగ్నిసాక్షిగా జరిగిన వివాహం. దానిని మార్చను ఎవరితరంకాదు. మానసికంగా అతను బలహీనుడయినందువలననే అంజు తోసిన తోపుకు దూరంగా సోఫామీదకు విసురుగా పడ్డాడు.

"అంజూ!"

"షటప్! మరొకమారు పేరుతో పిలిచావో నీ ప్రాణాలు తీస్తాను."

అతను పైకిలేస్తూ "అంజూ! నా మాట విను. మొదట అది అసంభవమే అని అనిపించవచ్చు. కాని అది జీవితాంతం కాదు. పాదరసంలాంటి మనస్సును మనం ఎటువైపు అయినా తిప్పుకోవచ్చు. అది మన ప్రయత్నం మీద ఆధారపడి వుంది. మీ మనస్సు మారుతుంది. అది మారేదాకా నేను కాచుకుని వుంటాను. కాని అంతవరకు మన కలయిక అవహేళనకు గురికాకుండా భార్యాభర్తలు అనే అధికారపూర్వకమైన అనుబంధానికి కట్టుబడి పెళ్ళిచేసుకుందాం." ఆ మాటలతో అంజు పూనకం పట్టినదానిలా ఊగిపోతూ, కాలికి దగ్గరగానున్న టీపాయ్ విసురుగా చేతులలోకి తీసుకుని దగ్గరగా వస్తున్న మధుని అందినమేరకు సర్వం మరచి వేగంగా బలంగా అతనిని కొట్టసాగింది. [illegible] తగులుతున్న కాళ్ళు అతని నుదుట తగిలి రక్తం ధారలు కడుతోంది. రొప్పుతోంది అంజు. కారే రక్తాన్ని

తుడుచుకోవడం కాని, ఆ దెబ్బలను అడ్డుకోవడం అన్నదికాని మధు చేయడం లేదు. అది కోర్టువారు తనకిచ్చే శిక్షకన్నా చాలా స్వల్పం.

"ఏమనుకున్నావ్ నన్ను. మీ చేతులలో ఆడే ఆటబొమ్మననుకొన్నారా! నేను మనిషిని కానూ? నాకు మనస్సు లేదూ? నీది కావొచ్చు పాదరసంలాంటి మనస్సు. కాని అందరిదీ అలాగే వుంటుందని అనుకోకు. ఈ రోజు నిన్ను చంపి నేను చస్తాను. ఈనాటితో మన కథ ముగిసిపోతుంది" ఎగిరెగిరిపడే గుండెలను అదుపులోకి తెచ్చుకోవాలన్నట్లుగా ఆగింది.

అంతవరకు శరీరంలోని ప్రతి అణువు మొద్దుబారిపోయినట్లు, ఎదుట జరుగుతున్న బీభత్సం కూడా ఆకళింపు కానట్లు కోవెలలోని శిలావిగ్రహంలా నిలబడిపోయిన భరత్ అంజు మాటలతో ఇహంలోకి వచ్చిపడ్డాడు.

మధు. అవును తన మధు. తన ప్రియమైన తమ్ముడు ఏంచేశాడు.

"మధూ!" ఒక్కసారిగా పెద్దగా కేకబెట్టాడు. అప్పుడుకాని తన ఎదురుగా అపరచండిలా వున్న అంజును, నుదుటినుండి, ముక్కు, చెంపలుమీదుగా కారుతున్న రక్తంతో నిలబడివున్న మధును గుర్తించలేకపోయాడు.

మరుక్షణమే అంజును బలంగా, విసురుగా వెనక్కు తోశాడు. "యూ ఇడియట్! మధును చంపేస్తున్నావు." అంటూ మధు తలను దగ్గరకు తీసుకొని సోఫాలో పడుకోబెట్టి, ఫోన్ అందుకున్నాడు.

"ఏం? మీకు తోడబుట్టినవాడనేకదూ అంత మమత? నా గురించి ఏనాడయినా ఆలోచించారా! నేను వేరొక తల్లి కన్నబిడ్డనే కదూ! ఆ తల్లి గుండెలు ఇలాగే మండివుంటాయి అని తెలియదూ! ఒక్కనాడు ..ఒక్కనాడు ప్రశ్నించారా ఏమయిందని. ఎలా అడుగుతారు? మీ దృష్టిలో నేను పెళ్ళికాకముందే ఎవడితోనో కడుపు తెచ్చుకున్నదాన్ని. సెక్స్ మేనియాక్‌ని, నీతిలేనిదాన్ని, చెడిపోయిన వంశంలోనుండి వచ్చినదాన్ని. మీ దృష్టిలో ప్రతి ఆడపిల్ల సిగ్గు వదిలేసినదే! మీరంతే! మీ మగజాతి అంతే! మీరు, మీ తమ్ముడు, నా తండ్రి ప్రతి ఒక్కరూ ఒక్కటే! మీకు ఆలోచనాశక్తి శూన్యం. ఏది ఎలా జరిగినా ఆ తప్పు ఎదుటనున్న ఆడవాళ్ళమీద పెట్టి నిందించడం మీ గొప్ప మనసుకు గౌరవం. మీరు.... మీరు.... పురాణకాలాన్ని ముందుకు తెచ్చి అందులోనుండి సతీ సావిత్రులనో, సతీ అనసూయలనో ఎన్నుకుని వివాహం చేసుకోండి. వస్తా! గుడ్‌బై!" పరుగెత్తింది.

"అంజూ! ఆగు!" భరత్ మాటలు గాలిలోకి కలిసిపోయాయి.

ఒకే పరుగు, కాళ్ళకు ఎక్కడినుండి వచ్చిందో అంత శక్తి. కనిపించిన మెట్లగుండా ఒక్కొక్క అంతస్తు చేరుకుంటు చివరగా ఉపరి భాగానికి చేరుకుని మూడడుగులైనా ఎత్తులేని గోడ దగ్గరగా వచ్చి ఆగింది. అదిరదిరి పడుతున్న గుండెలు, వేగంగా వస్తున్న వుచ్ఛ్వాసనిశ్వాసలు! వణుకుతున్న కాళ్లు. చెమటలు



కక్కుతున్న శరీరం, అలాగే నిలబడి క్రిందకు చూడసాగింది.

అయిపోయింది, తన జీవిత కథ ఈనాటితో సమాప్తి. ఇరవయి సంవత్సరాలలోపే ఎన్ని భయంకర అనుభవాలు! ఏనాడు పెండ్లి పీటలమీద కూర్చున్నదో కాని ఆనాటినుండి తన బ్రతుకు ముళ్ళదారిగుండానే నడిచింది. మధు.... మధును ఎంతగా అభిమానించింది. మధు ప్రేమ నిస్వార్థమైనదనే తలచింది. కాని అతనే కథా నాయకుడని తలచలేకపోయింది. ఒక్క క్షణంకాదు! అర క్షణం మధు తనుచేసే నీచకార్యంముందు ఎదుటి ఆడపిల్ల భవిష్యత్తు ఏమవుతుందా అని ఆలోచించి వుంటే తన బ్రతుకు ఇలా అర్ధాంతరంగా ముగిసిపోతుందా! తను అందరి ఆడపిల్లలులా భర్త, పిల్లలతో సుఖంగా జీవించి ఉండేది కదూ! ఇంత కథ జరగాలని విధి నిర్ణయించినప్పుడు తన ఆలోచనలు, ఆశలు వ్యర్థం. ఎక్కడో పుట్టింది. మరెక్కడో చావబోతూంది. క్రింద అంతా ప్రశాంతంగా వుంది. చిన్న చప్పుడయినా వినిపించేటట్లుంది. రేపటికి నిర్జీవమైన శరీరం, చెల్లా చెదురుగా పడివున్న కాళ్లు, చేతులు చెదిరిపోయిన మొహం. అందమైన అంజు అతి భయంకరంగా అందరి కళ్ళ బడుతోంది. కాని ఒకటిమటుకు తృప్తి అనిపిస్తున్నది. భరత్ అనుకున్నట్లుగా తను నీతిలేనిదాన్ని కాదు అన్నది ఋజువైంది. అది ఒక్కటి చాలు నెమ్మదిగా ఈ లోకం విడిచిపోను. ఆత్మహత్య అన్నది తన నుదుటిమీద వ్రాసి పెట్టింది కాబోలు. తనకు అంతకు మించి వేరే గత్యంతరంలేదు. తప్పు తనది కాకపోయినా ఒంటరిగా ఎంతకాలం ఎవరి ఆదరణ లేకుండా గడుపుతుంది. తను సూజీలాంటి ధైర్యశాలికాదు. తన బ్రతుకు తను బ్రతకడానికి ఒక్కసారి కళ్లుమూసుకొని, గాలిలోకి ఎగిరితే చాలు. తన కథ మరుగున పడుతుంది.

మెల్లిగా ఒక కాలు గోడపైన పెట్టింది, రెండవ కాలు కదుపుతోంది. వెనుక చప్పుడు. చటుక్కున వెను తిరిగింది.

తనకు కొన్ని అడుగుల దూరంలో అతను నిలబడి వున్నాడు. చెదిరిన తల, చెమటలు కారుతు పాలిపోయి ఉన్న మొహం, ఎప్పుడూ ఎంతో గంభీరంగా, మగసిరి వుట్టిపడేట్లుగా ఉండే అతనేనా ఇతను, అలాగే గోడ పట్టుకునే చూస్తోంది అతని వైపు.

"అంజూ!" మెల్లగా పిలుస్తూ ఒక అడుగు ముందుకు వేశాడు.

"దగ్గరకు రాకు. మరొక అడుగు ముందుకు వేశారో ఇక్కడినుండి దూకేస్తాను. వెళ్ళిపోండి. వెళ్ళండి ఇక్కడనుండి," అరిచింది.

అతనికి తెలుసు, గోడ ఎక్కి దూక అవసరంలేదు. కొంచం ముందుకు వంగినా రివ్వున వీస్తున్న గాలి అంజు కోరికకు సహాయపడేట్లుగా తన ప్రాణాలను అనంత వాయువుల్లోకి లీనమయేటట్లు చేస్తుందని. అంజును ఆ ప్రయత్నం నుండి ఆపాలి. తను అన్నిటికి తెగించి నిలబడి వున్నది.

"అంజూ! ఒక్కమాట. ఒకే ఒక మాట విను. ఆ తరువాత నీ అభీష్టాన్ని నెరవేర్చుకో! నీ ప్రాణం తీసుకునేముందు నా మనసులోనున్న మాట ఒక్కటే ఒకటి చెబుతాను. అది విని కూడా ఆత్మహత్యే నీకు శరణ్యం అనుకుంటే నేను అడ్డురాను. ప్లీజ్! అంజూ! నేను చెప్పేది వింటావు కదూ!" ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నాడు. వేస్తున్నాడు అనడంకన్నా జరుగుతున్నాడు అన్న సబబు. అంజు అది గుర్తించడం లేదు. తన చూపులు ముందుకు వెనక్కూ చూస్తున్నాయి.

"ఊహూ! మీరేం చెప్పినా వినదలుచుకోలేదు, నా ప్రయత్నాన్ని నేను ఆపను. ఆపదలుచుకోలేదు. దయవుంచి వెళ్ళిపోండి." అంజు రెండవకాలు పై కెత్తుతోంది. తనలో ఎక్కడలేని తెగింపు. ఆనాడు లేని తెగువ ఈనాడు తను చేసే పనికి త్వరగా చేయమని బలవంతం చేస్తోంది.

"అంజూ, అంజూ! నా మాట విను. నన్ను వదలి వెళ్ళకు." అతని కళ్ళలో నీరు, గొంతులో జీర, అంజు గోడ పట్టుకునే ఆగింది.

"అంజూ! నా మాట విను. నా కళ్ళలోకి చూడు, నా మనస్సు అర్థం చేసుకో! నిన్ను ఎంతో పిచ్చిగా ప్రేమించాను. నా సర్వస్వం నీవే అనుకొన్నాను. నీవు నా కొరకే పుట్టావనుకొన్నాను. నిన్ను చూసిన మొదటి క్షణంలోనే! కాని నీవు గర్భవతి అని తెలియగానే పిచ్చివాడినే అయాను. నేను అంతగా కోరిన అమ్మాయి మరొకరి చేతులలో నలిగి వాడిన పూవు అని తెలియగానే అవమానంతో, ఆవేదనతో కృంగిపోయాను, నీవు నా మటుకే స్వంతం అయి వుండాలని కానీ నీవు నాకన్నా ముందు మరొకరికి స్వంతమయి నన్ను మోసం చేశావని ఆవేశంతో నోటికి వచ్చినట్లల్లా మాట్లాడాను. అధికమైన ప్రేమ వలననే నిన్ను అంతగా ద్వేషించాను. అంజూ! బాగా విను. ఐ లవ్ యూ! ఐ లవ్ యూ సో మచ్! నీ ప్రాణాలు తీసుకొని నన్ను జీవచ్ఛవాన్ని చేయకు, నీవు నాకు కావాలి." చివరి అంగలో అంజు నడుమును రెండు చేతులతో బంధించి దగ్గరకు లాక్కున్నాడు.

(సమాప్తం)

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11, Chikkadapalli, Hyd-20, & Printed by P. Ramakrishna at Raghava Printers 1-8-4/1/1, Chikkadapalli, Hyderabad-20.

